JEE ADV - 2026
ఓపెన్ కేటగిరీ టాప్ 20లో 7
నారాయణ సాధించిన ర్యాంకులు
అంటే టాప్ 20లో 35% ఫలితాలు
నారాయణవే
నారాయణ విద్యాసంస్థలు
www.narayanagroup.com

www.prajapaksham.in
PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం ★

JEE ADV - 2026
ఓపెన్ కేటగిరీ టాప్ 25లో 10
నారాయణ సాధించిన ర్యాంకులు
అంటే టాప్ 25లో 40% ఫలితాలు
నారాయణవే
నారాయణ విద్యాసంస్థలు
www.narayanagroup.com

సంపుటి 09, సంచిక: 183 | బుధవారం | 03-06-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# తెలంగాణలో సవాళ్ల పర్వం

తెలంగాణలో ఎన్నికలకు ఇంకా దాదాపు రెండున్నర సంవత్సరాల సమయం ఉంది. మోదీ ప్రభుత్వం తలపెట్టిన 'ఒక దేశం – ఒకే ఎన్నికలు' కార్యరూపం దాల్చితే మరో ఆరునెలలు అదనపు వ్యవధి దొరకవచ్చు. ఏదిఏమైనా, అనునిత్యం ప్రధాన పార్టీల మధ్య సాగుతున్న వాదోపవాదాలు వింటుంటే రాష్ట్రం ఎన్నికల మోడ్‌లో ఉన్నట్లే అని అనిపించక మానదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అంతా మంచే చేస్తున్నట్లు, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నట్లు చెప్పుకోవటం పరిపాటి. ఆ వాదనల్లోని లోటుపాట్లను విశ్లేషించి ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోణాలనుంచి ప్రతిపక్షాలు ప్రతి ప్రకటనలు చేయటం, అనేక సమస్యలపై స్వయంగా లేక వాటి ప్రజాసంఘాలు–ఆందోళన కార్యక్రమాలు నిర్వహించటం సర్వసాధారణ ప్రజాస్వామ్య ప్రక్రియ. తెలంగాణలో రాజకీయం నిత్యం కత్తులు దూసుకుంటూ నోటికి పదునుపెట్టి పరుషమైన భాష ఉపయోగిస్తున్నది. ఇది విమర్శలు, ఆరోపణల స్థాయి దాటి సవాళ్ల దశకు చేరింది. ఈ నాయకుల రోజువారీ టీవీ బైట్లు, భాష తమ కార్యకర్తలను ఉద్రేక పరిచి చురుకుగా ఉంచుకోవచ్చుగాని, విస్తృత ప్రజానీకం వాటిని చెవి కెక్కించుకోవటం లేదని గ్రహించటం లేదు. ప్రతిపక్ష బిఆర్‌ఎస్, బిజెపి ఏ సమస్యపై ఆందోళన చేబట్టినా అది కేవలం కార్యకర్తల ఆందోళనగా ఉంటున్నదేగాని విస్తృత ప్రజానీకం పాల్గొనటం లేదనేది కనిపిస్తున్న వాస్తవం. ఈ రెండు ప్రతిపక్ష పార్టీలకు తోడు బిఆర్‌ఎస్ నుంచి వేరయిన ఒక చిన్నపాయ – కెసిఆర్‌గారి కుమార్తె శ్రీమతి కవిత 'తెలంగాణ రక్షణ సేన'(టిఆర్‌ఎస్) పేరుతో పార్టీని ప్రకటించి కొన్ని కార్యక్రమాలు, ప్రకటనలతో తమ ఉనికిని జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

మరోవైపున, వామపక్షాలు తమ బలహీనతలను అధిగమించి రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా పూర్వం తమకు బలమైన (ఉమ్మడి) జిల్లాల్లో ఉద్యమాల ద్వారా బలపడటానికి కృషి చేస్తున్నాయి. వామపక్ష పార్టీల్లో పెద్దదైన సిపిఐ జాతీయ రాజకీయాల్లో ఇండియా కూటమి భాగస్వామిగా గత ఎన్నికల నుంచి కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తు కలిగి ఉంది. ఒక ఎమ్మెల్యే (కూనంనేని సాంబశివరావు) ద్వారా 10సంవత్సరాల విరామం తర్వాత అసెంబ్లీలో వివిధ ప్రజాసమస్యలపై వామపక్షవాణి వినిపించే అవకాశం లభించింది. అయితే అది సరిపోదనీ, ప్రజాక్షేత్రంలో ప్రజా ఉద్యమాలు, పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణాన్ని అభివృద్ధి చేసుకునేందుకు సన్నద్ధమవుతోంది. పార్టీకి బలమైన ప్రజాపునాది కలిగిన 40 నియోజకవర్గాల్లో ఆగస్టు 6 నుంచి 14వరకు పాదయాత్ర నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్ణయించింది. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా 10వ తేదీన రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమం, 15న ఎన్నికల కమిషన్ 'సర్'పై హైదరాబాద్‌లో అవగాహన సదస్సు, కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను నిరసిస్తూ సెప్టెంబర్ 28న సిపిఐ జాతీయ సమితి నిర్ణయించిన చలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొనాలని నిర్ణయించింది. ఇది రానున్న కాలపు ఉద్యమాలకు ఆరంభం మాత్రమే. మరోవైపున రాష్ట్రంలో వామపక్ష ఐక్యకార్యాచరణకు ప్రయత్నాలు కొనసాగించి వామపక్షాలను ఐక్యం చేయటం కమ్యూనిస్టు పార్టీలకు మాతృసంస్థగా సిపిఐ కర్తవ్యం.

ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్‌ఎస్ 2008 ఎన్నికల్లో ఓటమిని ఇప్పటికీ జీర్ణించుకున్నట్లు లేదు. కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారనే అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తూ, తమ పాలనలోని నియంతృత్వ పోకడలు, అహంభావం పర్యవసానంగా జరిగిన నష్టం గూర్చి ఆత్మపరిశీలనతో దిద్దుబాటు చర్యలు మాని, కాంగ్రెస్‌పై ప్రతిరోజు రెండు గొంతులు (కెటిఆర్, హరీశ్‌రావు) విరుచుకు పడుతున్నాయి. మూసీ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ, ఇన్నర్ రింగ్‌రోడ్, కాలుష్య పరిశ్రమలను నగరం వెలుపలకు తరలింపు, జిహెచ్‌ఎంసి విస్తరణ, మూడు కార్పొరేషన్‌ల ఏర్పాటు – ఇలా ప్రతి కార్యక్రమాన్ని వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్నారు. కాదంటే తమ ప్రభుత్వం ఆరంభించిన నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవాలు చేసి క్రెడిట్ చోరీ చేస్తున్నారని అర్థరహితమైన వాదన చేస్తుంటారు. ప్రభుత్వం మారితే గత ప్రభుత్వ కాలంలో మొదలుపెట్టిన నిర్మాణాలను కొత్త ప్రభుత్వం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోతే ప్రజాధనం వృథా కాదా? ఆ కనీస స్పృహ కూడా వారికి లేదు. కెసిఆర్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరంభించిన ప్రాణహిత–చేవెళ్ల లాంటి పథకాలను పక్కనబెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టుపైనే కేంద్రీకరించిన ఏకపక్ష వైఖరి తప్పని గ్రహించకపోవటమే ఇటువంటి అసంబద్ధ ఆరోపణలకు మూలం.

ఇక పోయిన ప్రజాదరణను తిరిగి పొందటానికి రైతులపైనే ఎక్కువగా కేంద్రీకరిస్తున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.2లక్షల వరకు అర్హులందరికీ రుణాలు రద్దు చేసినా, సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నా, 24గంటలు ఉచిత విద్యుత్ కొనసాగిస్తున్నా, రైతు భరోసా, బీమా ఇస్తున్నా రంధ్రాన్వేషణలే. ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో పండిన రబీ వడ్లను చివరి గింజవరకు, అకాల వర్షాలకు తడిసిన ధాన్యం మొత్తం కనీస మద్దతు ధరకు కొంటామని ప్రభుత్వం చెబుతున్నా విమర్శలే. తాజాగా ధాన్యం కొనుగోలు అంశంతోపాటు సవాళ్లు గృహనిర్మాణాలపైకి మరలినాయి. బిఆర్‌ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్లంటే పేదలు మురిసిపోయారు. వాటి నిర్మాణాలు చాలావరకు పూర్తి కాలేదు, పేదలకు పంపిణీ జరగని వైఫల్యం ప్రజల ప్రత్యక్ష అనుభవం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పథకం పేరుతో తొలి విడతలో 1.25లక్షల ఇళ్లు పూర్తిచేసి పేదలకు అందించింది. మరో 2నెలల్లో మరో 2లక్షల ఇండ్లు నిర్మాణం పూర్తి కానుంది. తాజా సంవత్సరంలో క్యూర్ పరిధిలో లక్ష, ఇతర ప్రాంతాల్లో 2.50లక్షలు కలిసి మూడు లక్షల 50వేలు ఇండ్లకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఇది ఏ విధంగా చూసినా రికార్డు. దీన్ని మెచ్చుకోకపోతే పోయె, పూర్తిచేయలేకపోతే ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటారా అని కేటిఆర్ సవాలు చిన్నపిల్లాడి చేష్టలాగా ఉంది. బిఆర్‌ఎస్ హయాంలో కన్నా ఎక్కువ ఇండ్లు నిర్మించలేకపోతే తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటనకు ఇది ప్రతి సవాలు.

ఇక బిజెపి వారు వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే అనే ప్రకటనలతో కాలం గడుపుతున్నారు. అంతర్గత గ్రూపు తగాదాలతో అడుగు ముందుకు పడటం లేదు. ఇప్పటివరకు జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో 60శాతం పైగా విజయాలతో పాలక కాంగ్రెస్ పార్టీ ఆధిక్యతను కొనసాగిస్తున్నది. అవినీతి, ఢిల్లీకి మూటలంటూ బిఆర్‌ఎస్, బిజెపి నేతలు చేస్తున్న అసంబద్ధ ఆరోపణలను పట్టించుకునేవారు లేరు. కాబట్టి ప్రతిపక్షాలు వాస్తవిక దృష్టితో, ప్రజల మనస్సుకు దగ్గరగా ఉన్న సమస్యలు చేబట్టి వారి ప్రత్యక్ష భాగస్వామ్యంతో ఉద్యమాలు చేబడితే మేలు. 2029 వారిని దాటిపోయాక చింతించక తప్పదు. ●



## అనవసర బలవంతం తగదు

వందేమాతరం గేయంలోని ఐదు చరణాలతో పూర్తి గేయాన్ని పాడాలని ఆదేశించడం అనవసరమైన బలవంతమవుతుందది. వందేమాతరం గేయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తారు. అయితే ప్రతి కార్యక్రమంలోనూ పూర్తి గేయం పాడాలంటూ తప్పనిసరి చేయడాన్ని సమర్థించడం కష్టం. వందేమాతరం జాతీయ గేయం. దీనిని ఆలపించేటప్పుడు గౌరవంతో లేచి నిలబడతాం. మొదటి రెండు శ్లోకాలు జాతీయగీతానికి సమానమైన గౌరవాన్ని ఇస్తాయి. సాంప్రదాయబద్ధంగా వందేమాతరం గేయాన్ని కార్యక్రమం ప్రారంభంలో పాడతారు. జాతీయగీతాన్ని చివర్లో పాడతారు. అయితే ఇప్పుడు వందేమాతరం గేయంలోని ఐదు శ్లోకాలను ఈవెంట్ ప్రారంభంలో, మళ్లీ చివరల్లో పాడాలని అంటున్నారు. ఇది బలవంతంగా రుద్దడమే అవుతుంది.

– కాంగ్రెస్ పార్టీ ఎంపి శశిథరూర్



## ఎల్ నినోకు పరిష్కారం 'ఫోర్ వాటర్స్'

సుప్రసిద్ధ పర్యావరణవేత్త నీటి సంరక్షణావేత్త టి. హనుమంతరావు అభివృద్ధి చేసిన వినూత్న నీటి నిర్వహణ వ్యూహం 'ఫోర్ వాటర్స్' భావన. ఈ భావన నాలుగు రకాల నీటి వనరుల స్థిరమైన నిర్వహణను నొక్కి చెబుతుంది. ముఖ్యంగా కాలానుగుణ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్తులో ఉపయోగంకోసం వర్షపునీటిని సంగ్రహించడం నిల్వ చేయడం. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్, ట్యాంకులు, కుంటలు, తలపిరి చెరువులు వంటి వివిధ పద్ధతుల ద్వారా దీనిని సాధించవచ్చు. వర్షపు నీటిని మట్టిలో చొచ్చుకుపోయేలా చేయడం జలాశయాలను తిరిగి నింపడం ద్వారా భూగర్భజల వనరులను రీఛార్జ్ చేయడం నిర్వహించడం. చెక్ డ్యామ్‌లు, రీఛార్జ్ వెల్స్ కాంటూర్ ట్రెంచ్‌లను నిర్మించడం వంటి సాంకేతికతలు భూగర్భ జలాల రీఛార్జ్‌ను పెంచడానికి ఉపయోగించబడతాయి.

నదులు, సరస్సులు రిజర్వాయర్‌ల వంటి ఉపరితల నీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యవసాయ, గృహ పారిశ్రామిక అవసరాలకు స్థిరమైన నీటి సరఫరాను నిర్ధారించడం. ఇందులో నీటి వనరులను కాలుష్యం నుండి రక్షించడం, నీటి ప్రవాహాన్ని నిర్వహించడం, ఆనకట్టలు, ట్యాంకుల వంటి నిల్వ నిర్మాణాలను నిర్మించడం వంటివి ఉంటాయి. మల్చింగ్, కాంటూర్ దున్నడం అడవుల పెంపకం వంటి తగిన భూ నిర్వహణ పద్ధతుల ద్వారా నేల తేమను సంరక్షించడం. ఈ పద్ధతులు నేలలో నీటిని నిలుపుకోవడానికి, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడానికి నేల కోతను తగ్గించడానికి సహాయపడతాయి. 'ఫోర్ వాటర్స్' భావన నీటి నిర్వహణకు సమగ్ర విధానాన్ని ప్రోత్సహిస్తుంది, ముఖ్యంగా పాక్షికశుష్క ప్రాంతాల్లో కమ్యూనిటీలు, వ్యవసాయం పర్యావరణ వ్యవస్థలలో మద్దతునిచ్చే స్థిరమైన స్థితిస్థాపక నీటి సరఫరా వ్యవస్థను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది నీటి కొరతను పరిష్కరించడానికి నీటి సంరక్షణను ప్రోత్సహించడానికి సమాజ ప్రమేయం, సాంప్రదాయ జ్ఞానం స్థానిక పరిష్కారాలను నొక్కి చెబుతుంది. దేశంలోని వెనుకబడిన ప్రాంతాలలో కరువు పీడిత ప్రాంతం అయిన రాయలసీమ, ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో 'ఫోర్ వాటర్స్' భావన కీలక పాత్ర పోషిస్తుంది.

కమ్యూనిటీలెవల్ హార్వెస్టింగ్ ద్వారా వర్షపు నీటి ప్రవాహాన్ని సంగ్రహించడానికి పెద్ద కమ్యూనిటీ ట్యాంకులు లేదా చెరువులను నిర్మించాలి. పొడి కాలంలో ఈ నిర్మాణాలు కీలకమైన నీటి వనరుగా ఉపయోగపడతాయి. కాలానుగుణ ప్రవాహాలు, నదులపై చెక్ డ్యామ్‌లను నిర్మిస్తే తరచుగా మట్టి లేదా కాంక్రీటు అడ్డంకులు నీటి ప్రవాహాన్ని నెమ్మదిస్తాయి, ఇది భూమిలోకి చొచ్చుకుపోయేలా చేస్తుంది. పెర్కొలేషన్ పిట్స్, రీచార్జ్ వెల్స్ వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చేయడానికి జలాశయాలను తిరిగి నింపడానికి వ్యూహాత్మక ప్రదేశాలలో పెర్కొలేషన్ పిట్స్ రీఛార్జ్ బావులను తవ్వించాలి.

ప్రవాహాన్ని తగ్గించడానికి, భూగర్భజలాల రీఛార్జ్‌ను పెంచడానికి వ్యవసాయ భూమిపై కాంటూర్ ట్రెంచ్‌లు, బండ్‌లను నిర్మించాలి. ఇంటర్‌లింకింగ్ వాటర్ బాడీస్ ద్వారా ఒక దానితో ఒకటి అనుసంధానించబడిన ట్యాంకు లు, చెరువుల నెట్‌వర్క్‌ను రూపొందిస్తే, ఒక ప్రాంతం నుండి మిగులు నీటిని మరొక ప్రాంతానికి మళ్లించడం ద్వారా నీటి కొరత తగ్గుతుంది. రాబోయే వర్షాభావ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం నీటి సంరక్షణ యాజమాన్య పద్ధతులు చేపట్టాలి. రైతులకు ఇంకుడు గుంతలు, చెక్ డ్యాంలు, ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవడానికి రాయితీలివ్వాలి.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు,**
9989988912

### అమెరికాలో మధ్యంతర ఎన్నికల్లో కీలక పరిణామం

# బెర్నీ సాండర్స్ నామినీలకు కమ్యూనిస్టు పార్టీ మద్దతు

**సాత్యకి చక్రవర్తి**

ఈ ఏడాది నవంబర్‌లో అమెరికాలో జరిగే కీలకమైన మధ్యంతర ఎన్నికలకు కేవలం ఐదు నెలల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో, అక్కడి స్థానిక రాజకీయ పరిస్థితి వేడెక్కుతోంది. ఈ ఎన్నికలలో ప్రతినిధుల సభ మొత్తానికి, అలాగే సెనేట్‌లోని మూడింట ఒక వంతు స్థానాలకు ఓటింగ్ జరగనుంది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ 2028 చివరి నాటికి తన ప్రస్తుత పదవీకాలం ముగిసే వరకు అధికారంలో ఉన్నప్పటికీ, డెమోక్రాట్‌లు ఉభయ సభలలో గెలిచినా కూడా ట్రంప్ అధికార ప్రభావం తరిగిపోయి, ఆయన రెండేళ్లపాటు బలహీనంగా మారిపోతారు.

డెమోక్రాట్లు స్థానిక స్థాయిలో క్షేత్రస్థాయి సంస్థలను క్రియాశీలం చేసి, ద్రవ్యోల్బణం, అధిక నిరుద్యోగానికి దారితీసిన అధ్యక్షుడి అదుపులేని విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. డెమోక్రాట్లకు సానుకూల అంశం ఏమిటంటే, తాజా అభిప్రాయ సేకరణల ప్రకారం ట్రంప్‌కు 37శాతం ఓటర్ల ప్రజాదరణ మాత్రమే ఉంది. ఇది ప్రస్తుత పదవీకాలంలో ఆయనకు లభించిన అత్యంత తక్కువ ప్రజాదరణ అని తేలింది.

డెమోక్రాటిక్ పార్టీలో ప్రస్తుత ప్రచారంలో విధానాల దిశపై పోరాటం కొనసాగుతోంది. నిరుపేదల కోసం ఉచిత ప్రజారోగ్య, సంక్షేమ పథకాల డిమాండ్ల ఆధారంగా రిపబ్లికన్లకు, ముఖ్యంగా ట్రంప్‌కు వ్యతిరేకంగా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సెనేటర్ బెర్నీ సాండర్స్ తన డెమోక్రటిక్ సోషలిస్ట్ మద్దతు దారులను కోరారు. ఆయన యువ మద్దతుదారులైన న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ, అలాగే శాన్ ఫ్రాన్సిస్కో నియోజకవర్గం అభ్యర్థి సైకత్ చక్రవర్తి జాతీయ దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధాన ప్రచారకర్తలుగా ఉన్నారు.

యుఎస్‌ఎ కమ్యూనిస్ట్ పార్టీ (సిపియుఎస్‌ఎ) కార్మిక సంఘాలు, విద్యావేత్తలు, నిరుపేద మహిళల నుండి మద్దతు పొందే ఒక చిన్న కేడర్ ఆధారిత పార్టీ. అధ్యక్షుడు ట్రంప్ మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్ – MAGA) కార్యక్రమానికి వ్యతిరేకంగా ఉన్న ఇతర ఎన్‌జిఒలతో డెమోక్రటిక్ సోషలిస్టులతో సిపియుఎస్‌ఎ కలిసి పనిచేస్తుంది. రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికలలో రిపబ్లికన్లను ఓడించడానికి, కమ్యూనిస్ట్ పార్టీ, బెర్నీ సాండర్స్‌కు చెందిన డెమోక్రాటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా (డిఎస్‌ఎ) రెండూ మాగా వ్యతిరేక శక్తుల కూటమిని ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చాయి.

కమ్యూనిస్ట్ పార్టీ అంచనా ప్రకారం నవంబర్ మధ్యంతర ఎన్నికల ఫలితాలు రాబోయే అనేక సంవత్సరాలపాటు దేశ ప్రధాన దిశను నిర్ధారిస్తాయి. కాబట్టి భ్రమలు కోల్పోయిన ట్రంప్ మద్దతుదారులతో సహా అత్యధిక వర్గాల ప్రజలను ఒక రకమైన మాగా వ్యతిరేక కూటమి కింద సమీకరించి, నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలలో ట్రంప్ అభ్యర్థులను ఓడించడానికి ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది.

పార్టీ సహ–అధ్యక్షుడు జో సిమ్స్ సిపియుఎస్‌ఎ రెండు ముఖ్యమైన పనులు చేయబోతోందని పేర్కొన్నారు. అది గతంలో మాదిరిగా కార్మిక వర్గ అనుకూల రాజకీయాలకు కట్టుబడి ఉన్న అభ్యర్థులకు మద్దతు ఇచ్చేందుకు కార్మిక అనుకూల, ఏకీభావ శక్తులతో పొత్తులు పెట్టుకుంటుంది. ఇతర సందర్భాల్లో అధికారిక పదవులకు కమ్యూనిస్టులను పార్టీ పోటీపెడుతుంది. వారు కూడా స్థానికంగా తాము భాగస్వాములుగా ఉన్న విస్తృత కూటముల నుండి మద్దతు కోరతారని సిమ్స్ వివరించారు.

మాగాకు వ్యతిరేకంగా పోరాడటానికి ఇతరులతో కూటములలో చేరేందుకు సారవంతమైన క్షేత్రం ఉందని సిమ్స్ పేర్కొన్నారు. మితవాదాన్ని సవా లు చేయటానికి సుముఖంగా ఉన్న, సమర్థత కలిగిన అభ్యర్థులకు మద్దతు ఇచ్చే 'నో కింగ్స్' వంటి మాగా వ్యతిరేక ఉద్యమాల బలం పెరుగుతోందని ఆయన తెలిపారు.

ఉదాహరణకు, ఫిలడెల్ఫియాలో ఖాళీ అయిన ఒక కాంగ్రెస్ స్థానానికి డెమోక్రటిక్ నామినేషన్ కోసం పోటీచేసి గెలిచిన క్రిస్ రాబ్‌కు మద్దతుగా విస్తృత శక్తుల కూటమి ఏకమైంది. వచ్చే ఏడాది ప్రతినిధుల సభలో ఏర్పడబోయే కొత్త 'యాంటీ మాగా' మెజారిటీలో ఆయన ఒక భాగంగా ఉంటారని ఆశిస్తున్నారు.

న్యూయార్క్ రాష్ట్రంలో, మిన్నెసోటాలో పార్టీ సభ్యులు స్థానిక పదవులకు ఎన్నికయ్యారు. అక్కడ వారు మితవాద చట్టసభ సభ్యుల కార్మిక వ్యతిరేక, శ్రామిక వర్గ వ్యతిరేక విధానాలకు ప్రత్యామ్నాయాలను ముందుకు తెచ్చారు. మైనేతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అనేక ఇతర రాష్ట్రాలలో కూడా ఇదే పరిస్థితి. మరో రాష్ట్రంలో, ఈ ఏడాది పార్టీ సభ్యుడు ఒకరు నగర కౌన్సిల్‌లోని ఒక స్థానానికి పోటీ చేయనున్నారు.




''గతంలో మేము అనేకమార్లు చెప్పినట్లుగా, సామూహిక ఒత్తిడి లేకుంటే మధ్యేవాదులు, ఉదారవాదులు నిరంతరం మితవాదం వైపే మొగ్గు చూపుతారు' అని సిమ్స్ అన్నారు. గత సంవత్సర కాలంగా, మాగా సంక్షోభం పట్ల మన ఎన్నికైన అధికారులు స్పందిస్తున్న తీరుపై ప్రజా ఉద్యమం తన అసంతృప్తిని బలంగా వ్యక్తం చేసింది. అది ప్రభావం చూపింది. దానిలో ఎలాంటి సందేహం లేదు. ఈ విషయంలో, మేము 'ఒత్తిడిని కొనసాగించండి' అని చెబుతున్నాము, ఎందుకంటే ఆ ఒత్తిడి లేకపోతే, ఇక ఏమీ చేయలేం.''

మధ్యంతర ఎన్నికల విషయానికి వస్తే, దేశవ్యాప్తంగా మాగా వ్యతిరేక ఉద్యమాలు, కూటములలో సిపియుఎస్‌ఎ ఒక ప్రముఖ ప్రజాశక్తిగా మారుతోందని సిమ్స్ పేర్కొన్నారు. 'దేశవ్యాప్తంగా జరిగిన ప్రదర్శనలు, ర్యాలీలలో మా క్లబ్‌లు, సభ్యులు మొదటి నుంచీ ఉన్నారని మేము గర్వంగా చెప్పగలం.'

పార్టీ తన సొంత పేరుతో అభ్యర్థులను నిలబెట్టిన సందర్భాలలో ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. అలాంటి అభ్యర్థులు తరచుగా వారి సమాజంలోని దైనందిన ఉద్యమాలలో సుదీర్ఘకాలంగా పాల్గొన్న చరిత్ర కనపడుతోంది. వారు కేవలం ఎన్నికల ప్రచారాల సమయంలో కనిపించి, ఆ తర్వాత అదృశ్యం కారు. సంకీర్ణాలలో కలిసి పనిచేసే విషయానికి వస్తే, డి.సి, ఎల్.ఎ., షికాగో, ఎన్.వై.సి. వంటి అనేక ప్రధాన నగరాలలో తమ పార్టీ సంకీర్ణాలలో గుర్తింపు పొందిన సభ్యురాలిగా ఉందని సిమ్స్ పేర్కొన్నారు. సిపియుఎస్‌ఎకు సానుకూల అంశంగా, 'కమ్యూనిజం వ్యతిరేకత ప్రభావం రానురాను తగ్గిపోతోంది' అని ఆయన పేర్కొన్నారు.

దక్షిణ ప్రాంతంలో ఆఫ్రికన్ అమెరికన్లకు ప్రాతినిధ్యం లేకుండా చేస్తూ, లక్షలాదిమంది నల్లజాతి ఓటర్ల ఓటు హక్కును హరిస్తూ సుప్రీం కోర్టు లూసియానా తీర్పును సిమ్స్ తప్పుబట్టారు. దీంతో మధ్యంతర ఎన్నికల సమయంలో ఇప్పటికే సుమారు 20 కాంగ్రెషనల్ జిల్లాలు ప్రమాదంలో పడ్డాయి.

''సిపియుఎస్‌ఎ, అది భాగస్వామిగా ఉన్న కూటములకు, మొత్తం శ్రామిక వర్గంపై జరుగుతున్న దాడి తో పోరాడాల్సిన అవసరం ఉంది. సమాన ప్రాతినిధ్య హక్కు పోయింది. రిజర్వేషన్లు రద్దయ్యాయి, అబార్షన్ హక్కులు ముగిసిపోయాయి. నేను చెప్పేది గుర్తుంచుకోండి, తరువాత వంతు సామూహిక బేరసారాల హక్కుదే. యు. ఎస్. హౌస్‌లో 20 ఆఫ్రికన్ అమెరికన్ సీట్లు కోల్పోయినప్పుడు, దాని అర్థం పిఆర్ఒ యాక్ట్ (సంఘ ఏర్పాటు హక్కు రక్షణ చట్టం)కు 20 ఓట్లు తక్కువ పడతాయి. సామాజిక భద్రతకు 20 ఓట్లు తక్కువవుతాయి. ఆరోగ్య సంరక్షణకు లేదా ఓటింగ్ హక్కుల చట్టాన్ని అమలు చేయడానికి 20ఓట్లు తక్కువవుతాయి. పిల్లల పౌర హక్కులకు కూడా 20 ఓట్లు తక్కువపడతా యి. అవును, విద్యా శాఖను రద్దు చేయడంతో ద్వారా దానిని కూడా వదిలించుకున్నారు'' అని అని సిమ్స్ ఆందోళనకర పరిణామాలను వివరించారు.

ప్రైమరీలలో డెమోక్రటిక్ పార్టీ తరపున పోరాడుతున్న వామపక్ష అభ్యర్థులకు మద్దతుగా బెర్నీ సాండర్ కూడా వరుస సమావేశాలలో ప్రసంగిస్తున్నారు. డిఎస్‌ఎ సభ్యులు అత్యంత దిగువ స్థాయి నుండి పనిచేయాలని, స్థానిక స్థాయిలో వారి పని ద్వారా, అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రజలకేంద్రీకృత సంస్కరణల కార్యక్రమం ఆవశ్యకత గురించి ఓటర్లను ఆకట్టుకోవాలని ఆయన ఆదేశించారు.

'ఈ ఎన్నికల సమయంలో మనం పక్కకు తప్పుకోలేము. పక్కకు తప్పుకోవడం అంటే ఫాసిజానికి లొంగిపోవడమే' అని సిమ్స్ అన్నారు. సాండర్స్ కూడా కమ్యూనిస్ట్ పార్టీ అభిప్రాయంతో ఏకీభవించారు. చారిత్రాత్మక ఫాసిజం వ్యతిరేకి అయిన జార్జి దిమిత్రోవ్ చెప్పిన మాటలను సిమ్స్ ఉటంకించారు.'ఫాసిజాన్ని దాని సన్నాహక దశలలోనే ఎదిరించని వారు, వాస్తవానికి తర్వాతి దశలో అది పెరగడానికి దోహదపడతారు'.

# మెరుగైన విద్యకు కేరాఫ్...వియత్నాం



సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (STUTS)
9000674747

2015లో ప్రపంచ బ్యాంకు ఒక షాకింగ్ రిపోర్ట్ విడుదల చేసింది. 'తలసరి ఆదాయం 2,500 డాలర్లు మాత్రమే ఉన్న వియత్నాం, తలసరి ఆదాయం 50,000 డాలర్లు ఉన్న బ్రిటన్‌తో సమానంగా పిసా పరీక్షల్లో స్కోర్ చేస్తోంది' అని. 2022 నాటికి వియత్నాంలోని 15 సంవత్సరాల వయసుగల విద్యార్థులు గణితంలో ప్రపంచంలో 12వ స్థానం, సైన్స్‌లో 5వ స్థానం సాధించారు. భారత్ ఈ పరీక్షలకు దూరంగా ఉంది, ఎందుకంటే 2009లో పాల్గొని 73 దేశాల్లో 72వ స్థానంలో నిలిచాం.

యుద్ధం, ఆంక్షలు, పేదరికంతో దెబ్బతిన్న వియత్నాం విద్యలో ఎలా అద్భుతం సృష్టించింది? మన దేశం ఎందుకు విద్యలో వెనుకబడి ఉంది తెలుసుకోవాలంటే వియత్నాం విద్య విధానం గూర్చి తెలుసుకోవాల్సిందే. వియత్నాం రాజ్యాంగంలోని ఆర్టికల్ 61 స్పష్టంగా ఏం చెబుతోందంటే 'విద్యను అభివృద్ధి చేయడంలో రాష్ట్రం, సమాజం, కుటుంబం, పౌరుడి ఉమ్మడి బాధ్యత. విద్యకు జాతీయ బడ్జెట్‌లో అగ్ర ప్రాధాన్యత ఇస్తున్నారు. గత 30 ఏళ్లుగా వియత్నాం జిడిపిలో 5.7% నుండి 6.3% వరకు, మొత్తం బడ్జెట్‌లో 20% విద్యకే ఖర్చు చేస్తోంది. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 6.5%మాత్రమే. 2010నాటికే వియత్నాం లో 100% గ్రామాలకు ప్రైమరీ స్కూల్, 99% కమ్యూన్లకు సెకండరీ స్కూల్ ఉంది. ప్రతి స్కూల్‌లో పక్కా బిల్డింగ్, మరుగుదొడ్లు, తాగునీరు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తప్పనిసరి. మన దేశంలో వివిధ రాష్ట్రాలలో అమలవుతున్న తాత్కాలిక హడావిడి కాదు, మూడు దశాబ్దాల స్థిరమైన పెట్టుబడి. వియత్నాంలో ఒక సామెత ఉంది: 'Khong thay do may lam nen' అంటే 'గురువు లేకుండా నీవు ఏమీ సాధించలేవు'. ఈ గౌరవాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటంటే టీచర్ కావాలంటే నేషనల్ హైస్కూల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్‌లో టాప్ 15% ర్యాంకు సాధించాలి. తర్వాత 4 ఏళ్ల యూనివర్సిటీ డిగ్రీ + ఏడాది పెడగాజికల్ ట్రైనింగ్. మొత్తం 5 ఏళ్ల కఠిన శిక్షణ తర్వాతే క్లాస్ రూమ్‌లో అడుగుపెడతారు.

కొత్త టీచర్ ప్రారంభ వేతనం దేశ సగటు వేతనం కంటే 1.5 రెట్లు ఎక్కువ. ప్రతి 3 ఏళ్లకు ఒకసారి ఇంక్రిమెంట్, సీనియర్ టీచర్లకు ప్రత్యేక అలవెన్సులు. పే స్కేల్ తక్కువ ఉన్నా, సామాజిక హోదా ఎక్కువ. ప్రతి ఉపాధ్యాయుడు 3 ఏళ్లకు ఒకసారి 'జాతీయ ఉపాధ్యాయ ప్రమాణ పరీక్ష' రాయాలి. విషయ పరిజ్ఞానం, బోధనా పద్ధతులు, విద్యార్థి సైకాలజీ మీద 200 మార్కుల పరీక్ష. ఫెయిల్ అయితే 6 నెలల రీట్రైనింగ్. రెండోసారి ఫెయిల్ అయితే ఉద్యోగం నుండి తొలగింపు. గత 10ఏళ్లలో 12,000 మంది టీచర్లను పనితీరు కారణంగా తొలగించారు. 2019లో వియత్నాం 'విద్యా చట్టం ఆర్టికల్ 70' ద్వారా ఎన్నికలు, జనాభా లెక్కలు, ప్రకృతి విపత్తుల సమయంలో తప్ప ఉపాధ్యాయులను బోధనేతర విధులకు



వినియోగించరాదు' మధ్యాహ్న భోజన లెక్కలు, యూనిఫాం పంపిణీ, ఆధార్ సీడింగ్ కోసం ప్రతి 3 స్కూళ్లకు ఒక 'స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్'ను నియమించారు. టీచర్ ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు బోధన, పిల్లల మూల్యాంకనం, పేరెంట్స్‌తో సమావేశం మాత్రమే. వియత్నాం 2018లో 'కొత్త జనరల్ ఎడ్యుకేషన్ కరికులమ్' ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా 1వ తరగతి నుండి 3వ తరగతి వరకు కేవలం 4 సబ్జెక్టులు. అవి వియత్నామీస్ భాష, గణితం, నైతిక విద్య, జీవన నైపుణ్యాలు. పరీక్షల్లో 70% ప్రశ్నలు 'అప్లికేషన్, అనాలిసిస్, క్రియేషన్' స్థాయిలో ఉంటాయి. 6వ తరగతి నుండే రోబోటిక్స్, కోడింగ్, ప్రాక్టికల్ సైన్స్. ప్రతి సెకండరీ స్కూల్‌లో టింకరింగ్ ల్యాబ్ తప్పనిసరి. 2023లో అంతర్జాతీయ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో వియత్నాం 6వ స్థానం, ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో 3వ స్థానం పొందింది. 2012 నుండి వియత్నాం 'వియత్నాం న్యూ స్కూల్ మోడల్' అమలు చేస్తోంది. ఇది కొలంబియా దేశపు 'ఎస్క్యూలా న్యూవా' నుండి స్ఫూర్తి పొందింది. టీచర్ లెక్చర్ ఇవ్వడు, విద్యార్థులే గ్రూపులో చర్చించి, ప్రాజెక్టులు చేసి, నేర్చుకుంటారు. టీచర్ కేవలం ఫెసిలిటేటర్. ప్రతి విద్యార్థికి 'లెర్నింగ్ గైడ్ ఉంటుంది. పాఠాన్ని స్వయంగా చదివి, సహచరులతో చర్చించి, టీచర్‌ను సందేహాలు అడిగి నేర్చుకుంటాడు. ఇది విమర్శనాత్మక ఆలోచన, జట్టుగా పనిచేసే నైపుణ్యం పెంచుతుంది. 8,000+ స్కూళ్లలో VNEN అమలవుతోంది. వియత్నాంలో 95% మంది తల్లిదండ్రులు ప్రతిరోజూ కనీసం 1 గంట పిల్లలతో హోంవర్క్ చేస్తారు. 'పేరెంట్ టీచర్ అసోసియేషన్' చాలా బలంగా ఉంటుంది. నెలకు ఒకసారి పేరెంట్స్ స్కూల్‌కు వచ్చి పిల్లల ప్రోగ్రెస్ చర్చిస్తారు. పరీక్ష ఫలితాలు స్కూల్ గేటు బయట పబ్లిక్‌గా పెడతారు. చెడ్డ ఫలితాలు వస్తే అది కుటుంబ పరువు సమస్య. వియత్నాం తలసరి ఆదాయం 4,100 డాలర్లు. తెలంగాణ 3,500 డాలర్లు. దాదాపు సమా నం. కానీ విద్యా ఫలితాల్లో ఆకాశానికి, పాతాళానికి ఉన్న తేడా. ఎందుకు? 'ఉపాధ్యాయులను బోధనేతర విధులకు వినియోగించరాదు' అని అసెంబ్లీలో చట్టం చేయాలి.

కేరళ 2011లో చేసింది, హిమాచల్ 2019లో చేసింది. తెలంగాణ ఎందుకు చేయలేదు? నియామక ఎంపిక ప్రక్రియలో మార్పులు తీసుకురావాలి. మండలానికో అకడమిక్ పర్సన్‌ను నియమించాలి. వీరి పని ఎంఇఒ లాగా రికార్డులు తనిఖీ కాదు. క్లాస్‌రూమ్‌లో కూర్చుని టీచర్ బోధనను, పిల్లల అభ్యసనాన్ని పరిశీలించడం. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు కనీసం 15% కేటాయించాలి. 'మన ఊరుమన బడి' నిధులను బిల్డింగులతో పాటు టీచర్ ట్రైనింగ్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌కు వినియోగించాలి.

వియత్నాం మనకు నేర్పుతున్న పాఠం ఒక్కటే 'పేదరికం ఒక కారణం కాదు, సాకు మాత్రమే'. 20 ఏళ్ల యుద్ధం,10 ఏళ్ల ఆర్థిక ఆంక్షలు ఎదుర్కొన్న దేశం, విద్యను అగ్ర ప్రాధాన్యతగా చేసుకొని ప్రపంచంలో టాప్ 15లోకి వచ్చింది. మన దగ్గర డబ్బుంది, టెక్నాలజీ ఉంది, యువశక్తి ఉంది. లేనిదల్లా రాజకీయ సంకల్పం, పరిపాలనా చిత్తశుద్ధి. ఉపాధ్యాయుడిని క్లాస్‌రూమ్‌లో కూర్చోబెట్టి, పాఠం చెప్పనిస్తే చాలు. అతను బంగారు తెలంగాణను, స్వర్ణ భారతాన్ని నిర్మిస్తాడు. లేకపోతే, మనం పిసా ర్యాంకింగ్స్‌లో కాదు, చరిత్ర పుస్తకాల్లో 'ఒకప్పుడు అవకాశం ఉన్నా చేజార్చుకున్న దేశం'గా మిగిలిపోతాం.

సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 183 | బుధవారం | 03-06-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## వారంలోపు ఇరాన్‌తో ఒప్పందం: ట్రంప్

**వాషింగ్టన్ :** వచ్చేవారం లోపు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం జరిగే అవకాశాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. తుది ముసాయి దా ప్రతిపాదనలపై సమీక్ష జరుగుతోంద ని, చర్చలు కొనసాగుతున్నాయని ఇరాన్ కూడా మంగళవారం ఒక ప్రకటన చేసింది. అమెరికాతో తరువాయి 8లో

## అభివృద్ధి, సంక్షేమానికి
# సమపాళ్లలో ప్రాధాన్యం



• దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్నాం • దశాబ్దాల పాటు ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకున్నది ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసమే.. • ఈ గడ్డపై ప్రతీ బిడ్డా పోరాటం చేసింది • తెలంగాణ ఆవిర్భావం ఒక ప్రత్యేక ఘట్టం • సాగు భూమి, వ్యవసాయం, రైతు ఈ మూడూ రాష్ట్రానికి ఊపిరి • ప్రపంచానికే తెలంగాణ గేట్‌వేగా నిలబెట్టాలన్నదే మా స్వప్నం • ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

### అమరవీరులు.. పోరాట యోధులే తెలంగాణ రాష్ట్రం

అమరవీరులు, పోరాటయోధులే తెలంగాణ రాష్ట్రం. వారి త్యాగాలకు విలువలేని రాష్ట్రం.. జీవం లేని శరీరం లాంటిది. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన యోధులను గుర్తించి, వారికి, వారి కుటుంబాలకు తగిన న్యాయం చేయాలనే లక్ష్యంతో ఇటీవలే కె.కేశవరావు, కోదండరాం నాయకత్వంలో అధికారికంగా ఒక కమిటీని నియమించాం. ఆ కమిటీ నివేదిక ఆధారంగా తెలంగాణ పోరాట యోధులందరినీ సముచిత రీతిన సత్కరించి, వారి పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకుంటాం.

*- సిఎం రేవంత్ రెడ్డి*



ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులు, యువత, ఆడబిడ్డల ఆకాంక్షలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనార్టీ, అగ్రవర్ణ పేద వర్గాల సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధన కోసం రెండున్నరేళ్లుగా పలు విధాన నిర్ణయాలతో నిరంతరం శ్రమిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమపాళ్లలో ప్రాధాన్యతనిస్తూ పాలనను సాగిస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రం కూడా అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం 'తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ 'వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎగురవేశారు. అనంతరం సిఎం ప్రసంగిస్తూ దశాబ్దాల పాటు ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకున్నది కేవలం సంక్షేమం, అభివృద్ధి కోసమే కాదని, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసమన్నారు. ఈ గడ్డపై ప్రతి బిడ్డ పోరాటం చేశారని, పెత్తందారీ తనానికి వ్యతిరేకంగానే పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం ఒక ఎత్తయితే, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం తరువాయి 8లో

# ప్రజాకాంక్షలు నెరవేరాలి

• అందరికీ సమాన అవకాశాలు వస్తాయనుకున్న తెలంగాణ కొందరి స్వార్థ ప్రయోజనాలకు నిలయంగా మారింది • వెట్టిచాకిరి విముక్తి కోసం 5 వేల మంది కమ్యూనిస్టులు చేసిన ప్రాణత్యాగాలే నేటి తెలంగాణకు అసలైన పునాది • గత పదేళ్లుగా రాష్ట్రంలో నిర్బంధాలు అలవాటుగా మారాయి • ప్రజల సమస్యలపై గళమెత్తేందుకు, ఉద్యమించేందుకు ఆంక్షలు ఎదురవుతున్నాయి • సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవేదన • గన్‌పార్క్ వద్ద అమరులకు సిపిఐ ఘన నివాళి



గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో అందరికీ సమాన అవకాశాలు వస్తాయనే ఆశతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరకపోగా, కొందరి స్వార్థ ప్రయోజనాలకు నిలయంగా మారిపోయిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు, త్యాగధనులకు కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి.నరసింహా, కార్యదర్శి వర్గ సభ్యులు, పశ్య పద్మ, కలవేణ శంకర్, కార్య వర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి తదితరులు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నిజాం నవాబుల కాలం నాటి వెట్టిచాకిరి, బానిసత్వం నుంచి విముక్తి కోసం సుమారు 5 వేల మంది కమ్యూనిస్టులు చేసిన ప్రాణత్యాగాలే నేటి తెలంగాణకు అసలైన పునాది అని అన్నారు. నేటి రాజకీయ నాయకులు వాడుకుంటున్న దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ వంటి వీరులంతా కమ్యూనిస్టు యోధులేనని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర గతాన్ని, వర్తమానాన్ని బేరీజు వేసుకుంటే రాష్ట్ర ప్రయోజనాల కంటే కొంద రు సొంత ప్రయోజనాలే పరమావధిగా మారిపోవడంతో సామాన్యుడు నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత సంపన్నవంతమైన రాష్ట్రంగా తెలంగాణ ఉన్నప్పటికీ, ఆ సంపద సామాన్య ప్రజలకు అందడంలేదని విమర్శించింది. గత పదేళ్లుగా రాష్ట్రంలో నిర్బంధాలు అలవాటుగా మారాయని, ప్రజల సమస్యలపై మాట్లాడేందుకు లేదా ఉద్యమించేందుకు ఆంక్షలు ఎదురవుతున్నాయని సాంబశివ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే హక్కు ఉండాలని, భావ ప్రకటన స్వేచ్ఛను పునరుద్ధరించాలని, 'తెలంగాణ అంటే సాధించుకున్న వాళ్ళందరిది అనే విశ్వాసం ప్రజల్లో కలగాలి. ఆ దిశగానే ప్రభుత్వాల పయనం కొనసాగించాలి' అని ఆయన సూచించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట త్యాగధనుల కుటుంబాలతో పాటు మలిదశ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు తగిన గుర్తింపు నిచ్చి, సహాయం అందించాలన్నారు. నిజాం కాలం నాటి తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమ చరిత్రను, అమరవీరుల గాథలను పాఠ్యాంశాల్లో చేర్చాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

### తెలంగాణ ప్రజలతో బంధం విడదీయరానిది

"తెలంగాణ రాష్ట్ర సాధనలో, ఇక్కడి ప్రజల హక్కుల పోరాటాల్లోనూ కమ్యూనిస్టు పార్టీ పాత్ర అనిర్వచనీయం. చిరస్మరణీయం. తెలంగాణకు, సిపిఐకి ఉన్న బంధం 'పేగు బంధం' లాంటిది" అని కూనంనేని అన్నారు. తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవ వేడుకలను సిపిఐ రాష్ట్ర కార్యాలయం 'మఖ్దూంభవన్' లో ఘనంగా నిర్వహించారు. అమరవీరులకు తరువాయి 12లో

## 290 పోస్టులకు టిజిపిఎస్‌సి నోటిఫికేషన్‌లు

ప్రజాపక్షం/హైదరాబాద్



కాలుష్య నియంత్రణ మండలి,రోడ్లు భవనాల శాఖలో 290 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) మంగళవారం మూడు నోటిఫికేషన్లను జారీ చేసింది. 2026 జూలై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్ల వయసు ఉన్న వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని టిజిపిఎస్‌సి నోటిఫికేషన్‌లో పొందుపర్చింది. రోడ్ల భ వనాల శాఖలో సివిల్ విభాగంలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 6వ తేదీ నుంచి జూలై 13వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే రోడ్లు భవనాల శాఖలోని ఎలక్ట్రికల్ విభాగంలో 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ తరువాయి 8లో



# రేపు కేరళకు రుతుపవనాలు

పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయ్ : ఐఎండి

**న్యూఢిల్లీ/తిరువనంతపురం :** ఉక్కపోతతో అల్లాడుతున్న దేశ ప్రజలకు భారత వాతావరణశాఖ (ఐఎండి) చల్లని కబురు చెప్పింది. నైరుతి రుతుపవనాలు ఈనెల 4వ తేదీన కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండి మంగళవారం తెలిపింది. సాధారణంగా, కేరళలో జూన్ 1వ తేదీన రుతుపవనాలు ప్రవేశిస్తాయి. దీంతో నైరుతి రుతుపవన కాలం (జూన్–సెప్టెంబర్) ప్రారంభమవుతుంది. 'జూన్ 4వ తేదీన నైరుతి రుతుపవనాలు నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండి తన రోజువారీ వాతావరణ అంచనాలో పేర్కొంది. ఈ తేదీ నాటికి నైరుతి, పశ్చిమమధ్య, తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మిగిలిన ప్రాంతాల్లోకి కూడా రుతుపవనాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు. కేరళలకు రుతుపవనాలు మే 26న ప్రవేశిస్తాయని ఐఎండి గతంలో చెప్పింది. అయితే, అది ఆలస్యం కావడంతో, జూన్ తొలి వార్గంలో ఉండవచ్చని మే 29న ఆ శాఖ పేర్కొంది. గత వారం, ఈ సీజన్‌లో తరువాయి 8లో

## రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు

• ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండి హెచ్చరిక • నాలుగు రోజుల్లో 2-4 డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపరితల ఆవర్తనం, ద్రోణుల ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట తదితర జిల్లాల్లో ప్రస్తుతం 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే తరువాయి 8లో



## పాలమూరును కరువు నుంచి
# బయటపడేస్తాం

• సాగునీటి సామర్థ్యాన్ని గరిష్ఠస్థాయికి చేర్చడమే ప్రభుత్వ లక్ష్యం
• ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సిఎం రెండు రోజుల పర్యటన పాలమూరు సాగునీటి రంగానికి దిశానిర్దేశం చేయనుంది : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రెండు రోజుల పర్యటన పాలమూరు సాగునీటి రంగానికి కొత్త దిశానిర్దేశం చేయనుందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.మంగళవారం జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సీనియర్ అధికారులతో ఉన్నత తరువాయి 8లో

## సుప్రీం కోర్టు జడ్జీలుగా
# ఐదుగురు ప్రమాణం

7కు పెరిగిన జడ్జిల సంఖ్య

**న్యూఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ మంగళవారం సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులచే ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరింది. ఈ సంఖ్య గతం ఉన్న న్యాయమూర్తుల కంటే పెరిగింది.కొత్త న్యాయమూర్తులు సుశీల్ నాగు, చంద్రశేఖర్, సంజీవ్ సచ్‌దేవ, అరుణ్ పల్లి, వి.మోహనలతో ప్రధాన న్యాయమూర్తి ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. వీరి ప్రమాణంతో ప్రస్తుతం సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 37కి చేరింది. అయితే ఇది ప్రస్తుతం మంజూరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య కంటే ఒకటి తక్కువే. కేంద్రం సోమవారంపంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీల్ నాగు, తరువాయి 12లో

## అమరుల త్యాగాల ఫలమే
# 60 ఏళ్ల కల సాకారం

• ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలోనే ముందు వరుసలో నల్లగొండ • జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది • రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని నల్లగొండలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినీమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జాతీయ జెండాను ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిలతో కలసి ఆవిష్కరించి జిల్లా ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎందరో అమరవీరుల త్యాగఫలితంగా 4 కోట్ల ప్రజల 60 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.నల్లగొండ జిల్లా విప్లవాల పురిటిగడ్డ అని, సాయుధ తరువాయి 12లో





## వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి
# ప్రత్యర్థులే ఉండరు

• జిల్లా పరిషత్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం • కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పు లేదు • అంతా ఐక్యంగానే ఉన్నాం • మీడియా చిట్‌చాట్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/ ఖమ్మం

కాంగ్రెస్ పార్టీలో నాయకత్వం మార్పు లేదని మంత్రివర్గమంత కలిసి రాష్ట్ర అభ్యున్నతికి కృషి చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ప్రస్తు త మంత్రి వర్గం తెలంగాణ అభివృద్ధి కోసం అద్భుతంగా కృషి చేస్తుందని మార్పులకు అవకాశమే లేదన్నారు. ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో భట్టివిక్రమార్క పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. పని చేసే పార్టీలకు ప్రచారం అవసరం లేదని పని చేయడమే తమ లక్ష్యమన్నారు. 2028 శాసనసభ ఎన్నికల నాటికి రాష్ట్రంలో మాకు అసలు ప్రధాన ప్రత్యర్థులే ఉండరన్నారు. జిల్లా పరిషత్ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని, భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ఇదే తరువాయి 8లో

## తెలంగాణలో
# జనసేన పోటీ



ప్రాంతీయ విద్వేషాలకు తావులేకుండా పోరాటం చేస్తాం: పవన్ కళ్యాణ్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ మీ అబ్బ జాగీరా? మీరెవరు నన్ను బెదిరించేది? తెలంగాణలో జనసేన పార్టీ రాజకీయంగా వెనక్కి తగ్గేదేలేదని, 2029 ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణలో జనసేన 'నవ నిర్మాణ సభ'కు హైకోర్టు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో తనకు అధికారంపై కాదు, మార్పుపైనే ప్రేమ ఉందని వ్యాఖ్యానించారు.ఓ రాజకీయ విశ్లేషకుడి వ్యాఖ్యలతోనే వివాదం మొదలైందని, ఆయనపై కేసులు నమోదైన విషయం మొదట్లో తనకు తెలియదన్నారు. ఆ విశ్లేషకుడిపై ఉన్న గౌరవంతో కేసులు తరువాయి 12లో

## పవన్ కళ్యాణ్ ఓ.. పెయిడ్ ఆర్టిస్

మంత్రి పొన్నం ప్రభాకర్

'ఎస్.. మిస్టర్ పవన్ కళ్యాణ్... తెలంగాణ మా అయ్యా జాగిరే' 4 కోట్ల మంది తెలంగాణ ప్రజల అయ్యా జాగిరే.. నీ అయ్యా జాగిరు కాదు.. అని బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జనసేన అధినేత, ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, ఇక్కడి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టేలా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే వచ్చి ఇక్కడి ప్రజలను తరువాయి 12లో



## ఉద్యమ కారులకు సరైన న్యాయం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ:** పాలక ప్రభుత్వాలు తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కారుల కోసం కమిటి వేయడం సంతోషకరమని, కమిటిలతో కాలయాపన చేయకుండా ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, వెంకట్రాములు, వెంకటయ్య, యాదయ్య, మైనోద్దీన్, పట్టణ సహాయ కార్యదర్శులు నగేష్, జ్యోతిబస్, శాఖ కార్యదర్శులు మల్లయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ యువతలో నైరాశ్యం

సిపిఐ సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ప్రధానంగా నీళ్లు,నిధులు,నియామకాలు అనే లక్ష్యాలతో సాగిందని,రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయి 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టినప్పటికీ ఈప్రధాన అంశాలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడం తెలంగాణ యువతలో నిరాశను కలిగిస్తోందని సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి,నాయకులు వి.లెనిన్, ముండ్ల ముత్యాలు,మదర్,వెంకన్న,యూసఫ్,బాసాని వెంకటయ్య,కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి,కె.నారాయణ, విజయ,దాసరి విజయలక్ష్మి,దొండ కృష్ణయ్య,విష్ణుచారి,శివరాత్రి వీరయ్య,దుర్గయ్య, ఎల్లయ్య,ఎండి చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ పాత్ర అమూల్యం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర సాధన అన్ని దశలలో సిపిఐ పాత్ర అమూల్యమైనదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవాన్ని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ చింతలపూడి రాములు, అమరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో శాంతియుత పద్ధతుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడానికి రాష్ట్ర అభివృద్ధి ప్రజల చేతుల్లోనే ఉందని దానికి సిపిఐ కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సీనియర్ నాయకుడు మామిడి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కొప్పోజు సూర్యనారాయణ, ఇందిరాల సీతరాములు, యల్లావుల రమేష్, హైకోర్టు అడ్వకేట్ చింతలపూడి సుధాకర్ పాల్గొన్నారు

## తహసీల్దార్ కార్యాలయం ముందు ధాన్యాన్ని పోసి నిప్పపెట్టిన రైతన్న

ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో నిరసన



**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన రైతులు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధాన్యాన్ని పోసి నిప్పు పెట్టి ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థత వల్లే నేడు ధాన్యం కొనుగోళ్ళలో జాప్యం నెలకొందని ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా నేటికి ధాన్యం కొనుగోలు చేయకపోవడం, గన్ని బ్యాగుల కొరత, హమాలీ కొరత, లారీల కొరత సాకుతో ధాన్యాన్ని కొనే నాదుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా కేంద్రాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తే పరిస్థితి నెలకొందని తక్షణమే ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఇట్టి విషయమై తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న రైతులను పట్టించుకోకుండా తహశీల్దార్ హరికృష్ణ ఎంతసేపటికి బయటికి రాకపోవడంతో రైతులు ఆగ్రహానికి గురై తహశీల్దార్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఎస్‌ఐ శోభన్‌బాబు, ఏపిఎంలు రైతులను శాంతిపజేసి రైతుల ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

## రాష్ట్ర అవతరణ ఉద్దేశాల సాధనకు కృషి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు,ఆశయాలకు అనుగుణంగా సాధించుకున్న రాష్ట్ర అవతరణ ఉద్దేశాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ఆయన ప్రత్యేక అధికారిగా జిల్లా పరిషత్ కార్యాలయంలో,జిల్లా కలెక్టర్ కార్యాలయంలో,జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

# అమరుల త్యాగాల ఫలమే నేటి ప్రగతి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** అనేక త్యాగాలు, సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే అభివృద్ధి, సంక్షేమం, సుస్థిర ప్రగతికి ప్రతీకగా నిలిచిందని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా పరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఇంటర్ విద్యార్థులకు, పాఠశాల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుండి అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే విప్లవాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామని ప్రకటించారు. అలాగే, రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించే సరికొత్త పథకాన్ని తీసుకువస్తున్నట్లు వెల్లడించారు.




**జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతి**

మహాలక్ష్మి పథకంలో 2 కోట్ల 17 లక్షల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా, 1.28 లక్షల మందికి రూ. 500 లకే గ్యాస్ సిలిండర్లు అందించి సబ్సిడీని నేరుగా ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతు భరోసా కింద 2.33 లక్షల మంది రైతులకు రూ. 306 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. జిల్లాలో మొదటి దశ కింద 9,618 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 4,591 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని, జిల్లాను గుడిసెల రహితంగా మార్చేందుకు మరో 361 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్యాకేజీ15 (79.88%), ప్యాకేజీ16 (60%) పనులు వేగంగా సాగుతున్నాయని, రూ. 358 కోట్లతో గంధమల్ల జలాశయం, బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. చేయూత పథకం కింద 96 వేల మందికి పైగా లబ్ధిదారులకు నెలకు రూ. 24.52 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో నేరాల నియంత్రణకు 20,406 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫ్రెండ్లీ పోలీసింగ్తో ఆదర్శంగా నిలిచిన పోలీసు శాఖను చైర్మన్ అభినందించారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కలిసికట్టుగా శ్రమించి యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని అధికారులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్లు భాస్కరరావు, వెంకారెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి పాల్గొన్నారు.

## కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడి రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కెసిఆర్ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆంధ్ర సిఎంకు ఏజెంటుగా మారి తెలంగాణను విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. దీనిని తెలంగాణ ప్రజలు గుర్తించి వారి కుట్రలు, కుతంత్రాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.



## రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

రూ.50 కోట్లతో నల్లగొండ-ధర్వేశిపురం రహదారికి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్ ):** మండలంలోని ధర్వేశిపురంలో వెలసిన శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.మంగళవారం ధర్వేశిపురంలోని శ్రీరేణుక ఎల్లమ్మ అమ్మవారి నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేవాలయ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వెల్లడించారు.రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద కళ్యాణ మండపం, వాటర్ ట్యాంకు నిర్మించామని తెలిపారు.50 కోట్ల రూపాయల కేంద్ర రహదారుల నిధులతో నల్లగొండ నుంచి ధర్వేశిపురం వరకు రహదారి నిర్మించనున్నామని, టెండర్ పూర్తయిందని,బుధవారం నుంచి పనులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.ధర్వేశిపురం ప్రాంతంలో ఒక పెద్ద పరిశ్రమ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. 239 కోట్ల రూపాయలతో ధర్వేశిపురం మీదుగా గుర్రంపోడుకొండమల్లేపల్లిదేవరకొండిండి వరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేవాలయ నూతన ధర్మకర్తల మండలి అధ్యక్షు సీహెచ్ వెంకట్ రెడ్డి,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివరాం రెడ్డి,ఎండోమెంట్ అధికారులు,కనగల్ తహసీల్దార్ పద్మ,రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ ఈవో తదితరులు ఉన్నారు.

## ఫ్లెక్సీ ఏర్పాటుపై తలెత్తిన వివాదం

విద్యాశాఖ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

సిఎం రేవంత్ రెడ్డిని జిల్లా విద్యాశాఖాధికారిగా

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలెక్టర్ అండ్ జిల్లా మేజిస్ట్రేట్‌గా మార్చిన వైనం




**ప్రజాపక్షం/సూర్యాపేట :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదమైంది. అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సిఎం రేవంత్ రెడ్డి ఫోటో కింద జిల్లా విద్యాశాఖ అధికారి సూర్యాపేట అంటూ, రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటో కింద కలెక్టర్ అండ్ జిల్లా మేజిస్ట్రేట్ అంటూ ముద్రించడం ఇందుకు కా రణమైంది. రాష్ట్రంలో అత్యున్నతమైన వ్యక్తుల ఫోటోల కింద విద్యశాఖ అధికా రి, జిల్లా కలెక్టర్ అంటూ మార్చడంతో ప్రజలు విద్యాశాఖ అధికారుల తెలివి ఇంతేనా అంటూ విమర్శలు చేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత పౌరులు గా తీర్చిదిద్దాల్సిన అధికారులే ఈ విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రూ.11 కోట్ల అప్పల వివాదంపై జితేందర్‌రెడ్డి ఇంటి ముందు బాధితుల ధర్నా



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ సమీపంలోని శ్రీరంగాపురంలో ఇరిగేలా జితేందర్‌రెడ్డి చేతిలో మోసపోయిన బాధితులు మంగళవారం ఆందోళన బాట పట్టారు. తమకు రావాల్సిన సుమారు 11 కోట్ల రూపాయల అప్పులను తక్షణమే ఇప్పించాలంటూ సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి జితేందర్‌రెడ్డి ఇంటి ఎదుట టెంట్ వేసి బైఠాయించారు. వ్యవసాయ పెట్టుబడుల కోసం, పిల్లల పెళ్లిల కోసం దాచుకున్న డబ్బులు తిరిగి రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మా డబ్బులు మాకు ఇప్పించే వరకు ఈ టెంట్ తీసేది లేదు. ఇక్కడి నుంచి కదిలేదేలేదు అని ఆందోళన చేపట్టారు. నమ్మి అప్పులు ఇస్తే చివరకు చేతులెత్తేసి ఐపి (దివాల) నోటీసులు పంపడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని దాచుకున్న సొమ్ము పోవడంతో తాము రోడ్డున పడ్డామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. నిందితుల నుంచి సొమ్మును రికవరి చేసి, తమకు తక్షణమే న్యాయం చేయాలని బాధితులు పోలీస్‌అధికారులను వేడుకున్నారు. విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా బాధితులకు సర్ధిచెప్పి అక్కడ నుంచి పంపించివేశారు.

## సమన్వయంతో ధాన్యం కొనుగోలు పూర్తి

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** నియోజకవర్గ పరిధిలోని ధాన్యం సేకరణ సెంటర్ల వద్ద సమన్వయంతో కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో, రైస్ మిల్లర్లు, రెవెన్యూ అధికారులు, సివిల్ సప్లై అధికారులు ప్రజా ప్రతినిధులతో అత్యవసర సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. మిల్లర్లు లారీ ఓనర్స్ నిర్వాహకులను తో మాట్లాడి వీలైనంత త్వరగా పది రోజుల్లోగా కొనుగోలు పూర్తి చేసి రైతులకు మేలు చేయాలని సూచించారు. ప్రత్యేకంగా రైస్ మిల్లర్లు తమ సామర్థ్యం మేరకు నిల్వ పూర్తి చేసినా కూడా గోదాములో అదనంగా 50 శాతం బస్తాల ధాన్యాన్ని నిలువ చేసుకునేందుకు ఒప్పుకున్నట్లు తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని సేకరించి గోదాముల్లోకి తరలించేందుకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యపు సేకరణ పూర్తయిందని ఇంకా 40 శాతమే మిగిలి ఉందని వాటిని కూడా వేగవంతం చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతులు అధైర్య పడవద్దని ఆందోళన చెందాల్సిన పని అక్కర్లేదని అనుకున్న సమయం కంటే ముందుగానే కొనుగోలు పూర్తి చేసి తిరిగి పంటలు వేసుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, ఎండిఓ మల్లం విజయ, సివిల్ సప్లై అధికారులు డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పక్కీరు మల్లారెడ్డిపాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు వెలకట్టనేనివి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర సాధనకు అమలరులు చేసిన త్యాగాలు వెలకట్టలేనివని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో మంగళవారం జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్‌కుమార్, బిల్లా కనకయ్య, ఎస్‌కె.షమీం, డి.శాంత, బుచ్చయ్య, సైదులు పాల్గొన్నారు.



# అమరుల త్యాగాల ఫలమే తెలంగాణ ఆవిర్భావం

అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి

మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మంగళవారం సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన ఆయన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పాలన సాగుతుందన్నారు. జిల్లాలో 2025/26 యాసంగిలో మొత్తం 3 లక్షల 39వేల 65 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 2026/27కు గాను నియోజకవర్గానికి 2వేల ఇండ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. యాసంగిలో 5,79,757 మంది రైతులకు రూ.602కోట్ల 56లక్షలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఉద్యాన పంటలకు 13వేల 953 మంది రైతులు 29వేల 617 ఎకరాలు సాగుచేయగా వారికి రూ.3కోట్ల రాయితీ ఇవ్వడం జరిగిందన్నారు. మత్స్యరంగ సమగ్రాభివృద్ధికై 2025/26కు గాను 583 చెరువులకు, కుంటలకు 100 శాతం గ్రాంట్‌పై రూ. 4 కోట్ల 11లక్షల విలువైన 3 కోట్ల 33 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. చేయూత పెన్షన్ కింద 2025/26 ఆర్థిక సంవత్సరంలో 1,47,489 మందికి గాను రూ.389కోట్ల 18లక్షలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 31,976 మంది అర్హులైన దివ్యాంగులను గుర్తించి విద్య, ఉపాధితోపాటు వివిధ సంక్షేమ పథకాలు రాయితీ ద్వారా అందించడం జరిగిందన్నారు. మహిళా శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాల వారు 14 రకాల ఆదాయ అభివృద్ధిని చేకూర్చేలా రూ.397కోట్ల 24లక్షలను వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరి చేయడం జరిగిందన్నారు. మెప్మా ద్వారా జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 89 కొత్త సంఘాలతో కలిపి మొత్తం 5వేల 771 ఉండగా వారి ద్వారా 79వేల 343 ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం 10 పరీక్షల్లో 98.60 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. జిల్లాలోని హుజూర్‌నగర్ పట్టణంలో ఉన్న మగ్దూం నగర్‌లో 100 ఎకరాల విస్తరణలో కొత్త వ్యవసాయ కళాశాలను రూ.126కోట్లతో చేపట్టడం జరిగిందని, బిఎస్‌సి (ఆనర్స్), వ్యవసాయ కోర్సులను విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 5లక్షల 82వేల 464 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. జిల్లాలో రూ.708 కోట్ల 61లక్షలతో ఆర్ అండ్ బి ద్వారా రోడ్ల మరమ్మత్తులు చేపట్టడం జరిగిందని చెప్పారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా ఎస్‌పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్‌తోపాటు ఆయా శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాలతోనే తెలంగాణ సాకారం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** 12వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని సిపిఐ కార్యాలయం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోదా శ్రీరాములు మాట్లాడుతూ నాటి తెలంగాణ ఉద్యమంలో యువజనులు, విద్యార్థులు చేసిన ప్రాణత్యాగాలను గుర్తుచేశారు. సకల జనులు, సబ్బండ వర్గాలు చేపట్టిన చారిత్రాత్మక సమ్మెల వల్లే నాటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మరియు దాని అనుబంధ సంఘాలు ప్రత్యక్ష పోరాటాలు చేసి, కీలక పాత్ర పోషించాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి..

నేటి పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గోదా శ్రీరాములు విమర్శించారు. ఇది సరైన విధానం కాదని, తక్షణమే హామీలన్నింటినీ నెరవేర్చి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ ఘనమైన వేడుకల్లో సిపిఐ మరియు ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పేరబోయిన మహేందర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, సిపిఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి పెరబోయిన పెంటయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పెరబోయిన బంగారు, సహాయ కార్యదర్శి గోపగాని రాజు, ఏఐటియుసి మండల కార్యదర్శి గుండు వెంకటేష్, గీతా పని వాళ్ల సంఘం మండల అధ్యక్షులు పాకాలపాటి రాజు, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షులు పబాల స్వామి ఉన్నారు.





## కనీస వేతన తాజా జీవో 6ను సవరించి రూ.26వేలకు పెంచాలి

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల పెంపు తాజా జీవో 6ను సవరించి కార్మికులకు కనీసం వేతనం రూ.26,000 అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారిశుద్ధ్య పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికుల సమావేశం జరిగింది. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ... 14 ఏళ్ల నిరీక్షణకు స్వస్తి పలుకుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా లక్ష పదకొండు వేల మంది కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 16వేల నుండి 20 వేల వరకు పని నైపుణ్యం బట్టి నాలుగు కేటగిరీలుగా విభజించి కనీస వేతనాలు పెంచిందని, కనీస వేతనాల పెంపును హర్షిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కనీస వేతనాలను ఏ ప్రాతిపదికగా పెంచిందో కానరీ వేతనాల పెంపు మాత్రం అశాస్త్రీయంగా ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు గోవర్ధన్, లక్ష్మణ్, మొగులప్ప, లక్ష్మి, సునీత, సునీతాంబికా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గ్రామాలలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎస్సై ఎస్ఎమ్ నవీద్ మండల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మండల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల పోరాట ఫలితం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం

రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఉద్యమకారుల పోరాట ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అని రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గం, కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, తెలంగాణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల స్థూపానికి పాలాభిషేకం చేసి నివాళులార్పించారు. అనంతరం కల్వకుర్తి ప్రయాణికుల ప్రాంగణం వద్ద వేసవి ఎండల దృష్టిలో పెట్టుకొని ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా 78 రోజులపాటు ఉచితంగా నిర్వహించిన అంబలి కేంద్రం, చలివేంద్రం ముగింపు కార్యక్రమంలో పాల్గొని అక్కడ ఆర్య వైశ్య సంఘం వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాష్ రావు, భావండ్ల మధు, కౌన్సిలర్లు రాము నాయక్, సుశీల, ఈశ్వరయ్య, మనోహర్ రెడ్డి, దారమోని గణేష్, ఆర్య వైశ్యులు శ్రీనివాసులు, ప్రసాద్, పూరి రమేష్, సర్పంచులు , మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జెండా ఆవిష్కరించిన కేశంపేట గ్రామ సర్పంచ్ బాదేపల్లి రేవతి సురేష్ గౌడ్

**ప్రజాపక్షం/రేవల్లి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ బాదేపల్లి రేవతి సురేష్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల పార్టీలకు అతీతంగా తనపై నమ్మకం ఉంచి గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కోడిగంటి దామోదర్, పంచాయతీ కార్యదర్శి ఎస్.అరవింద్ కుమార్, పూడూరు నాగశేషయ్య, పలుస వెంకటేయ్య గౌడ్, అరుమల నాగిరెడ్డి, వార్డు సభ్యులు అనసూయ, శివయ్య, చింతచెట్టు మంజుల, శ్రీహరి యాదవ్, బ్యాల రమేష్ యాదవ్, బంకల దివ్యజ్యోతి, బంకల అలివేలు, అరుమల రామస్వామి, బందేలా రవిరెడ్డి, బంకల రామస్వామి, బందేల రవిరెడ్డి, పూడురు రాజు, పూడూరు, కృష్ణయ్య, ఆశావర్కర్లు కోడిగంటి చెన్నమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అమ్మాయిపల్లిలో వేడుకలు

**ప్రజాపక్షం/చిన్నంబావి :** అమ్మాయిపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడు, ఉప సర్పంచ్ మాధవి మాధవరెడ్డి మాట్లాడుతూ చిన్న రాష్ట్రాలా ద్వారా అభివృద్ధి సాధ్యమని 1200 మంది విద్యార్థులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్, ఉప సర్పంచ్ మాధవి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జైపాల్ రెడ్డి అంగన్వాడీ టీచర్ సుధారాణి ఆశవర్కర్ మణెమ్మ వార్డు మెంబర్లు అల్లేన్న గౌడు, మహేశ్వరమ్మ సత్యారెడ్డి, ధర్గయ్య స్వేరో, పావని కవిందర్ గౌడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కాంగ్రెస్ యువనాయకుడు వెంకటేష్ నాయుడు, శ్యామ్ నాయుడు, రాకేష్ గౌడు, రామన్ గౌడు, వెంకటేష్, నరసింహ గ్రామ పెద్దలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## గోదాముల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలి

జిల్లా కలెక్టర్‌కు గోపాల్‌పేట పిఎసిఎస్ వినతి

**ప్రజాపక్షం/రేవల్లి :** గోపాలపేట మండల కేంద్రలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ పరిధిలో గోదాము నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు సంఘం నుంచి సింగిల్ విండో చైర్మన్ లోడే రఘు, ఇందిరమ్మ కమిటీ మెంబర్ చెన్న కేశవులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సహకార్‌సేసమృద్ధి కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆహార ధాన్యాల నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు పైలట్ ప్రాజెక్ట్ కింద తెలంగాణను ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ వినతిపత్రం ప్రతిని జిల్లా సహకార అధికారికి కూడా అందజేశారు.

## నాలుగు కోట్ల ప్రజల స్వప్నం .. అమరవీరుల ప్రాణ త్యాగ ఫలితం మన తెలంగాణ

తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం వేడుకలు
జాతీయ జెండా ఎగరవేసిన మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలిదశ మలిదశ ఉద్యమాల్లో ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగ ఫలితమే నేడు మనమంతా స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మలిదశ ఉద్యమంలో 1200 మంది విద్యార్థులు అమరులయ్యారని, వారి త్యాగం వల్లే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని అన్నారు. నాటి అమరులను స్మరిస్తూ నేడు అభివృద్ధి సాధిద్దామని మంత్రి శ్రీహరి పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు జి.నీలప్ప ముదిరాజ్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని నారాయణపేట క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన తెలంగాణ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అమరుల చిత్రపటానికి పూజా కార్యక్రమం నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. అక్కడే ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి తెలంగాణ ఉద్యమకారులు జి.నీలప్ప ముదిరాజ్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో మొదటి నుండి చివరి వరకు మక్తల్లో ఉద్యమాన్ని నడిపించిన వారందరిని మంత్రి గుర్తుచేసుకుంటూ అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ వాకిటి మానస హన్మంతు, మాజీ జెడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మర్ జి.రవికుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, కె.ఆంజనేయులు గౌడ్, బి.గణేష్ కుమార్, బోయ రవికుమార్, బిజెపి నాయకులు చీరా సత్యనారాయణ పాల్గొన్నారు.



## సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులు ముందుండి పోరాడి రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నారాయణపేట నియోజకవర్గం చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి తన సొంత డబ్బులతో ప్రమాద బీమా, ఆరోగ్య బీమాను చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తన చేతుల మీదుగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా తానే ఇన్సూరెన్స్ చేయిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. కాగా జర్నలిస్టుల సంక్షేమం గురించి మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి గతంలో చేసిన... ప్రస్తుతం చేస్తున్న కృషిని టియుడబ్ల్యూజె ఐజెయు జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి గుర్తుచేసి మాట్లాడారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మొసటి జ్యోతి, మాజీ ఎంపిపి అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు భరత్, కాకర్ల నారాయణమ్మ, కే.సుదర్శన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వేపూరి రాములు, విజయ సాగర్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నో పోరాటాలతో సిద్ధించిన తెలంగాణ

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం, ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారతదేశ జాతీయ జెండాను ఎమ్మెల్యే విజయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల తర్వాత తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని స్వరాష్ట్ర సాధన కోసం 1969 నుండి పోరాటాన్ని ప్రారంభిస్తే 2014లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పోరాట యోధుడు ఆ మహనీయుని ద్వారా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కావాలనే ఆ కల నేరవేరిందని అన్నారు.
నాలుగు దశాబ్దాలకుపైగా పోరాట ఫలితమే ఇప్పుడున్న తెలంగాణ రాష్ట్రం. తెలంగాణ సాధన కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయని ఈ పోరాటంలో ఎందరో ప్రాణత్యాగాలు చేశారని, ఎన్నో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పుల్లూరు పరమేశ్వర్ రెడ్డి, మండల సింగల్ విండో అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, రఘురెడ్డి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మక్తల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా
రాష్ట్ర పాడి పరిశ్రమ శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ధ్యేయమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్‌లో ఈనెల 4న ముఖ్యమంత్రి పర్యటనపై మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ నాయకులు, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నారాయణపేట జిల్లా అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. జూన్ 4వ తేదీన మక్తల్ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులపై సిఎం ఏరియల్ సర్వే చేయనున్నట్లు తెలిపారు. కృష్ణా నదిపై కొల్వూర్ కోర్తికొండ వద్ద 1.8 టిఎంసి, మురారి దొడ్డి గంజిపల్లి, దేవసూగురు వద్ద బ్రిడ్జి కం బారేజ్‌లకు అదేవిధంగా భీమా నదిపై సుకుర్ లింగంపల్లి, కుసుమూర్తి వద్ద బ్రిడ్జి కం బారేజ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లో బ్యారేజీలు నిర్మించడం ద్వారా జిల్లాకు సాగు, తాగునీటి సమస్య తీర్చవచ్చని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 51 శాతం భూభాగం తెలంగాణకు, 49 శాతం కర్ణాటకకు ఉండటంతో రెండు రాష్ట్రాలకు సమాన ప్రయోజనం కలిగే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోని ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర ప్రతినిధులతో కలిసి జూన్ 4,5 తేదీల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కీలక సాగునీటి ప్రాజెక్టు లపై సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. 5 వేల కోట్లతో మక్తల్ నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామని అన్నారు. నర్వ మండలంలోని జంగంరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రభుత్వం 175 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా 13 గ్రామాల్లోని సుమారు 7,500 ఎకరాలకు సాగునీరు అందనుందని చెప్పారు. సిఎం ఏరియల్ సర్వే సందర్భంగా ఆయా పరిధిలో ఉన్న మండలాల్లోని రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జెండాలు చేతబట్టి ముఖ్యమంత్రిని స్వాగతిస్తూ పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో అగ్రగామిగా నాగర్‌కర్నూల్ జిల్లా

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లా అన్నిరంగాలలో అగ్రగామిగా రాణిస్తుందని, అభివృద్ధిలో ప్రపంచానికే తెలంగాణ రాష్ట్రం పోటీ పడుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 13వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డా.మల్లురవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్య అతిథికి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పూలమొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసు బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్చం సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.
సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డా.మల్లురవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అభినందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్పి రామేశ్వర్, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



## కొత్తకోటలో రెపరెప లాడిన గులాబీ జెండా

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా గులాబీ జెండా ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ పాల్గొని గులాబీ జెండాను ఎగురవేశారు. ఇదిలా ఉండగా మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ అడ్వకేట్ యాదగిరి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పంపిన ప్రమాణస్వీకార సందేశంను చదివి పార్టీ శ్రేణులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి పొగాకు విశ్వేశ్వర్, మాజీ ఎంపిపి గుంత మౌనిక మల్లేష్, మాజీ సిడిసి చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు అయ్యన్న, ఎరుకలి తిరుపతయ్య, మంజుల రామకృష్ణ యాదవ్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పట్టణ వివిధ గ్రామాల బిఆర్ఎస్ శ్రేణులు , పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం బాలుర హై స్కూల్ వద్ద గల తెలంగాణ తల్లికి నివాళి అర్పించారు.



## రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ సలహాదారు ఎ.పి.జితేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని, తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకెళ్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఎ.పి.జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి న్యూఢిల్లీ, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఎ.పి.జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు గౌరవ వందనంతో జిల్లా యంత్రాంగం తరపున ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల, అలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర అతిథులతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూజా కార్యక్రమం అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల శాసనసభ్యుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ శాసనసభ్యుడు విజయుడు, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి సహకార సమాఖ్య చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య, వాల్మీకి బోయ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అదనపు కలెక్టర్లు మధు మోహన్, నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీఓ శ్రీనివాసరావు, డిఎస్పీ మొగిలయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా ప్రభుత్వం కృషి

తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి :** రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా ప్రజలందరికీ పంపిణీ జరగాలనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తూ, సకలజనుల సంక్షేమానికి పాటుపడుతున్నదని చీఫ్ విప్, తెలంగాణ శాసనమండలి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఏర్పాటు చేసిన తెలంగాణ వేడుకలను పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అంతకుముందు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యఅతిథి పోలీస్ శాఖ ద్వారా ఇచ్చిన వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాలపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా పర్యావరణ అవగాహనలో ప్రతిభ చాటిన వనపర్తి జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్, కొత్తకోట జడ్పీహెచ్ఎస్ బాలికల, పెబ్బేరు కేజీబీవీ పాఠశాలలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఎఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి మున్సిపాలిటీ చైర్పర్సన్ మాధవి, జిల్లా అధికారులు, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అమరచింతలో ఆవిర్భావ వేడుకలు

**ప్రజాపక్షం/అమరచింత :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం అమరచింత మండలంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు జాతీయ జెండాలను ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. అమరచింత తహసీల్దార్ కార్యాలయం దగ్గర తహసీల్దార్ రవికుమార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం దగ్గర ఎంపిడిఒ శ్రీనివాసులు, మున్సిపల్ కార్యాలయం దగ్గర కమిషనర్ నూరుల్ నజీబ్‌లు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాలను ఎగురవేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల ఆవరణలో సర్పంచులు జాతీయ జెండాను ఎగరవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అమరచింత మున్సిపల్ కార్యాలయం దగ్గర చైర్‌పర్సన్ జింక సువర్ణ, రవి కుమార్ యాదవ్, వైస్ చైర్‌పర్సన్ రాధా అరుణ్ కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమంలో కెసిఆర్‌తో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను, బిఆర్ఎస్ పార్టీ జెండాను మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. కెసిఆర్‌తో ఉద్యమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మంగళవారం నాడు జడ్చర్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ కోసం పదవుల్ని త్యాగం చేసి కొట్లాడినం. పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్‌గా నిలబెట్టిందని, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తిరోగమనంలో వెళ్తుందన్నారు.
రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ కోసం పదవుల్ని త్యాగం చేశామని గుర్తుచేశారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్‌గా నిలబెట్టిందన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాటం చేయాలి

పుస్తకాల నర్సింగరావు పిలుపు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగరావు పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ రాజేంద్రనగర్ మండల సమితి సమావేశం ఎఆర్ దేవరాజ్ భవన్‌లో మండలంలోని 18 శాఖల కార్యదర్శుల, ప్రజా సంఘాల అధ్యక్ష కార్యదర్శుల సమావేశం మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి.సత్యం, జే.సదానంద గౌడ్, సయ్యద్ కాజా, పాండు, సాబేరు, హుస్సేన్ భాయ్, పుష్ప, శాంతమ్మ, సరూప, వాణి, కృష్ణ, కాజా, ప్రతాప్ రెడ్డి, నవీన్ కుమార్, చారి తదితరులు పాల్గొన్నారు.

### ఎఆర్ దేవరాజ్ భవన్ జాతీయ జెండా ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయం ఎఆర్ దేవరాజ్ భవన్ వద్ద జాతీయ జెండాను పుస్తకాలు నర్సింగరావు ఆవిష్కరించారు. కార్యక్రమం సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..



**ఎల్‌బి నగర్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను నాగోల్‌లోని ఎస్‌ఏ డాంగే భవనంలో ఎగరవేశారు. సిపిఐ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, ఉడతల మల్లేష్ గౌడ్, ఉష, పరిపూర్ణచారి, లక్ష్మ మ్మ, కృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళు తొలి విడత ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారుల నూతన గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మున్సిపల్ , కమీషనర్, కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి

రంగారెడ్డి జిల్లా డిసిసి చల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పిసిసి జనరల్ సెక్రటరీ ఏనుగు జంగారెడ్డి, పిసిసి వైస్ ప్రెసిడెంట్ ముద్దగౌని వేణు గౌడ్, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి చల్లా నర్సింహారెడ్డి మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం జాతీయజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి డిస్ట్రిక్ట్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నాగేందర్ రెడ్డి, సేవాదళ్ ప్రెసిడెంట్ రమాకాంత్, అమీర్పేట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆవుల యాదయ్య, రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ వై అరుణ దేవి, మీర్పేట్ మాజీ మహిళ అధ్యక్షురాలు కె పద్మశ్రీ, జిల్లెలగూడ మాజీ టెంపుల్ డైరెక్టర్ వెంకటేష్ గౌడ్, విజయేంద్ర రెడ్డి, నవీన్ గౌడ్, హర్మేందర్ సింగ్, గోవర్ధన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, మురళి గౌడ్,పరశురాం,సైదులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి



**ప్రజాపక్షం/కొత్తూరు:** సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జ్యోషి వివరించారు. మంగళవారం కొత్తూరు, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలతోపాటు పోలీస్ స్టేషన్ల సమగ్ర పనితీరును సమీక్షించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు, సైబర్ నేరాలు, జూదంపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ కమిషన్ తరుణ్ జోషి వెంట షాద్‌నగర్ డిసిపి శిరీష, ఏసిపి లక్ష్మీ నారాయణ, కొత్తూరు సిఐ నర్సయ్య, షాద్‌నగర్ సిఐ సీతారం, ట్రాఫిక్ సిఐ శంకరయ్య, ఎస్‌ఐలు సుశీల, శ్రీకాంత్‌నాయక్, ప్రణయ్, కొత్తూరు ఎస్‌ఐలు సత్యశీలా రెడ్డి, గోపాలకృష్ణతో పాటు సిబ్బంది ఉన్నారు.

# గ్రామ, వార్డు సభలలో ప్రజల భాగస్వామ్యం

కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో గ్రామ, వార్డు సభలను విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతోపాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల నమోదు అధికారులు , ఎంపిడిఒలు, వ్యవసాయ, పంచాయతీరాజ్, మున్సిపల్, పౌర సరఫరాలు తదితర శాఖల అధికారులతో పర్యావరణ వారోత్సవాలు, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణ, ప్రత్యేక విస్తృత పునర్విమర్శ (ఎస్‌ఐఆర్), రైతు నమోదు, ఘన వ్యర్థాల నిర్వహణ, వర్షాకాల సన్నాహాలు, ధాన్యం సేకరణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4,6,8,10 తేదీలలో జిల్లాలోని అన్నిగ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని వార్డులలో గ్రామ సభలు, వార్డు సభలను నిర్వహించాలని తెలిపారు. ప్రతి సభను సంబంధిత సీనియర్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపడుతున్న కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక విస్తృత పునర్విమర్శ(ఎస్‌ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతిఅధికారి చురుకుగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపడుతోందని,జిల్లాలోని ప్రతి రైతు వివరాలు నమోదు అయ్యేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్షిస్తూ, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఐదు రోజులలోగా మిల్లులకు తరలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం తరలింపునకు అవసరమైన రవాణా వాహనాలను అందుబాటులో ఉంచి ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలిగించే విధంగా నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు కె.చంద్రారెడ్డి, డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విదేశీ విద్య పథకానికి దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖఅధికారి నవీన్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకొనే పేద మైనారిటీ విద్యార్థుల కోసం తెలంగాణ రాష్ట్రభుత్వం ఏర్పాటు చేసిన "ముఖ్యమంత్రి విదేశీ విద్య పథకం" ఉపకార వేతనాన్ని పొందుటకు స్ప్రింగ్ సీజన్ 2026 (స్ప్రింగ్ సీసన్ 2026 అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కోట్ల నవీన్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వార లబ్ది పొందాలనుకొనే విద్యార్థులు ఎంపిక చేయబడిన విదేశాలలోని యూనివర్సిటీ లలో 1 జనవరి 2026 నుంచి 30" జూన్ 2026 వరకు ప్రవేశం పొంది ఉండాలన్నారు. అర్హత గల వారు 1" జూన్ 2026 నుంచి 30 జూన్ 2026 వరకు ఆన్ లైన్ ద్వారా www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తుచేసుకోవాలన్నారు. పథకం వివరాలు, అర్హత, దరఖాస్తు, విద్యార్హతలు వివరాలు, ఎంపిక విధానం వెబ్ సైట్‌లో ఉన్నాయని వివరించారు.

## తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల పాత్ర కీలకం

సైబరాబాద్ సిపి రమేష్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల పాత్ర కీలకం అని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి)డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని సిపి రమేష్ ఆవిష్కరించారు. అనంతరం పరేడ్ కమాండర్ నుంచి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థికాభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి మహోన్నత సేవా పతకాలు, ఉత్తమ సేవా పతకాలు మరియు సేవా పతకాలను సిపి అందజేశారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డిసిపి ఎన్.కోటి రెడ్డి,అడ్మిన్ డిసిపి టి.అన్నపూర్ణ,శేరిలింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్,కూకట్పల్లి డిసిపి రితిరాజ్, డిసిపి క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్ సుధీంద్ర,డబ్ల్యు అండ్ సీఎస్డబ్ల్యూ డిసిపి సృజన కరణం, సైబర్ క్రైమ్స్ డిసిపి టి.సాయి మనోహర్, ఎస్ఓటీ డిసిపి శోభన్ కుమార్, సైబరాబాద్ సిఏఆర్ హెడ్క్వార్టర్స్ డిసిపి సంజీవ్ ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





షాద్‌నగర్...

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** జిజిహెచ్ మహేశ్వరం, వనస్థలిపురం ఆసుపత్రిలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా,బి. నరేందర్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డా.దామోదర్, రాజ్‌కుమార్, ఉమాశంకర్, అన్ని విభాల హెచ్ఒడి, నర్సింగ్ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో...** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బియన్‌రెడ్డి నగర్ చౌరస్తా, విజయపురి కాలనీ చౌరస్తా, బిజెపి రంగారెడ్డి అర్బన్ కార్యాలయం, సాహెబ్ నగర్ అంబేద్కర్ చౌరస్తా పార్టీలో బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను పార్టీ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామ రంగారెడ్డి, విష్ణవర్ధన్‌రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**హస్తినాపురం డివిజన్ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో...** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను హస్తినాపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మనాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ సయ్యద్ పాష, విష్ణు గౌడ్, రెడ్డిమాల క్రిష్ణ, నాగిరెడ్డి, బిక్షపతి చారి, శ్రీనివాస్ నాయక్, అమల గోపిసింగ్ నాయక్, పూజిత కపురా నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి మొదలుకొని ఆర్‌డిఓ కార్యాలయం వరకు జాతీయ జెండాను ఎగురవేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్, నేతలు పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీయార్డు వద్ద చైర్‌పర్సన్ సులోచన, పంచాయతీ రాజ్ డిఇ ఆఫీసు వద్ద డిఇ శ్రీనివాస్, ఎంపిడిఒ ఆఫీస్ వద్ద ఎంపిడివో శ్రీకాంత్, విద్యుత్, వ్యవసాయ శాఖ, ఐసిడిఎస్, తహశీల్దార్ ఆఫీస్ వద్ద అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నల్లమోని శ్రీధర్, కౌన్సిలర్లు విశాల, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, దిలీప్, మురళీమోహన్, రాజునాయక్, సంతోషిబాయి, అనిత, శారద, పినమోని గోపాల్, ఎస్పీ శివ, అశోక్, గౌస్ జానీ, కోఆప్షన్ సభ్యులు సుజీవన్, సయ్యద్ ఖదీర్, నేతలు బుబారక్, మహ్మద్ ఇబ్రహీం, గ్రంథాలయ కమిటి చైర్మెన్ మదన్‌మోహన్‌రెడ్డి, రఘునాయక్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, వెల్జర్ల సర్పంచ్ బాబునాయక్ పాల్గొన్నారు.

**షాద్‌నగర్ కోర్టు కాంప్లెక్ అవరణలో..** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను షాద్‌నగర్ కోర్టు కాంప్లెక్ అవరణలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.స్వాతిరెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జగన్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

### ఉద్యమకారులను కాపాడుతున్న ఘనత కాంగ్రెస్‌దే

ఉద్యమకారులను కంటికి రెప్పాలా కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుకుంటుందని ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి వివరించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఉద్యమకారులు సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దిలీప్ కుమార్, జెఏసి నేత జనార్ధన్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, జాంగారి రవి, అదెల్ల రాజు, ఎల్లోజీ, అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.



యాచారం...

**షాద్‌నగర్ తాలుకా జెఏసి ఆధ్వర్యంలో..** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను షాద్‌నగర్ తాలుకా జెఏసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. కార్యక్రమంలో తాలుకా జెఏసి చైర్మెన్ ఎం.జనార్ధన్, టిజి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, త్రిప్పిశెట్టి కరుణాకర్, కన్వీనర్ నక్కబాల్‌రాజ్ యాదవ్, వెంకట్ రాంరెడ్డి, ఆర్టీసి అర్జున్‌కుమార్, బాదేపల్లి సిద్దార్థ, క్యాసెన్ శ్రీనివాస్, రోమియో రమేష్ పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్:** కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షల ఫలితమే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాతోపాటు బిఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. తెలంగాణ ఉద్యమకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వంకాయల నారాయణరెడ్డి, రాంబల్‌నాయక్, ఈట గణేష్, సింగిల్ విండో చైర్మెన్ బక్కన్న యాదవ్, ఎంఎస్ నటరాజన్, లక్ష్మణ్‌నాయక్, వెండే కృష్ణ, కోస్గి శ్రీనివాస్, లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, చేగూరి వేణుగోపాల్, వెంకట్‌రెడ్డి, జామీ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి..

**యాచారం :** యాచారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జెండాను అవిష్కరించారు. యాచారం మండల పరిషత్ కార్యాయంపై మండల ప్రత్యేకాధికారి మాదవరావు, తహశీల్దారు కార్యాలయంపై అయ్యప్ప, ఐకెపి కార్యాలయంపై ఏపిఎం రవీందర్, వ్యవసాయ కార్యాలయంపై ఎఓ రవినాథ్, ప్రభుత్వాసుపత్రిపై సూపరిండెంట్ నవీన్‌కుమార్, సహకార సంఘం కార్యాలయంపై చైర్మన్ రాజేంధర్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్‌పై సిఐ నందిశ్వర్‌రెడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధరాణి, డిప్యూటీ తహసీల్దారు సాగర్, పిఎసిఎస్ సిఇఒ నాగరాజు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి:** తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి, మాదాపూర్, నల్లగండ్ల, చందానగర్, మియాపూర్, కొండాపూర్, శ్రీరామ్‌నగర్ డివిజన్‌లలో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ కార్యాలయాలు, సిఎంసి కమిషనర్ కార్యాలయం, సైబారాబాద్ పోలీస్ కమీషనరేట్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం, మియాపూర్ సర్కిల్ కార్యాలయాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు.





**సిఎంసి కార్యాలయంలో..** మాదాపూర్‌లోని సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కార్యాలయంలో తెలంగాణఅవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎంసి కమీషనర్ శ్రీజన హాజరై జాతీయ జెండా ఎగురవేశారు.

**గచ్చిబౌలి డివిజన్ పరిధిలో..** గచ్చిబౌలి డివిజన్ పరిధీలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి, నల్లగండ్ల డివిజన్‌లలోని కాలనీలలో కొమరిశెట్టి సాయిబాబా జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో రాగం జంగయ్య యాదవ్, రాగం హరి శంకర్ యాదవ్, రమేష్ గౌడ్, అంజమ్మ, రాజు ముదిరాజ్,శామ్లెట్ శ్రీనివాస్, కృష్ణరావు, వెంకట్ రెడ్డి, నారాయణ, సురేష్, బాలమణి, రాణి, మాధవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

**సైబారాబాద్ సిపి కార్యాలయంలో..** రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని సైబారాబాద్ పోలీస్ కమీషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సైబారాబాద్ పోలీస్ కమీషనర్ డా.ఎం రమేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**మాదాపూర్ డివిజన్ పరిధిలో...** మాదాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బిక్షపతి ముదిరాజ్, మధుసూదన్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, రాఘవరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, పోల్ రెడ్డి, రాహుల్, సలీమ్, షేక్ ఇమ్రానఅరవింద్, నర్సింహ, సుధాకర్, భరత్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, శ్రీకాంత్, అఖిల్ పాల్గొన్నారు.







ఎల్‌బి.నగర్...

ఆవిష్కరణలు, అభివృద్ధి రంగాలలో

# తెలంగాణ అద్భుత పురోగతి

- ప్రశంసించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ • రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు
- లక్షలాది మంది త్యాగం, పట్టుదల, అచంచలమైన ఆకాంక్షలతో పుట్టిన తెలంగాణ : రాహుల్‌గాంధీ






**న్యూఢిల్లీ :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రం ఆవిష్కరణ, అభివృద్ధి రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించిందని ద్రౌపది ముర్ము ప్రశంసించారు. తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వం, కష్టపడి పనిచేసే ప్రజలతో ఆశీర్వదించబడిందని, గత కొన్నేళ్లుగా రాష్ట్రం ఆవిష్కరణ, అభివృద్ధి రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. తెలంగాణ ప్రజలు నిరంతర పురోగతి, శ్రేయస్సును సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంగళవారం ఆమె ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, రాష్ట్ర అభివృద్ధికి, అభివృద్ధి చెందిన భారతదేశ కలను సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ ప్రజలు వారి నూతన ఆవిష్కరణలు, వ్యాపార స్ఫూర్తికి ప్రసిద్ధి చెందారని, అలాగే ఈ రాష్ట్రం ధైర్యం, పట్టుదలతో కూడిన అద్భుతమైన సంస్కృతి, చరిత్రకు పేరు గాంచిందని ప్రధానమంత్రి ఎక్స్‌లో పేర్కొన్నారు. 'మన సమైక్య భారత్ కలను సాకారం చేసే క్రమంలో తెలంగాణ అభివృద్ధి పథానికి మద్దతు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్ర ప్రజల మంచి ఆరోగ్యం, విజయం కోసం కాంక్షిస్తున్నాను' అని ఆయన అన్నారు.

**లక్షలాది మంది ప్రజల పోరాటం, త్యాగాల ఫలితం : రాహుల్**

తెలంగాణ లక్షలాది మంది ప్రజల పోరాటం, త్యాగాల ఫలితమని, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి గౌరవంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళుతుందని పార్టీ మాజీ అధినేత రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గాంధీ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం తమ ప్రాణాలను అర్పించిన వ్యక్తులకు నివాళులర్పించారు. లక్షలాది మంది త్యాగం, పట్టుదల, అచంచలమైన ఆకాంక్షలతో పుట్టిన రాష్ట్రమైన తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుభాకాంక్షలు తెలిపారు. భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో తెలంగాణ ఏర్పాటు ఒక కీలక ఘట్టంగా నిలుస్తుందని ఆయన అన్నారు. 'డాక్టర్ మన్మోహన్ సింగ్, సోనియా గాంధీల నాయకత్వంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం ప్రజల చిరకాల ఆకాంక్షలను గౌరవించి, భారతదేశపు అత్యంత పిన్న వయస్సు రాష్ట్రమైన తెలంగాణ ఏర్పాటులో చారిత్రాత్మక పాత్ర పోషించింది' అని ఖర్గే అన్నారు. 'ఈ పవిత్రమైన రోజున, తమ త్యాగాలు, పోరాటాలతో తెలంగాణను వాస్తవ రూపం ఇచ్చిన అసంఖ్యాక అమరవీరులు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, కార్యకర్తలకు మనం శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నాము' అని ఆయన అన్నారు. వారి ధైర్యం, నిబద్ధత రాష్ట్ర ఆత్మలో శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం, బలహీనులకు బలం, మహిళలు, యువత సాధికారత, తెలంగాణలోని ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి సర్వతోముఖాభివృద్ధి కోసం నిలిచే 'ఇందిరమ్మ రాజ్యం' స్ఫూర్తి ఈ ప్రయాణానికి మార్గదర్శకంగా నిలుస్తూనే ఉందని ఆయన అన్నారు. తెలంగాణ ఆత్మవిశ్వాసంతో, ఆశతో ముందుకు సాగుతున్న తరుణంలో, అక్కడి ప్రజలకు శాంతి, శ్రేయస్సు, నిరంతర పురోగతి కోసం మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని కాంగ్రెస్ అధినేత అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్య, సాంకేతిక బలంతో పురోగమించి...

# 'బలమైన ఆత్మనిర్భర భారత్'ను నిర్మించండి

- యువతకు రాష్ట్రపతి ముర్ము పిలుపు • ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్స్ పథకాల లబ్ధిదారులను ఉద్దేశించి కీలక ప్రసంగం

**న్యూఢిల్లీ :** విద్య, సాంకేతిక బలంతో యువత పురోగమించి బలమైన, సుసంపన్నమైన ఆత్మనిర్భర భారతదేశాన్ని నిర్మించాలని మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఇక్కడ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని కలిసిన కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్ పథకాల లబ్ధిదారుల బృందాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఆమె వారిని రాష్ట్రపతి భవన్‌కు పిలిపించారు. గిరిజన వర్గాలకు చెందిన యువతకు సాధికారత కల్పించి, వారిని ఉన్నతీకరించడానికి భారత ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిరంతర ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. విద్య అనేది సాధికారికతకు ఒక కీలకమైన సాధనమని, అది ఒక వ్యక్తిని, స్వయం సమృద్ధిగా, చైతన్యవంతంగా, సమర్థుడిగా తీర్చిదిద్దే శక్తిని కలిగి ఉంటుందని రాష్ట్రపతి ఉద్బోధించారు. తన జీవిత ప్రయాణంలో కూడా విద్య ఒక కీలక పాత్రను పోషించిందన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ పెద్ద కలలను కనేందుకు ధైర్యం చేసే పిల్లలకు మీ విద్య, అనుభవాలు స్ఫూర్తిగా నిలవాలని ముర్ము వారిని ఉద్దేశించి అన్నారు. వారు ఇతరులను కలుపుకుని ముందుకు సాగినప్పుడే దేశ సమగ్రాభివృద్ధి కార్యరూపం దాల్చుతుందని ముర్ము అన్నారు. యువత తమ వారసత్వం పట్ల గర్వం కలిగి విద్య, సాంకేతిక బలంతో ముందుకు సాగినప్పుడు వారు బలమైన, సుసంపన్నమైన, స్వయం సమృద్ధిగల భారతదేశాన్ని నిర్మిస్తారని ఆమె పేర్కొన్నారు. 'యువత మనదేశానికి బలం, ఆశ, ఉజ్వల భవిష్యత్తుకు ప్రతీక' అని రాష్ట్రపతి అన్నారు. యువత ముఖ్యంగా గిరిజన వర్గాలకు చెందిన వారు తమ మూలాలను, తమ ప్రజలను మర్చిపోవద్దని కోరారు. '2047నాటికి భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చే దిశగా మేం ముందుకు సాగుతున్నాం. ఈ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషిస్తుంది' అని రాష్ట్రపతి అన్నారు. వారు ఏ రంగాన్ని ఎంచుకున్నా సమాజ, దేశాభివృద్ధిలో చురుకైన పాత్రను పోషించగలరన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.దేశంలో ప్రతిభకు ఎలాంటి కొరత లేనే లేదన్నారు. లబ్ధిదారులను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ స్కాలర్‌షిప్స్ కేవలం ఆర్థిక సహాయక సాధనాలు మాత్రమే కాదని,అవి యువత కలలకు రెక్కలవంటి వాహనాలు అని తెలియజేశారు.అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ వనరుల కొరత కారణంగా పురోగతి సాధించలేకపోతున్న యువత జీవితాలలోని కొత్త అవకాశాలకు స్కాలర్‌షిప్స్ ద్వారాలు తెరుస్తాయని ముర్ము అన్నారు.

# బిజెపి రిగ్గింగ్ చేసింది

- క్లిష్ట సమయంలో టిఎంసి కార్యకర్తలను వదలను
- ఎన్నికల తరువాత తమ పార్టీ కార్యకర్తలపై బిజెపి నేతలు దాడులు చేస్తున్నారు : ధర్నా నిర్వహించిన మమతా బెనర్జీ



**కోల్‌కతా :** బెంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు ఇటీవల ఎన్నికలు జరగగా, 177 స్థానాల్లో ఓట్ల లెక్కింపులో బిజెపి రిగ్గింగ్‌కు పాల్పడిందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో టిఎంసి ఓటమి తర్వాత, అవినీతి, బెదిరింపులు, దోపిడీ ఆరోపణలపై నాయకులను పెద్ద ఎత్తున అరెస్టు చేయడం, పార్టీ కార్యకర్తలను హింసించడం వంటి ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఈ క్లిష్ట సమయాలలో తాను టిఎంసి కార్యకర్తలను విడిచిపెట్టబోనని బెనర్జీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో బిజెపి విజయం తర్వాత, తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై ఎన్నికల అనంతర దాడులు జరిగాయని ఆరోపించారు. దాడులను వ్యతిరేకిస్తూ కోల్‌కతా నగర కేంద్రంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. రాణి రష్మోని రోడ్డులో నిరసన చేపట్టాలన్న టిఎంసి విజ్ఞప్తిని కోల్‌కతా పోలీసులు తిరస్కరించడంతో, బెనర్జీ ఎస్‌ప్లనేడ్‌లోని వైఛానల్ వద్ద ఉన్న ధర్నా ప్రదేశానికి చేరుకున్నారు. ధర్నాలో టిఎంసి మద్దతుదారులనుద్దేశించి బెనర్జీ మాట్లాడుతూ బిజెపి వ్యతిరేక పార్టీలు త్వరలో దేశవ్యాప్త కార్యక్రమాన్ని రూపొందిస్తాయని చెప్పారు. వచ్చే వారం జరగనున్న ఇండియా కూటమి సమావేశాన్ని ప్రస్తావిస్తూ, త్వరలోనే బిజెపి వ్యతిరేక పార్టీలన్నీ ఢిల్లీలో సమావేశమవుతాయని, త్వరలోనే తమ దేశవ్యాప్త కార్యాచరణను ప్రకటిస్తాని టిఎంసి అధినేత్రి అన్నారు. తాము కోరిన చోట మా కార్యక్రమాన్ని నిర్వహించడానికి అనుమతి లభించలేదని, ప్రత్యామ్నాయ స్థలంలో వేదిక ఏర్పాటు చేసుకోవడానికి గానీ, మైక్రోఫోన్లు ఉపయోగించడానికి గానీ పోలీసులు అనుమతించలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి ప్రసంగం మధ్యలో టిఎంసి కార్యకర్తలు నినాదాలు చేయడంతో ఈ నిరసనలో అక్కడక్కడా గందరగోళం నెలకొంది. 'పోలీసుల బెదిరింపులను లెక్కచేయకుండా ఇక్కడికి వచ్చిన వారు ఒక విషయం తెలుసుకోవాలి. యూనిఫాంలో ఉన్న పోలీసులను, వారు చేయకూడని పనులు చేయించడానికి బిజెపి ప్రభుత్వం వాడుకుంటోంది. టిఎంసి కార్యకర్తలను బెదిరించడం వారి విధిలో భాగం కాదు అని బెనర్జీ ఆరోపించారు. టిఎంసి టిక్కెట్లపై అసెంబ్లీ సీట్లు గెలుచుకున్న చాలా మంది కొత్త ముఖాలు కనిపించని నేపథ్యంలో, టిఎంసి అధినేత్రి వెంట పార్టీ సీనియర్ నాయకులైన ఫిర్హాద్ హాకీమ్, మదన్ మిత్రా, కళ్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ్, చంద్రిమా భట్టాచార్య, డోలా సేన్ కనిపించారు. అయితే, తన మేనల్లుడు, టిఎంసి ఎంపి అయిన అభిషేక్ బెనర్జీపై శనివారం జరిగిన దాడి, ఎన్నికల అనంతర హింస, తోపుడు బండ్ల వ్యాపారులను ఖాళీ చేయించడం వంటి వాటికి నిరసనగా చేపట్టిన ధర్నా షెడ్యూల్ ప్రకారం సాయంత్రం వరకు కొనసాగుతుందని పార్టీ అధినేత్రి స్పష్టం చేశారు. సోనార్‌పూర్‌లో అభిషేక్‌పై జరిగిన దాడి ప్రణాళికాబద్ధంగా జరిగిందని బెనర్జీ ఆరోపించారు.

# పార్లమెంటరీ ప్యానల్ ముందుకు విద్యార్థి

ఓఎస్‌ఎం మూల్యాంకన ప్రక్రియలో లోపాలు వెల్లడి

**న్యూఢిల్లీ :** సిబిఎస్ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం 18 ఏళ్ల విద్యార్థి సార్థక్ సిద్ధాంత్ పార్లమెంటరీ స్టాండింగ్ ప్యానెల్ ముందు హాజరయ్యారు. టెండర్ ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. తాను గుర్తించిన అంశాలను కమిటీ వెల్లడించారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం సమావేశమైంది. సిబిఎస్ఇ 12వ తరగతి బోర్డు పరీక్షల్లో ఎస్‌ఎం సిస్టమ్ వినియోగం, అలాగే దానిపై తలెత్తిన ఆందోళనలను చర్చించేందుకు కాంగ్రెస్ ఎంపి దిగ్విజయ్ సింగ్ అధ్యక్షతన ఈ కమిటీ భేటీ అయింది. ఇందులో పాల్గొని, తమ సమస్యలు తెలియజేయడానికి విద్యార్థి ప్రతినిధులకు అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలోనే సార్థక్ ప్రజంటేషన్ ఇచ్చారు. కోఎస్ట్ ఎడ్యుటెక్‌కు కాంట్రాక్టు అప్పగించడానికి ముందే అర్హత, మూల్యాంకన ప్రమాణాలు మార్చారని ఆరోపించారు. ఒఎస్ఎం సిస్టమ్ అమలు తీరు, విద్యార్థులపై దాని ప్రభావం గురించి ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం దిగ్విజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. ''ఆ విద్యార్థి తాను గుర్తించిన విషయాలను వెల్లడించారు. వీటిపై సిబిఎస్ఇ నుంచి సమాధానం కోసం చూస్తున్నాం. తర్వాత కమిటీ నిర్ణయం ఉంటుంది' అని వెల్లడించారు. వేర్వేరు పార్టీలకు చెందిన 21 మంది లోక్‌సభ ఎంపిలు, 10 మంది రాజ్యసభ ఎంపిలు ఈ ప్యానెల్‌లో సభ్యులుగా ఉన్నారు.



**సిబిఎస్ఇ చీఫ్‌కు సమన్లు**

సిబిఎస్ఇ చీఫ్‌కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది. ఒఎస్ఎం వ్యవస్థ అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్‌తో పాటు సిబిఎస్ఇ చీఫ్ రాహుల్ సింగ్‌ను పార్లమెంటరీ విద్యా స్థాయీ సంఘం ముందు హాజరుకావాలని పార్లమెంటరీ ప్యానెల్ ఆదేశించింది.

# వీసా గడువు ముగియకముందే రిజిస్ట్రేషన్

ఇమిగ్రేషన్ నిబంధనల్లో హోంశాఖ మార్పులు




**న్యూఢిల్లీ :** ఇమిగ్రేషన్ నిబంధనల్లో హోంశాఖ కీలక మార్పులు చేసింది. విదేశీయులు అనుమతి పొందిన సమయం కన్నా ఎక్కువ రోజులు భారత్‌లో ఉండాలంటే వారి వీసా గడువు ముగియకముందే విదేశాంగశాఖ వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. ఈ మేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. భారత్‌కు 180 రోజులు అంతకంటే తక్కువ గడువు వీసాలపై వచ్చే విదేశీయులకు ఈ నిబంధన వర్తిస్తుంది. వీరు భారత్‌లో కొనసాగాలంటే వీసా గడువు ముగియకముందే రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోవాలి. గతంలో వీసా గడువు పూర్తైన తర్వాత 14 రోజుల్లోపు పొడిగింపునకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కాని ఇప్పుడు ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. భారత్‌లో ఉన్న విదేశీ పౌరులపై పర్యవేక్షణకు ఈ నిబంధన ఉపయోగపడనుంది. భారత్‌లో సంతానం ఉన్న విదేశీయుల కోసం మరో మార్పు చేసింది. భారత్‌లో బిడ్డ జన్మించిన 30 రోజుల్లోపు ఆన్‌లైన్ లేదా మొబైల్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కొత్త నిబంధన ప్రకారం తల్లిదండ్రుల్లో ఒకరు భారత జాతీయులై ఉండి.. తమ పౌరసత్వాన్ని ఉంచుకోవాలనుకుంటే మాత్రం అలాంటివారికి బిడ్డ పుట్టుక రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపును ఇచ్చింది.

ఇంధన ధరల పెంపునకు వ్యతిరేకంగా

# రైతు సంఘాల నిరసన

**హోషియార్‌పూర్/లుధియానా :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇంధన ధరలను పదే పదే పెంచడాన్ని ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, రైతు సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పంజాబ్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలోని వివిధ సంస్థలకు అనుబంధంగా ఉన్న రైతులు, ఇంధన ధరల పెంపుతో సహా పలు సమస్యలపై మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. జిల్లా పరిపాలనా సముదాయాల బయట, ఇతర ప్రదేశాలలో నిరసనలు చేపట్టి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌లను ఉద్దేశించి అధికారులకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. భారతీయ కిసాన్ యూనియన్ (లఖోవాల్)తో సహా ఎస్‌కెఎం అనుబంధ రైతు సంఘాలు కూడా కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. భాక్రా బియాస్ నిర్వహణ బోర్డు (బిబిఎంబి)లో పంజాబ్‌కు శాశ్వత ప్రాతినిధ్యాన్ని లేకుండా చేసిన ఒక నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని ఎస్‌కెఎం ఆ వినతిపత్రంలో కోరింది. సహకార సంఘాల ద్వారా పెంచిన పంట రుణ పరిమితులను పునరుద్ధరించాలని, డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని, ఎరువుల తగినంత లభ్యతను కల్పించాలని, యూరియా ధరల పెంపును వెనక్కి తీసుకోవాలని, సబ్సిడీ ప్రయోజనాలను పునరుద్ధరించాలని కూడా రైతులు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టపరమైన హామీ ఇవ్వాలని, అలాగే సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా ఆధారంగా ఎంఎస్‌పిని అమలు చేయాలని ఆ వినతిపత్రం కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ ఉపశమనం, వరదలు, వడగళ్ల వానలు, అకాల వర్షాల వల్ల కలిగే పంట నష్టాలకు పరిహారం, ప్రతిపాదిత విద్యుత్ సవరణ బిల్లు, 2025, విత్తన బిల్లు, 2025లను ఉపసంహరించుకోవడం వంటివి ఇతర డిమాండ్లలో ఉన్నాయి. ఢిల్లీలో నిర్వహించిన రైతు ఆందోళనకు సంబంధించి రైతులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని, రైతు అనుకూల పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను విడుదల చేయాలని, పంజాబ్ కోసం సుస్థిర వ్యవసాయ విధానాన్ని రూపొందించాలని కూడా రైతులు కోరారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమికి తగిన పరిహారం, అటారీవాఘా, హుస్సేనీవాలా సరిహద్దుల ద్వారా వాణిజ్య మార్గాలను తిరిగి తెరవడం, 58 ఏళ్లు పైబడిన రైతులు, కార్మికులు, గ్రామీణ చేతివృత్తుల వారికి నెలకు రూ.10,000 పింఛను ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. లుధియానాలో, సంయుక్త కిసాన్ మోర్చాలోని వివిధ వర్గాల మద్దతుదారులు తమ డిమాండ్లకు మద్దతుగా డిప్యూటీ కమిషనర్ కార్యాలయం బయట నిరసన చేపట్టారు. ఎస్‌కెఎం జెండాలను చేతబట్టుకుని, నిరసనకారులు కేంద్ర, పంజాబ్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిర్దిష్ట చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు.



# 'నీట్' నిందితుడి నివాసంపైకి బుల్డోజర్



**ముంబయి :** నీట్‌యూజీ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్ పివి కులకర్ణి నివాసంపై మహారాష్ట్ర మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బీడ్ జిల్లాలోని ఆయన ఇంటిని నిబంధనలకు అతిక్రమించి నిర్మిస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. దాన్ని తొలగింపునకు నోటీసులు జారీ చేశారు. అనంతరం బుల్డోజర్‌తో నిర్మాణంలో ఉన్న అక్రమ భాగాలను తొలగించే పనిలో నిమగ్నయ్యారు. పివి కులకర్ణి.. బీడ్‌లోని షాహునగర్‌లో గతంలో తన పూర్వీకులు ఉన్న ఇంటి స్థలంలో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఇటీవల పేపర్‌లీక్ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో ఆ కట్టడంపై స్థానిక మునిసిపల్ అధికారులు దృష్టి సారించారు. సర్వే నిర్వహించగా.. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు ఆరోపణలు రావడంతో.. సమీక్షించిన ఎన్‌టిఎ మే 12న పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు, ఈ వ్యవహారంలో సిబిఐ ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేసింది.

పోటీ పరీక్షలలో జరిగిన అవకతవకలపై

# 'ఐవైసి' దేశవ్యాప్త ఆందోళనలు తీవ్రతరం




**న్యూఢిల్లీ :** పోటీ పరీక్షలలో జరిగిన అవకతవకలపై దేశవ్యాప్త ఆందోళనను తీవ్రతరం చేయనున్నట్లు ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసి) ప్రకటించింది. అలాగే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. పదేపదే జరుగుతున్న పరీక్షల వివాదాలు విద్యా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని ఆరోపిస్తూ, కాగడా ప్రదర్శనలు, విద్యార్థుల అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, ఘెరావోలతో సహా పలు రాష్ట్రాల్లో కొత్త దశ నిరసనలను ప్రారంభిస్తామని కాంగ్రెస్ యువజన విభాగం తెలిపింది. ఈ ప్రచారానికి నాయకత్వం వహించడానికి ఐవైసి అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ పలు రాష్ట్రాల్లో పర్యటించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రచారం మహారాష్ట్ర, తెలంగాణ, అసోం, హర్యానా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, పంజాబ్, తమిళనాడు తదితర రాష్ట్రాలను కవర్ చేయనుంది. వివిధ నియామక, ప్రవేశ పరీక్షలలో పేపర్ లీక్‌లు, పరీక్షలకు సంబంధించిన అవకతవకలు, పరిపాలనా లోపాల కారణంగా విద్యార్థులు పదేపదే ఇబ్బందులు పడ్డారని ఐవైసి ఆరోపించింది. పరీక్షల నిర్వహణలో అనుమానాస్పద సంస్థలకు కాంట్రాక్టులు అప్పగించారన్న వార్తలపై కూడా ఆందోళన వ్యక్తం చేసింది. 'ఈ దేశ విద్యార్థులు ఉద్యోగాలు, న్యాయం, జవాబుదారీతనానికి అర్హులు. దానికి బదులుగా, వారికి పేపర్ లీకులు, అనిశ్చితి, విచ్ఛిన్నమైన పరీక్షా వ్యవస్థను అందించారు' అని ఐవైసి ఇన్‌చార్జ్ మనీష్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జవాబుదారీతనం నిర్ధారించి, బాధ్యులను తొలగించే వరకు తమ సంస్థ నిరసనలను కొనసాగిస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులు లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని చిబ్ ఆరోపించారు. పరీక్షల లీకులు, అవకతవకలు యువ ఆశావహుల భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీశాయని ఆయన పేర్కొన్నారు. 'మేము ఇప్పుడు దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నాము. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించేలా ప్రధాని నరేంద్ర మోదీ ఒత్తిడి తెచ్చే వరకు మేము ఆగము,' అని ఆయన అన్నారు.

# నా రాజకీయ ప్రస్థానంలో గాంధీ కుటుంబ పాత్రకు కృతజ్ఞతలు

'నేడు' సిఎంగా డి.కె. శివకుమార్ ప్రమాణం



**బెంగళూరు :** కర్నాటక నూతన ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం తన రాజకీయ ప్రస్థానంలో గాంధీ కుటుంబం పోషించిన పాత్రకు కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితంలోని వివిధ దశలలో వారు తనపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు తెలిపారు. వారి నాయకత్వంలో, రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో, ఉమ్మడి విలువలతో కూడిన ప్రగతిశీల, సమ్మిళిత, సుసంపన్నమైన కర్ణాటకను నిర్మించడానికి తాను చిత్తశుద్ధితో, నిబద్ధతతో పనిచేయడం కొనసాగిస్తానని ఆయన అన్నారు. కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా ఉన్న శివకుమార్, బుధవారం సాయంత్రం 4.05 గంటలకు లోక్‌భవన్ ప్రాంగణంలో మంత్రివర్గంలోని కొందరు సభ్యులతో పాటు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మే 30న కర్ణాటక కాంగ్రెస్ శాసనసభ పక్ష నాయకుడిగా అధికారికంగా ఎన్నికయ్యారు. 'నా రాజకీయ ప్రస్థానంలో గాంధీ కుటుంబం కేవలం నాయకత్వం ద్వారానే కాకుండా, నా జీవితంలోని వివిధ దశలలో నాపై ఉంచిన విశ్వాసం ద్వారా కూడా కీలక పాత్ర పోషించింది' అని శివకుమార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'నాలో నేను సామర్థ్యాన్ని గుర్తించకముందే, ఒక యువ కార్యకర్తలోని సామర్థ్యాన్ని గుర్తించిన రాజీవ్ గాంధీని నేను తరచుగా గుర్తు చేసుకుంటాను. ఆయన ఇచ్చిన ప్రోత్సాహం, మరింత పెద్ద కలలు కనడానికి, ప్రజా సేవకు నన్ను నేను అంకితం చేసుకోవడానికి నాకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది' అని ఆయన అన్నారు. ఇతరులలోని అవకాశాలను గుర్తించి, వారి అంచనాలకు మించి ఎదగడానికి స్ఫూర్తినిచ్చే వారే గొప్ప నాయకులని, రాజీవ్ గాంధీ నా కోసం సరిగ్గా అదే చేశారన్నారు. నా ప్రయాణంలోని సవాలుతో కూడిన దశలలో నాపై ఆమె ఉంచిన విశ్వాసాన్ని నేను ఎప్పటికీ పదిలపరుచుకుంటాను అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ తనకు నిరంతరం మార్గదర్శకత్వం, స్ఫూర్తిని అందించారని డికె ఉద్ఘాటించారు. ఆయన ప్రజల మాట వినే తత్వం, ప్రజాస్వామ్య విలువల్లోని దృఢ విశ్వాసం, మరింత సమ్మిళిత, కరుణామయ భారతదేశం కోసం ఆయనకున్న దార్శనికత తనలాంటి నాయకులను నిరంతరం ప్రేరేపిస్తూనే ఉన్నాయని ఆయన అన్నారు. 'నా ప్రజా జీవితమంతటా ఆయన మద్దతు ఒక బలమైన స్తంభంలా నిలిచింది' అని అన్నారు. ప్రియాంక గాంధీ ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటూ, ఆప్యాయంగా, ప్రోత్సాహకరంగా ఉంటారని శివకుమార్ అన్నారు. క్షేత్రస్థాయి కార్యకర్తగా తన ప్రస్థానం ప్రారంభించి, నేడు కర్ణాటకకు నాయకత్వం వహించే బాధ్యతను స్వీకరించిన తనకు, వారి నమ్మకానికి, ప్రోత్సాహానికి ఎప్పటికీ కృతజ్ఞుడనై ఉంటానన్నారు.

తెలంగాణప్రభుత్వం
**రోడ్లు మరియు భవనాల శాఖ**
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్
NIT No. 01/TS/TO/EE/R&B/SPL/2026-27/, తేదీ: 25.05.2026. ఖమ్మం జిల్లాలో 02 రోడ్ పనుల కొరకు సత్తుపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. టెండర్ షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.Tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. **టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ:** 05.06.2026 మ.2:30గం.ల వరకు, మరిన్ని వివరాలకు 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), డివిజన్ : సత్తుపల్లి.
DIPR R.O. No. : 3440-PP/CL/ADVT/2026-27, Date: 02-06-2026

GHMC **గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-30, జిహెచ్ఎంసి.**
NIT No.03: 04/E.E.30/GHMC/2026-27 తేది: 01.06.2026
**పని పేరు:** జిహెచ్ఎంసి, జిజెడ్, డివిజన్-30 క్రింద వివిధ పనులు, **అంచనా మొత్తం :** రూ.57.45 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 02.06.2026 ఉ.11:00గం.లకు మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 05.06.2026 ఉ.11:00 గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ 30, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 3427-PP/CL/ADVT/2026-27, Date: 02-06-2026

# నెతన్యాహూపై ట్రంప్ మండిపాటు

**మిత్రుడి ఆగ్రహంతో లెబనాన్‌పై దాడులు నిలిపివేసిన నెతన్యాహూ**
**వాషింగ్టన్‌లో మరో విడత చర్చలు ప్రారంభం**



**వాషింగ్టన్ :** లెబనాన్‌లో పరిణామాలపై నెతన్యాహూపై ట్రంప్ ఫోన్‌లో విరుచుకుపడ్డారు. ఆయన వాడీవేడీ వాగ్యుద్ధం, ఆగ్రహావేశాలు చూశాక నెతన్యాహూ వెంటనే లెబనాన్‌లో దాడులను నిలిపివేశారు. అదేవిధంగా హెజ్బొల్లా నాయకత్వ ప్రతినిధులతో కూడా ట్రంప్ సంభాషించారు. వారు కూడా ఐడిఎఫ్ సైనికులపై కాల్పులు చేయకుండా విరమించేందుకు అంగీకరించారని ట్రంప్ చెప్పారు. ''నువ్వో పిచ్చివాడివి, నేను నిన్ను కాపాడుతూ వస్తున్నాను, నేను లేకపోతే ఈ పాటికి నువ్వు జైల్లో ఉండేవాడివి, నీకు పిచ్చిపట్టింది, నిన్ను ఇప్పుడు అందరూ ద్వేషిస్తున్నారు'' అని లెబనాన్‌పై దాడుల విషయం గురించి నెతన్యాహూతో ఫోన్ సంభాషణల్లో ట్రంప్ తిట్ల పురాణం అందుకున్నారు. దీంతో నెతన్యాహూ స్పందిస్తూ, 'ఓకే, ఓకే... ఇక ప్రతి విషయాన్ని జాగ్రత్తగా చూసుకుంటాం, మీరు నిర్ధారించుకోండి'' అని ట్రంప్‌ను శాంతపరిచారు. ట్రంప్ ఆగ్రహంతో నెతన్యాహూ దార్లో పడి బీరూట్‌పై భారీ దాడులను నిలిపివేశారు. సేనలను వెనక్కు మళ్ళించారు. ఐతే హెజ్బొల్లా గనుక ఉత్తర ఇజ్రాయెల్‌లో దాడులు కొనసాగిస్తే తాము ముందుగా అకున్నవిధంగా బీరూట్‌పై భీకర దాడులు కొనసాగిస్తామని నెతన్యాహూ హెచ్చరించారు. అమెరికన్ న్యూస్ వెబ్‌సైట్ ఆక్సియోస్ మంగళవారం ఈ విషయం వెల్లడించిందని పిటిఐ వార్తాసంస్థ పేర్కొంది. ''అసలు నువ్వేం చేస్తున్నావో నీకు తెలుస్తోందా?'' అంటూ ఒక దశలో ట్రంప్ తారాస్థాయిలో నెతన్యాహూపై విరుచుకుపడ్డారని మరో అధికారి మీడియాకు చెప్పినట్లు ఆక్సియోస్ పేర్కొంది. దీనికి ముందు ఎన్‌బిసితో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుతూ, అసలు వారు చర్చలు నిలిపివేసిన విషయం తనకు ముందుగా చెప్పలేదని, వారు చర్చలు ముగిస్తే మంచిదే, వారు అలా అనడం సరైనదే, ఎందుకంటే వారు పోరాట యోధులకంటే చర్చలు జరపడంలో మెరుగైనవారు,వారు మాకు ముందుగా చెప్పలేదు, అంత మాత్రాన మేం వెళ్ళి వాళ్ళమీద బాంబులు వేస్తామని అర్థం కాదు'' అన్నారు. సోమవారంనాడు అమెరికా–ఇరాన్ పరస్పర దాడులు చేసుకోవడం, లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ చొచ్చుకుపోవడంతో తీవ్ర పరిణామాలు సంభవించాయి. ఇదిలా ఉండగా, వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్–లెబనాన్ రాయబారుల లమధ్య మరో విడత చర్చలు మంగళవారం ప్రారంభమైనట్లు ఇజ్రాయెల్ పత్రిక ప్రకటించింది. అమెరికా విదేశాంగశాఖ కార్యాలయంలో రెండు రోజులపాటు ఈ నాలుగో విడత సమావేశాలు జరుగుతాయి.

గడచిన ఆరువారాలుగా లెబనాన్‌లో జరుగుతున్న యుద్ధ దాడులపై యావత్ ప్రపంచం పెద్దగా దృష్టి సారించలేదు. లెబనాన్‌లో దాడులను విస్తరించిన ఇజ్రాయెల్ 26 సంవత్సరాల తర్వాత మళ్ళీ చరిత్రాత్మకమైన బ్యూఫోర్ట్ కోటను స్వాధీనం చేసుకున్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా నెతన్యాహూపై ఆగ్రహం పెల్లుబికింది. ఐక్యరాజ్యసమితి కూడా అత్యవసర సమావేశం నిర్వహించి లెబనాన్‌లో శాంతి దళాల ఉనికిని ఉద్ఘాటించింది. ఒకవైపు యుద్ధ ముగింపు చర్చలు జరుగుతున్న సమయంలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ రెచ్చిపోయి దాడులు చేయడంతో ఇరాన్ ఆకస్మికంగా ''పచ్చికొట్టి'' ఇక మధ్యవర్తిద్వారా అమెరికాతో సంప్రదింపులు, యుద్ధ చర్చలకు అవకాశం లేదని, వాటిని నిలిపివేశామని సోమవారం రాత్రి పొద్దుపోయాక ప్రకటించింది. ఇదేవిధంగా లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం తన దాడులను విస్తరిస్తే తూర్పు ఇజ్రాయెల్ ప్రాంతంలో ప్రజలు ఇళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోవాల్సి వస్తుందని, దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఎలాంటి ఒప్పందం జరిగినాగానీ అందులో లెబనాన్‌లో యుద్ధాన్ని ముగించే అంశం కూడా ఉండాలని ఇరాన్ షరతు విధించింది. దీంతో ఇంటా బయటా ట్రంప్‌కు అవమానం ఎదురైంది. ఈ పరిస్థితులమధ్య తీవ్ర ఒత్తిడికి గురైన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూకు ఫోన్ చేసి ఆయనపై తీవ్ర ఆగ్రహం వెళ్ళగక్కారు. మండిపడ్డారు. ట్రంప్ చెప్పినాగానీ నెతన్యాహూ వెనక్కు తగ్గకుండా లెబనాన్‌లో దాడులను ఉద్ధృతం చేయడంవల్లనే ఈ పరిస్థితి వచ్చింది.'' ప్రపంచం మిమ్మల్ని అసహ్యించుకుంటోంది, మీకు పిచ్చిపట్టింది, అందరూ ఇజ్రాయెల్‌ను ద్వేషిస్తున్నారు'' అని ఫోన్‌లో ట్రంప్ ఆగ్రహం ప్రకటించారు. దీంతో వెంటనే నెతన్యాహూ తాత్కాలికంగా కళ్ళు తెరచి వెనక్కు తగ్గారు.లెబనాన్‌లో దాడులు నిలిపివేయాలని ఇజ్రాయెల్ సైనిక బలగాలకు నెతన్యాహూ ఆదేశాలు జారీ చేశారు.

ఆ తర్వాత ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ నెతన్యాహూకు తాను నచ్చజెప్పానని పేర్కొన్నారు. ఆయన బీరూట్‌పై దాడులను నిలిపివేశారని, తన దళాలను నెతన్యాహూ వెనక్కు మళ్ళించారు, థ్యాంక్యూ బిబి, బీరూట్‌పై భారీ ఎత్తున దాడికి సిద్ధమవుతుంటే వద్దని వారించాను'' అని ట్రంప్ చెప్పారు. నెతన్యాహూను ట్రంప్ బిబి అని నిక్‌నేమ్‌తో పిలుస్తారు.హెజ్బొల్లా నాయకత్వ ప్రతినిధులతో కూడా ట్రంప్ టెలిఫోన్ ద్వారా సంభాషణలు చేశారు. ఇజ్రాయెల్ సైనికులపై కాల్పులు చేయకుండా విరమించేందుకు హెజ్బొల్లా ప్రతినిధులు అంగీకరించారని, అదేవిధంగా ఐడిఎఫ్ కూడా అంగీకరించిందని ట్రంప్ చెప్పారు.

**ఐడిఎఫ్–హెజ్బొల్లా మధ్య పోరు**
**దక్షిణ లెబనాన్‌లో ఎనిమిదిమంది మృతి**

ఒకవైపు అమెరికా మధ్యవర్తిగా ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య రేపు,ఎల్లుండి చర్చలకు సన్నద్ధమవుతున్న తరుణంలో లెబనాన్‌లో భారీ దాడులు చేయాలని నెతన్యాహూ తన దళాలను ఆదేశించడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. మరోవైపు ఇజ్రాయెల్ దళాలకు, ఇరాన్ మద్దతుగల హెజ్బొల్లా ఉగ్రవాద సైనిక బలగాలకు మధ్య సోమవారం రాత్రంతా భారీ ఎత్తున దాడులు,ప్రతిదాడుల పోరాటం జరిగింది.ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా దాడులు చేస్తుండగా ఈ దాడుల్లో ఆరుగురు మరణించారు. హెజ్బొల్లా,ఇజ్రాయెల్ సైన్యాలు పోరాటాన్ని విరమించేందుకు అంగీకరించాయని ట్రంప్ ప్రకటించిన తర్వాత కూడా దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో ఎనిమిదిమంది మరణించారు. దీంతో ట్రంప్ ఆగ్రహించారు. దక్షిణ లెబనాన్ శివారు ప్రాంతాలలో గ్రామాలను ఖాళీచేయాలని, నబయేహ్ నగరాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వేలాదిమంది ప్రజలు భయంతో ఇళ్ళు వదలి పారిపోయారు. హెజ్బొల్లా కూడా ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేసింది. దీంతో బీరూట్‌కు దళాలను పంపవద్దని ట్రంప్ ఆదేశించారు. లెబనాన్ ప్రభుత్వ వజాతీయ న్యూస్ ఏజన్సీ మంగళవారం చెప్పిన సమాచారం ప్రకారం, ఇజ్రాయెల్ డ్రోన్లు చేసిన దాడిలో దక్షిణ పట్టణం మర్జోయూన్‌లో రహదారిపై ఒక కారు ధ్వంసమైంది. ఈ కారులో ప్రయాణిస్తున్న తండ్రి కుమార్తె సహా ముగ్గురు మరణించారు. జిబ్‌చిట్ గ్రామంలో కూడా ఇద్దరు సిరియన్ కార్మికులు నర్సరీ ప్లాంటపై జరిగిన దాడుల్లో మరణించారు. సోమవారం కూడా ఇజ్రాయెల్ దాడుల్లో ఆరుగురు మరణించారు. కాగా హెజ్బొల్లా కూడా మంగళవారం ఇజ్రాయెల్ దళాలపై యుద్ధ ట్యాంకు విధ్వంసక క్షిపణులు ప్రయోగించింది.

# ఉక్రేన్‌పై రష్యా మహోగ్ర దాడి

**18 మంది పౌరులు మృతి**
**100 మందికి గాయాలు**



**మాస్కో :** ఉక్రేన్‌పై రష్యా మహోగ్రస్థాయిలో యుద్ధ దాడులు చేసింది. మంగళవారం తెల్లవారకముందుగానే 656 డ్రోన్లు, మరో 73 క్షిపణులతో భయంకర దాడులు చేసింది. ఈ దాడుల కారణంగా18 మంది పౌరులు మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. ఒక్క కీవ్ నగరంలోనే 64 మంది గాయపడ్డారు. ఇంకా అనేక మంది శిథిలాల్లో చిక్కుకుని ఉండిపోయారు. ఉక్రేన్ రాజధాని కీవ్‌లో, ఇతర ప్రాంతాలలో ధ్వంసమైన శిథిలాలను సహాయబృందాలు తొలగించే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఇప్పటివరకూ 18 మృత దేహాలను వెలికి తీశారు. రాత్రంతా తాను తన బిడ్డా బాత్ టబ్‌లోనే గడిపామని, త ఇంటి కిటికీలు,తలుపులు ధ్వంసమయ్యాయని కీవ్ నివాసితురాలు సలికోవా (37) చెప్పారు. రష్యా అగ్రశ్రేణి దళాలకు తీవ్ర నష్టం కలిగినందువల్లనే ఈ స్థాయిలో రష్యా సైన్యం విరుచుకుపడిందని పశ్చిమ దేశాల విశ్లేషకులు పేర్కొన్నారు. మే 22వ తేదీన ఉక్రేన్ చేసిన డ్రోన్ దాడుల్లో 21 మంది రష్యన్లు లూహాన్స్క్ ప్రాంతంలో మరణించారు. అదేవిధంగా రష్యా మిలిటరీ నిపుణుడు ఆంద్రీ మారచ్‌కో అంచనా ప్రకారం మే నెలలో ఉక్రేన్ 31,000 మంది సైనికులను, కిరాయి సైనికులను కోల్పోయిందని టాస్‌వార్తాసంస్థ పేర్కొంది. ఇటీవలికాలంలో ఉక్రేన్–రష్యా మధ్య పరస్పర దాడులు తీవ్ర రూపం దాల్చాయి. ఉక్రేన్‌కూడా తన పాత వాసనలు తొలగించుకుని బలమైన ఆయుధాలను సమకూర్చుకోవడం ద్వారా రష్యాకు చెందిన మౌలిక సదుపాయాలను గురిచూసి దెబ్బకొట్టి నష్టం చేకూరుస్తూ ఉండటంతో రష్యా సైన్యాల్లో ప్రతీకారదాడి తీవ్రస్థాయిలో పెరుగుతోంది. ఈ దాడుల్లో మరణించినవారిలో ఒక తల్లీ బిడ్డా కూడా ఉండటంతో సానుభూతి వెల్లువెత్తుతోంది. అపార్ట్‌మెంట్ భవంతులపై రష్యా డ్రోన్లు దాడులు చేశాయి. దీంతో భవంతులు కుప్పకూలాయి. పౌరులు శిథిలాల్లో కూరుకుపోయారు. ఈ శిథిలాల నుండి ఒక తల్లి,బిడ్డ మృత దేహాలను సహాయ బృందాలు వెలికితీశాయని ద్నిప్రో నగర అధికారులు చెప్పారు. భారీస్థాయిలో గగనతల దాడులు చేస్తామని రష్యా ఇందుకుముందే హెచ్చరికలు చేసింది. విదేశీ దౌత్యవేత్తలు, విదేశీ సంస్థల ప్రతినిధులు ఉక్రేన్ వదిలి వెళ్ళిపోవాలని కూడా ముందరి హెచ్చరికలు చేసింది. కానీ యూరప్ సహా అనేకమంది దౌత్యవేత్తలు ఈ హెచ్చరికలను ఆక్షేపించారు. తాము ఎక్కడికీ వెళ్ళేదిలేదని ప్రతి విమర్శలు చేశారు. యూరప్ దేశాల నుండి అమెరికా నుండి ఉక్రేన్‌కు భారీస్థాయిలో ఆయుధ మద్దతు లభిస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ విమర్శించారు. ఇటీవల ఉక్రేన్‌పై శక్తిమంతమైన ఒరెస్‌నిక్ బాలిస్టిక్ క్షిపణులను రష్యా ప్రయోగించంది. ఈ నాలుగు సంవత్సరాల యుద్ధంలో ఈ విధంగా ఒరెస్‌నిక్ క్షిపణులు ప్రయోగించడం ఇది మూడవ సారి.2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా పూర్తి స్థాయీ యుద్ధం ప్రారంభించింది.

## యూరప్ తూర్పు సరిహద్దు దేశాల్లో.. అణ్వాయుధ డిసిఎల మోహరింపుపై చర్చ

వాషింగ్టన్ : యూరోపియన్ యూనియన్‌లో ప్రస్తుతం అణ్వాయుధాలకు ఆతిథ్యం ఇస్తున్న ఆరుదేశాలకు బదులుగా మిగిలిన దేశాలలో కూడా అణ్వాయుధాలను మోహరించేందుకు అమెరికా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు ద్వంద్వ సామర్ధ్యం ఉన్న (డిసిఎ) యుద్ధ విమానాలకు మిగిలిన దేశాలు కూడా స్థావరాలు కల్పించి ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం యూరప్‌లో ఆరు దేశాలు అణ్వాయుధ బాంబర్లకు ఆతిథ్యం ఇస్తూ స్థావరాలు కల్పించాయి. ఈ విషయంపై ఇటీవల చర్చలు జరిగాయి. ఈ చర్చలకు సంబంధించిన కీలక సమాచారం తెలిసిన ముగ్గురు ముఖ్య వ్యక్తులను ఉటంకిస్తూ ఫైనాన్సియల్ టైమ్స్ ఈ విషయం వెల్లడించింది. ఐతే ప్రస్తుతం ఉన్న వాతావరణం మధ్య అమెరికా ద్వంద్వ సామర్థ్యం ఉన్న యుద్ధ విమానాలకు (డిసిఎ)కు ఆతిథ్యం ఇచ్చే ఒప్పందంమీద వెంటనే సంతకాలు జరిగే అవకాశాలు లేవని కూడా ఫైనాన్సియల్ టైమ్స్ ప్రకటించింది. పోలెండ్ సహా కొన్ని బాల్టిక్ దేశాలు తూర్పున సరిహద్దు దేశాలు తమ రక్షణ నిమిత్తం డిసిఎ యుద్ధ విమానాలకు ఆతిథ్యం ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, నాటో వేదిక ద్వారా ఈ మేరకు చర్చలు జరుగుతున్నాయని ఎఫ్.టి తన నివేదికలో తెలియజేసింది. దీనిపై వ్యాఖ్యానించాలని కోరినప్పటికీ వైట్‌హౌస్ వెంటనే స్పందించలేదు. రాయిటర్స్ వార్తా సంస్థ ఈ విషయాన్ని ధృవీకరించలేకపోయింది. 2025 జూన్ 25వ తేదీన నాటో శిఖరాగ్ర సదస్సు నెదర్లాండ్స్‌లోని ద హేగ్ నగరంలో జరిగింది. ఆనాడు నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే ఈ విషయంపై స్పందించారు. యూరోయిన్ మిత్ర దేశాలు సంప్రదాయ సైనిక బలగాల విషయంలో ముందంజలో ఉన్నప్పటికీ అమెరికా మాత్రం నాటో సభ్యదేశాలను రక్షించడానికి తన అణ్వాయుధాలను మోహరించడం కొనసాగిస్తుందని గతంలో పెంటగాన్ పాలనాధిపతి ఎల్‌బ్రిడ్జ్ కోల్బ్ గతంలో బహిరంగంగా ప్రకటించారు. యూరప్ దేశాలను పరాన్నజీవులుగా కూడా అభివర్ణించారు.

## కోర్టుకు వెళ్ళకుండా గొటబయ రాజపక్సకు ఉపశమనం

**కొలంబో :** శ్రీలంక మాజీ అధ్యక్షుడు గొటబయ రాజపక్స నేరుగా కోర్టుకు హాజరుకాకుండా ఆన్‌లైన్ ద్వారా సాక్ష్యం చెప్పేందుకు న్యాయస్థానం నుండి అనుమతి లభించింది. మానవ హక్కుల కార్యకర్తలు అదృశ్యమైన కేసులో ఆయనపై 2011 నుండి కేసు నడుస్తోంది. ఈ కేసులో ఆయన ప్రమేయం ఉందని కేసు దాఖలైంది. లలిత్ కుమార్ వీరరాజు, కుగన్ మురుగనందన్ అనే ఇద్దరు మానవహక్కుల కార్యకర్తలు 15 సంవత్సరాల క్రితం అదృశ్యమయ్యారు. ఈ ఆరోపణలు వచ్చిన సమయంలో గొటబయ రాజపక్స అన్నయ్య మహింద రాజపక్స దేశాధ్యక్షుడుగా ఉన్నారు. అప్పుడు గొటబయ రాజపక్స రక్షణశాఖలో ముఖ్యాధికారిగా ఉన్నారు. 2009లో శ్రీలంకలో సైనిక సంఘర్షణలు ముగిసిన తర్వాత నుండీ మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. లలిత్ కుమార్ వీరరాజు, మురుగనందన్‌లు నిలదీసేవారు. తమిళులు అధికంగా నివసించే జాఫ్నా ప్రాంతంలో ఉన్న న్యాయస్థానానికి రాజపక్స నేరుగా మంగళవారం హాజరుకాకుండా ఆన్‌లైన్ ద్వారా సాక్ష్యం చెప్పడానికి ఆయనకు అనుమతి లభించింది.

## సమపాళ్లలో ప్రాధాన్యం

(మూడవ పేజీ తరువాయి)





మరో ఎత్తు అని అన్నారు. తెలంగాణ ఆవిర్భావం ఒక ప్రత్యేక ఘట్టమని గుర్తు చేశారు. సాగు భూమి, వ్యవసాయం, రైతు ఈ మూడు తెలంగాణకు ఊపిరి అని అన్నారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, ఖమ్మం నుంచి కొడంగల్ వరకు 'హరిత తెలంగాణ'ను ఆవిష్కరించే ఆలోచన. ఈ లక్ష్య సాధనలో తెలంగాణలోని ప్రతి రైతు, రైతు కూలీలే సారథులన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరంగా జరుగుతుందని సిఎం అన్నారు. దేశంలోనే కాదని, ప్రపంచానికే తెలంగాణ గేట్‌వేగా నిలబెట్టాలన్నదే తన స్వప్నమని, దీనికి మార్గం 'తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్' అని అన్నారు. 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి త్రి ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, ఇందుకు ప్రజలసహకారం అవసరమని, ఆర్థిక వృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తెలంగాణ అభివృద్ధికి పునరంకితం కావాలని సిఎం కోరారు. ప్రతి ఏటా త్యాగాల చరిత్రను స్మరిస్తూ, రేపటి భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసుకునే ఒక భావోద్వేగ సందర్భమే 'జూన్ 2' అని సిఎం అన్నారు. కలలు కన్న స్వరాష్ట్ర స్వప్నాన్ని నిజం చేసిన ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, నాటి యుపిఎ ఛైర్ పర్సన్ సోనియాగాంధీలకు తెలంగాణ సమాజం తరపున సిఎం కృతజ్ఞతలు తెలిపారు. రెండున్నరేళ్ల కాలంలో జరిగిన పలు ఉప ఎన్నికల్లో, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో తమ పట్ల చూపిన ఆదరణ, అభిమానం మరువలేనిదన్నారు. ఎవరెన్ని విమర్శలు, కుట్రలు చేసినా ప్రజలు తమకు అండగా నిలవడం ఎనలేని శక్తినిచ్చిందని, ప్రజల సంక్షేమం పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు.

**ప్రభుత్వం అంటే నలుగురు చేతుల్లో పెత్తనం కాదు..**

ప్రభుత్వం అంటే నలుగురు చేతుల్లో పెత్తనం కాదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ప్రతినిధిగా భావిస్తున్నామని, అందుకే బాధ్యతగా పని చేస్తున్నామన్నారు. 'నాటి రాచరికం నుంచి నిన్నటి నియంతృత్వం' వరకు తెలంగాణ తిరుగుబాటు, చరిత్ర మొత్తం చెబుతున్న సత్యం ఇదేనని, ఆ చరిత్రకు 'మనమే' సాక్షులమని, రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి కొత్త చరిత్రను రాసుకోవడం కోసం 'మీరు' ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారని చెప్పారు. ప్రజల మనోభావాలకు తాము ప్రతినిధులమని, సమాజ ఆకాంక్షలకు తాము వారధులమని,అందుకే తాము పాలకులుగా కాకుండా ప్రజలకు సేవకులుగా, బాధ్యతను నిర్వర్తిస్తున్నామని అన్నారు. ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని, రకరకాల అడ్డంకులను అధిగమిస్తూ, 30 నెలల్లోనే ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నామని ఆయన సిఎం అన్నారు.

**రెండున్నరేళ్లలో వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.1,56,496 కోట్ల ఖర్చు చేశాం..**

రెండున్నరేళ్లలో వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి రూ.1లక్షా 56 వేల 496 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా పెట్టుబడి సాయం కింద ఇప్పటి వరకు రూ.27,529 కోట్లను నేరుగా రైతుల ఖాతాలలో వేశామని, గత ఏడాది వానాకాలం 'రైతు భరోసా'పెట్టుబడి సహాయ పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.8,744 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటికే రూ.5,700 కోట్ల రైతు భరోసా నిధులను నేరుగా రైతు ఖాతాలలో జమచేశామన్నారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం కనీస మద్దతు ధర చెల్లిస్తుందని, ఎంత భారమైనప్పటికీ చివరి గింజ వరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

**ధాన్యం కొనుగోళ్లకు రూ.82,840 కోట్ల ఖర్చు**

రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోళ్లకు రూ.82,840 కోట్లు ఖర్చు పెట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర మంతా 8575 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యంసేకరణ జరుగుతోందని, ఇప్పటి వరకు 63.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సుమారు రూ.11,903 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయిన చోట రైతు నష్టపోకూడదని దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో దేశంలో ఏ రాష్ట్రం కూడా మనతో పోటీపడే పరిస్థితి లేదని, దేశంలో యాసంగి సీజన్‌లో సేకరించిన మొత్తం ధాన్యంలో తెలంగాణ వాటా 60 శాతం నమోదైందన్నారు. మొక్కజొన్నల కొనుగోళ్లకు సుమారు రూ.4 ,275 కోట్లు, జొన్న కొనుగోళ్లకు ఇప్పటి వరకు రూ 1154 కోట్లను భరించామన్నారు.

**గత పదేళ్ల పాలనలో పరిస్థితులు మారలేదు...**

నీటి కోసం దశాబ్దాలుగా తెలంగాణ గోస పడిందని,గత పదేళ్ల పాలనలో కూడా తెలంగాణ పరిస్థితులు మారలేదని, కృష్ణా, గోదావరి జలాల్లో తమ వాటాలు తేల్చి, ప్రాజెక్టులు పూర్తి చేసే విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ విషయంలో ఏ వేదికపైనైనా తాము రాజీ లేకుండా, లౌక్యంతో, రాజకీయ విజ్ఞతతో పని చేస్తామన్నారు.

**ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్ట్‌కు ప్రాణం పోతే యత్నం...**

తెలంగాణకు వర ప్రదాయని ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోసే ప్రయత్నం చేస్తున్నామని, ఇందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఇటీవలే లేఖ రాశామని, వారితో చర్చించి, తుమ్మడిహెట్టి బ్యారేజీ నిర్మించేందుకు కార్యాచరణ చేపడుతామని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిపోయిందని, దీనికి మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపైనే పడిందని, ప్రజా శ్రేయస్సు, ప్రయోజనాల దృష్ట్యా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలను పునరుద్ధరించే పనులు మొదలు పెట్టామన్నారు.

**సెప్టెంబర్ 17 నాటికి రెండు లక్షల ఇందిరమ్మ ఇండ్లు పూర్తి ...**

రానున్న 'ప్రజా పాలన' దినోత్సవం సెప్టెంబర్ 17వ తేదీ నాటికి మిగతా రెండు లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశానికే ఇందిరమ్మ ఇండ్లు ఆదర్శవంతమైన నమూనాగా నిలిచిందన్నారు. ఇదిలా ఉండగా ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సిఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగ పాఠాన్ని తగ్గించుకున్నారు. మిగిలిన పాఠాన్ని తాను ప్రసంగించినట్టుగా భావించాలని సిఎం అన్నారు.

## బయటపడేస్తాం

(మూడవ పేజీ తరువాయి)

స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు ప్రాంతాన్ని కరువు బారినుంచి పూర్తిగా బయటపడేసి, సాగునీటి సామర్థ్యాన్ని గరిష్ట స్థాయికి చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అందులో భాగంగానే చేపడుతున్న ముఖ్యమంత్రి రెడ్డి పాలమూరు పర్యటన ద్వారా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక కీలక ప్రాజెక్టుల పూర్తి దిశగా స్పష్టమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టుల వేగవంతమైన అమలుకు అవసరమైన నిధుల సమీకరణ, సాంకేతిక అడ్డంకుల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర చర్చ జరుగుతుందని వెల్లడించారు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రధాన ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహించనున్నారని తెలిపారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం,కోయిల్‌సాగర్, భీమా, నెట్టంపాడు వంటి కీలక ప్రాజెక్టులపై సవివర ప్రజెంటేషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీ సాయంత్రం సోమశిలలో జరిగే ప్రత్యేక సమావేశంలో సీనియర్ ఇంజినీర్లు ప్రాజెక్టుల పురోగతి, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను ముఖ్యమంత్రికి వివరించనున్నారని తెలిపారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి పాల్గొంటారని ఉత్తమ్ వెల్లడించారు.ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి వైమానిక సర్వేల ద్వారా ప్రధాన ప్రాజెక్టులను పరిశీలించనున్నారనితెలిపారు.

## రోజులు వర్షాలు

(మూడవ పేజీ తరువాయి)

వర్షాల ప్రభావంతో జూన్ 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్యకు తగ్గే అవకాశం ఉందని అధికారుల అంచనగా ఉందని తెలిపారు. వాతావరణ కేంద్రం విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం, జూన్ 2 మధ్యాహ్నం నుంచి జూన్ 3 ఉదయం వరకు ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ జిల్లాల్లో గంటకు 5060 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. అలాగే సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. జూన్ 3 నుంచి 5 వరకు కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగే అవకాశముందన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## నోటిఫికేషన్‌లు

(మూడవ పేజీ తరువాయి)

ఇంజినీర్ పోస్టులకు రెండో నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రస్థాయి కేడర్‌లోని 49 పోస్టులకు ఈనెల 8 నుంచి జూలై 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది..

**కాలుష్య నియంత్రణ మండలిలో..**

కాలుష్య నియంత్రణ మండలిలో 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటర్ ఇంజినీర్ పోస్టులకు మూడో నోటిఫికేషన్ వెలువడింది. రాష్ట్ర స్థాయి కేడర్‌కు చెందిన పోస్టులకు ఈ నెల 10వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలి.

## రుతుపవనాలు

(మూడవ పేజీ తరువాయి)

వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ తన సవరించిన అంచనాలో పేర్కొంది. ఈ సంవత్సరం భారతదేశంలో దీర్ఘకాల సగటు (ఎల్‌పిఎ)లో 90 శాతం వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. 1971 నుండి 2020 వరకు ఉన్న డేటా ఆధారంగా, దేశవ్యాప్తంగా సీజనల్ వర్షపాతం ఎల్‌పిఎ 87 సెం.మీ.గా ఉంది. ఒకవేళ రుతుపవన కాలంలో ఎల్‌పిఎ వర్షపాతంలో 90 శాతం కంటే తక్కువ నమోదైతే, ఐఎంఇ దానిని 'లోటు'గా వర్గీకరిస్తుంది. సాధారణం కంటే తక్కువ వర్షపాతానికి ఒక కారణం ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం కావచ్చు, దీనివల్ల దేశంలో రుతుపవనాల సమయంలో వర్షపాతం తగ్గుతుంది. ప్రస్తుతం, భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలో తటస్థ ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ పరిస్థితులు ఎల్‌నినో పరిస్థితులుగా పరివర్తన చెందుతున్నాయి.

జూన్‌లో ఎల్‌నినో పరిస్థితులు బలహీనంగా, సెప్టెంబర్‌లో మధ్యస్థం నుంచి బలంగా ఉండే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది.

**రానున్న రోజుల్లో కేరళలో అతిభారీ వర్షాలు**

రాబోయే రోజుల్లో కేరళలో అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ మంగళవారం అంచనా వేసింది. ఈ నేపథ్యంలో జూన్ 2 నుంచి 5 మధ్య పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. భారత వాతావరణ శాఖ మంగళవారం ఉత్తర కేరళలోని మూడు జిల్లాలైన మలప్పురం, కోజికోడ్ వయనాడ్‌లకు 'ఆరెంజ్ అలర్ట్', మిగిలిన 11 జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. తిరువనంతపురం, కొల్లాం జిల్లాలు మినహా దాదాపు అన్ని జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఆ రోజు ఉరుములతో కూడిన మోస్తరు వర్షం, ఈదురు గాలులు వీస్తాయని కూడా అంచనా వేసింది. ఈనెల 2 నుంచి 6 మధ్య రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని ఐఎండి అంచనా వేసింది. బుధవారం నాలుగు జిల్లాలకు, గురువారం ఎనిమిది జిల్లాలకు, శుక్రవారం ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, మిగిలిన జిల్లాలను ఆ రోజుల్లో ఎల్లో అలర్ట్ కింద ఉంచింది.

## ప్రత్యర్థులే ఉండరు

(మూడవ పేజీ తరువాయి)

తీరులో విజయాలు సాధిస్తుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ అత్యద్భుతంగా ఉందని ప్రతి నెల రాజీవ్ ఆరోగ్యశ్రీకి రూ. 150 కోట్లు చెల్లిస్తున్నామని, రూ. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ కవర్ అవుతుందని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పడకలు కూడా పెంచుతున్నామని ఆయన తెలిపారు. సర్ తో రాష్ట్రంలో ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలని మీడియా సైతం ఓట్ల గల్లంతుపై దృష్టి సారిం చాలన్నారు. జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని త్వరలోనే కార్యరూపం దాలుస్తుందన్నారు. రైతులకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తారన్న ప్రచారానికి సంబంధించి విక్రమార్క స్పందిస్తూ ఉచిత కరెంటు ఇస్తాం, మీటర్లు పెట్టమని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ప్రత్యర్థులు మాట్లాడకపోవడమే మా పని తనానికి నిదర్శనమన్నారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం చాలా ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. బిజెపి నేతలు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ముందు ధాన్యం కొనుగోలుపై మాట్లాడాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే మంచిదని ఆయన అన్నారు. బిజెపిది రైతు వ్యతిరేక ప్రభుత్వమని అంబానీ, అదానీలు గోదాములు కట్టుకునేందుకు అనుమతులు ఇచ్చిందని ఆయన ఆరోపించారు.

## ఇరాన్‌తో ఒప్పందం

(మూడవ పేజీ తరువాయి)

చర్చలు మానుకున్నట్లు సోమవారం రాత్రి ప్రకటించాక పరిస్థితి చక్కబడటంతో ఇరాన్ నుండి తాజా ప్రకటన వచ్చింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ భీకర దాడులు,ఆక్రమణ విస్తారంగా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న తరుణంలో ఇక అమెరికాతో ''మధ్యవర్తి ద్వారా మాటా మంతీ, సందేశాలు పంపడం,చర్చలు జరపడాన్ని విరమించుకున్నాం'' అని ఇరాన్ ప్రకటించిన తర్వాత నెతన్యాహూను అదుపులోపెట్టామని, పరిస్థితిని చక్కదిద్దామని ట్రంప్ చెప్పారు. ఇరాన్ చర్చలను ఉపసంహరించుకున్న విషయంపై వ్యాఖ్యానించాల్సిందిగా ట్రంప్‌ను సోమవారం రాత్రి మీడియా కోరినప్పుడు ఈ విషయాన్ని ఆయన సీరియస్‌గా తీసుకోలేదు. అలా జరుగుతుందని, తనకు ముందే తెలుసునని, అదేమీ పెద్ద విషయం కాదని ట్రంప్ కొట్టిపారేశారు. ఆ తర్వాత ఫోన్‌లో నెతన్యాహూపై విరుచుకుపడి బీరూట్‌పై భారీ దాడి జరగకుండా నివారించారు. హెజ్బొల్లా నాయకత్వ ప్రతినిధులతో కూడా ఆయన మాట్లాడి వారిని కూడా కాల్పుల విరమణకు ఒప్పంచాక, హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు, మరో 60 రోజులపాటు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు సంబంధించి వచ్చేవారంలోపు ఒక ఒప్పందం కుదురుతుందని ట్రంప్ ప్రకటించారు.

# అంకెల్లో ఐపిఎల్ రికార్డులు

రెండు నెలలకుపైగా వేసవి వినోదాన్ని పంచిన ఐపిఎల్ 19వ సీజన్ ముగిసింది. వరసగా రెండో ట్రోఫీతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రికార్డు నెలకొల్పగా.. విధ్వంసక ఆటతో మరిపించిన వైభవ్ సూర్యవంశీ ఏకంగా ఐదు అవార్డులు తన్నుకుపోయాడు. ఉత్కంఠ పోరాటాలు, భారీ ఛేదనలతో రంజుగా సాగిన పంతొమ్మిదో సీజన్‌ను ఓసారి అంకెల్లో గమనిస్తే ఎన్నో ఆసక్తికర, అబ్బురపరిచే విషయాలు, రికార్డులున్నాయి. పొట్టి క్రికెట్‌కు ఎనలేని క్రేజ్ తెచ్చిన ఐపిఎల్ సీజన్ సీజన్‌కు రికార్డులు సృష్టిస్తూనే ఉంది. 19వ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ ఆట, ముంబై ఇండియన్స్ ఘోర ప్రదర్శన వంటివి చర్చనీయాంశంగా మారాయి. కెప్టెన్లుగా విఫలమైన హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్ నెట్టింట వైరలవ్వగా.. అరంగేట్రం లోనే అదరగొట్టిన పేసర్లు షకీబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగేలు సన్‌రైజర్స్‌కు మేమున్నామని భవిష్యత్ భరోసానిచ్చారు.





**చిన్నవయసులోనే..** ఒకే సీజన్‌లో ఐదు అవార్డులు అందుకున్న తొలి ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డు సృష్టించాడు. 19వ సీజన్ ఊచకోత తను తలపించే ఇన్నింగ్స్, కళ్లు చెదిరే సిక్సర్లు బాదిన వైభవ్.. అత్యంత విలువైన ఆటగాడు, వర్ధమాన క్రికెటర్, ఆరెంజ్ క్యాప్ విజేత, సూపర్ సిక్సర్లు, సూపర్‌స్ట్రయికర్ అవార్డులు సాధించాడు. ఈ అవార్డులు గెలిచిన అత్యంత పిన్న వయస్కుడిగా 15 ఏళ్ల వైభవ్ రికార్డు నెలకొల్పాడు.

**115 బంతులు..** ప్రతి సీజన్‌లో వికెట్ల వేటతో ముంబై ఇండియన్స్ విజయాల్లో కీలకమయ్యే బుమ్రా ఈసారి తేలిపోయాడు. పంతొమ్మిదో సీజన్‌లో తొలి వికెట్ కోసం యార్కర్ కింగ్ 115 బంతులు తీసుకున్నాడు. ఐపిఎల్‌లో విజయవంతమైన బౌలర్‌గా పేరొందిన బుమ్రా.. దురదృష్టవశాత్తూ 19వ సీజన్‌లో నాలుగు వికెట్లే తీశాడు. ఐపిఎల్ ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే మూడు వికెట్లు తీసిన బౌలర్‌గా ప్రఫుల్ హింగే రికార్డు నెలకొల్పాడు. ఉప్పల్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌పై నిప్పులు చెరిగిన ప్రఫుల్ మొదటి ఓవర్‌లోనే వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్, ప్రిటోరియస్లను వెనక్కి పంపాడు. అతడి విజృంభణతో సన్‌రైజర్స్‌ను 57 పరుగులతో జయభేరి మోగించింది.

**14 సీజన్ల తర్వాత ..** ఐపిఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ ప్రతి సీజన్ ఆరంభంలో తడబడడం తెలిసిందే. అయితే.. 14 ఏళ్ల తర్వాత ముంబై మొదటి మ్యాచ్‌లో గెలిచింది. కానీ, సారథిగా హార్దిక్ పాండ్యా తేలిపోవడం, సీనియర్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, పేసర్ బుమ్రా వైఫల్యంతో ఆజట్టును ముంచాయి. దాంతో, ముంబై ప్లే ఆఫ్స్ చేరలేకపోయింది.

**986 పరుగులు...** పంతొమ్మిదో సీజన్ ఒకే రోజు 986 పరుగులు నమోదయ్యాయి. ఏప్రిల్ 25న కేఎల్ రాహుల్ అజేయ శతకంతో ఢిల్లీ క్యాపిటల్స్ 264 రన్స్ కొట్టగా.. పంజాబ్ కింగ్స్ ఆ రికార్డు లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. అదేరోజు సన్‌రైజర్స్ హైదరాబాద్.. 229 రన్స్‌ను ఛేదించి రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. దాంతో.. ఐపిఎల్ చరిత్రలో ఒకేరోజు 900లకు పైగా రన్స్ రికార్డయ్యాయి.

**ఆరెంజ్ క్యాప్..** అత్యధిక పరుగుల వీరులకు లభించే ఆరెంజ్ క్యాప్ ఈసారి ఒకరిద్దరిపై కాదు ఏకంగా 15 మంది తలపై వాలింది. 2018లో పన్నెండ్ మంది ఆరెంజ్ క్యాప్‌ను ధరించారు. కానీ, ఒక్క ఆటగాడు కూడా వారం పాటు కూడా ఈ క్యాప్‌ను తమ వద్ద ఉంచుకోలేదు. చివరకు ఒక సెంచరీ, మూడు అర్ధ శతకాలు బాది.. 776 రన్స్‌తో వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్‌ను అందుకున్నాడు.

**హిట్ వికెట్టైన సుదర్శన్..** గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయిసుదర్శన్ అనూహ్యంగా రెండుసార్లు హిట్ వికెటైన తొలి ఆటగాడిగా నిలిచాడు. క్వాలిఫయర్1లో ఆర్‌సిబితో మ్యాచ్‌లో బ్యాట్‌ను వికెట్ల పై పడేసి వెనుదిరిగిన సుదర్శన్.. క్వాలిఫయర్ రాజస్థాన్ రాయల్స్‌పైనా హిట్ వికెటయ్యాడు.

**కోహ్లీకి 19 సీజన్లు..** ఐపిఎల్‌లోనూ ఛేజ్ మాస్టర్‌గా అవతరించిన విరాట్ కోహ్లీ టన్నుల కొద్దీ పరుగులున్నాయి. పలుమార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలుపొందిన కోహ్లీ.. ప్లే ఆఫ్స్‌లో ఈ అవార్డు కోసం 19 సీజన్లు నిరీక్షించాడు. ఎట్టకేలకు ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌పై అర్ధ శతకంతో మెరిసినందుకు విరాట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారం అందుకున్నాడు.

**పంత్ ఫెయిల్..** 19వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ రివ్యూల్లోనూ ఫెయిలయ్యాడు. ఫీల్డింగ్ సమయంలో అతడు 9 రివ్యూలు తీసుకోగా.. వీటిలో ఎనిమిది రివ్యూలు అనుకూలంగా రాలేదు.

**మూడు జెర్సీలతో శతకం..** ఐపిఎల్‌లో మూడు జట్ల తరఫున శతకాలు బాదిన ఆటగాళ్లుగా సంజూ శాంసన్, కెఎల్ రాహుల్, క్వింటన్ డికాక్‌లు రికార్డు సృష్టించారు. 19వ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున రెండు సెంచరీలు కొట్టిన సంజూ.. గతంలో ఢిల్లీ, రాజస్థాన్ రాయల్స్ జెర్సీతోనూ వంద బాదేశాడు. ఇదివరకు పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఆటగాడిగా శతక్కొట్టిన రాహుల్ ఈసారి ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్‌గా సెంచరీ సాధించాడు. డికాక్ సైతం.. ఢిల్లీ, లక్నో, ముంబై ఇండియన్స్ ప్లేయర్‌గా వందతో చెలరేగాడు.

**తొలి బంతికే సిక్సర్..** ఐపిఎల్ 19వ సీజన్‌లో తొలి బంతిని 32 సార్లు సిక్సర్‌గా మలిచారు. రాజస్థాన్ కుర్రాడు వైభవ్ సూర్యవంశీ, ఆర్‌సిబి హీరో దేవదత్ పడిక్కల్ మూడుసార్లు తాము ఎదర్కొన్న మొదటి బంతినే స్టాండ్స్‌లోకి పంపారు. అలానే.. వరసగా మూడు మ్యాచుల్లో మొదటి బంతికే వికెట్ తీసిన బౌలర్‌గా జోఫ్రా ఆర్చర్(రాజస్థాన్ రాయల్స్) అరుదైన ఘనత సాధించాడు.

మహిళ

## ఆర్థిక సాక్షరత.. బ్యాంకింగ్ పరిజ్ఞానం

గ్రామీణ మహిళలు నిజంగా ఆర్థికంగా బలపడాలంటే డబ్బు సంపాదించడం మాత్రమే సరిపోదు, ఆ డబ్బును ఎలా ఉపయోగించాలి, ఎలా దాచుకోవాలి, ఎలా పెంచుకోవాలి అన్న జ్ఞానం కూడా అవసరం. ఈ అవగాహననే ఆర్థిక సాక్షరత అంటారు. చాలామంది మహిళలు కష్టపడి సంపాదించిన డబ్బు ఎక్కడికి పోతుందో తెలియక ఇబ్బంది పడుతుంటారు. బడ్జెట్ చేయడం, ఖర్చులను లెక్కపెట్టడం, అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం నేర్చుకున్నప్పుడు కుటుంబ ఆర్థిక పరిస్థితి స్థిరపడుతుంది. నెలవారీ ఆదాయం, ఖర్చులను సరిగా గమనిస్తే అప్పులు తగ్గుతాయి, పొదుపు పెరుగుతుంది. పొదుపు అనేది గ్రామీణ మహిళల ఆర్థిక భద్రతకు పునాది. చిన్న మొత్తమైనా క్రమం తప్పకుండా దాచుకుంటే అది కాలక్రమేణా పెద్దమొత్తంగా మారుతుంది. ఈ పొదుపులు అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. అంతే



కాదు, పెట్టుబడి పెట్టడం గురించి కూడా మహిళలు తెలుసుకోవాలి. బ్యాంక్ డిపాజిట్లు, చిన్న పొదుపు పథకాలు, స్వయం సహాయక సంఘాల నిధులు వంటి సురక్షిత మార్గాల్లో పెట్టుబడి పెడితే డబ్బు విలువ పెరుగుతుంది. బీమా కూడా ఎంతో కీలకం. ఆరోగ్య బీమా, జీవన బీమా ఉంటే అనారోగ్యం లేదా ప్రమాదాల సమయంలో కుటుంబం ఆర్థికంగా కూలిపోకుండా ఉంటుంది. బ్యాంక్ ఖాతాలు గ్రామీణ మహిళలకు కొత్తప్రపంచాన్ని తెరుస్తాయి. ఒకప్పుడు నగదు చేతిలో ఉంచుకోవడంవల్ల దొంగతనం, నష్టం, మోసాల ప్రమాదం ఎక్కువగా ఉండేది. కానీ బ్యాంక్ ఖాతాలో డబ్బు ఉంచినప్పుడు అది సురక్షితంగా ఉంటుంది. డెబిట్ కార్డులు, ఎటిఎం లు, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా ఎప్పుడైనా డబ్బు తీసుకోవచ్చు, పంపించుకోవచ్చు. డిజిటల్ చెల్లింపులు చేయడం నేర్చుకున్న మహిళలు మార్కెట్‌లో, బిల్లుల చెల్లింపుల్లో సులభంగా లావాదేవీలు చేయగలుగుతారు. ఇది సమయం కూడా ఆదా చేస్తుంది. మధ్యవర్తుల మీద ఆధారపడకుండా నేరుగా లావాదేవీలు చేయడం మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ఎవరో ఒకరు వచ్చి నీ డబ్బు నేను తీసుకెళ్తాను అన్న పరిస్థితి నుంచి వారు బయటపడతారు. బ్యాంక్ ఖాతా, మొబైల్ ఫోన్ ఉంటే ప్రభుత్వ పథకాల డబ్బు నేరుగా ఖాతాలోకి వస్తుంది. వృద్ధాప్య పింఛన్లు, రైతుసబ్సిడీలు, మహిళా పథకాల నగదు లాభాలు నేరుగా మహిళల చేతుల్లోకి చేరుతాయి. దీనివల్ల కుటుంబంలో ఆర్థిక నియంత్రణ మహిళల చేతుల్లోకి వస్తుంది. ఆర్థిక సాక్షరత మహిళలకు ఒక కొత్త గౌరవాన్ని కూడా ఇస్తుంది. డబ్బు వ్యవహారాలు తెలిసిన మహిళ కుటుంబంలో కీలక నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదుగుతుంది. పిల్లల చదువు, ఇల్లు కట్టడం, వ్యవసాయ పెట్టుబడులు వంటి విషయాల్లో ఆమె అభిప్రాయానికి విలువ పెరుగుతుంది. ఈ విధంగా ఆర్థిక పరిజ్ఞానం గ్రామీణ మహిళలను కేవలం సంపాదించే వ్యక్తులుగా కాదు, తెలివైన నిర్వాహకులుగా, కుటుంబ భవిష్యత్తును నిర్మించే శక్తిగా మారుస్తుంది.

ఎలైజా జేన్ వైల్డర్ ఒక సాధారణ మహిళ కాదు... ధైర్యవంతురాలు.. అపార్థాలకు గురైనప్పటికీ, దేశం... సమాజం తనను దోషిగానే చూసినప్పటికీ, పోరాటపటిమతో, ఆత్మవిశ్వాసానికి మారుపేరుగా నిలిచింది.

## 'లిటిల్ హౌస్' వెనుక నిశ్శబ్ద ధైర్యం

తనను తాను నిరూపించుకుంది. అమెరికాలో అత్యంత ప్రియమైన పుస్తక శ్రేణులలో ఒకటైన 'లిటిల్ హౌస్' సిరీస్‌లో ఆమెను ఒక చిన్న ప్రతినాయకురాలిగా చిత్రించారు. 'లిటిల్ టౌన్ ఆన్ ది ప్రెరీ'లోని మిస్ వైల్డర్ అనే పాత్ర, లౌరా ఇంగల్స్ జీవితంలో కఠినంగా, చల్లగా వ్యవహరించే టీచర్‌గా నిలుస్తుంది. కానీ ఆ కల్పిత పాత్ర వెనుక ఉన్న నిజమైన మహిళ.. ఎలైజా జేన్ వైల్డర్ .. నిజమైన కథ మరొక విధంగా ఉంది. అది చరిత్ర దాదాపు మర్చిపోయిన ఒక నిశ్శబ్ద ధైర్యగాధ. న్యూయార్క్ రాష్ట్రంలోని బర్క్ సమీపంలో జేమ్స్, ఆంజెలీన్ డే వైల్డర్ దంపతులకు 1850లో ఎలైజా జేన్ జన్మించింది. వారు రైతులు. కష్టజీవులు. అయినా విద్య విలువను గట్టిగా నమ్మినవారు. ఆ కుటుంబంలో పెరిగిన ఎలైజా జేన్ చిన్ననాటి నుంచే తెలివైనది.. ఆ కాలంలో మహిళలకు ఉన్న అవకాశాలు పరిమితమైనవే. అయినా ఆమె 1869లో, కేవలం 19 ఏళ్ల వయసులోనే టీచర్ సర్టిఫికెట్ సంపాదించింది. అది ఆ రోజుల్లో ఒక మహిళకు సాధారణమైన విజయం కాదు... ఆ తర్వాత ఆమె దాదాపు ఇరవై సంవత్సరాల పాటు అమెరికా ప్రెరీ ప్రాంతాలన్నిటిలో ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. న్యూయార్క్ నుంచి మిన్నెసోటా, అక్కడి నుంచి కఠినమైన వాతావరణం ఉండే డకోటా ప్రాంతాల వరకూ... విద్య అవసరమైన ప్రతి చోటా ఆమె అడుగుపెట్టింది. ఆమె పని చేసిన పాఠశాలల్లో ఏవీ సౌకర్యవంతమైనవి కావు. అయినా ఎలైజా జేన్ వెనక్కి తగ్గలేదు. ఒక స్కూల్ ముగియగానే మరో స్కూల్. ఒక సంవత్సరం పూర్తయితే ఇంకొక సంవత్సరం. అలసట ఉన్నా, బాధ ఉన్నా, ఆమె బోధన ఆపలేదు.



**మిస్ వైల్డర్ వెనుక ఉన్న నిజం...**ఎలైజా జేన్, లౌరా ఇంగల్స్ భవిష్యత్తు భర్త ఆల్మాంజో వైల్డర్‌కు పెద్ద చెల్లెలు. డి స్మెట్‌లో లౌరా చదువుకుంటున్నప్పుడు వైల్డర్ కుటుంబంతోనే ఉండేది. తరువాత ఆమె ఆల్మాంజోను వివాహం చేసుకుంది. దాంతో ఎలైజా ఆమెకు మరదలైంది. వారి మధ్య సంబంధం సులభమైనది కాదు. కుటుంబ బంధాల్లాగే అది కూడా సంక్లిష్టమైనది. లౌరా తన జ్ఞాపకాల ఆధారంగా ఎలైజాను ఒక పాత్రగా మలిచింది.. కఠినంగా, కొంచెం ఆడంబరంగా, తీర్చిదిద్దడం కష్టమైన టీచర్‌గా. ఆ కథే ప్రపంచానికి చేరింది. కానీ అది సంపూర్ణ సత్యం కాదు. లౌరా కథ వెనుక నిజమైన ఎలైజాజేన్ దాగిపోయింది.. ఒంటరితనం, భయం, శారీరక అలసట మధ్య కూడా బోధన కొనసాగించిన మహిళ. ఆమె 1887లో టామస్ థేయర్‌ను వివాహం చేసుకుంది. 1930లో, 80 ఏళ్ల వయసులో ఆమె మరణించింది. అప్పటికి ఆమె బోధించిన సరిహద్దు ప్రాంతాలు పట్టణాలుగా, సమాజాలుగా మారాయి. ఆమె పేరు పెద్ద చరిత్ర పుస్తకాలలో పెద్దగా కనిపించకపోయినా, వేలాది జీవితాలలో ఆమె ముద్ర ఉంది. పిల్లల భవిష్యత్తు కోసం ముందుకు సాగే ధైర్యం. చరిత్ర ఆమెను ఒక కథలో కొన్ని పేజీలకు పరిమితం చేసింది. కానీ నిజం చాలా పెద్దది. 'లిటిల్ హౌస్' వెనుక ఉన్న నిజమైన మహిళలు... ఎలైజా జేన్ తోసహా వారంతా అసాధ్యమైన పరిస్థితుల్లో మానవత్వాన్ని నిలబెట్టినవారే. ఆమెను భయం, అలసట మధ్య కూడా విద్య దీపాన్ని వెలిగించిన సరిహద్దు ఉపాధ్యాయురాలిగా మనం గుర్తుంచుకోవాలి.

# రాష్ట్ర సాధనలో సిపిఐ పాత్ర మరువలేనిది

### సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం


మహబూబాబాద్...


కరీంనగర్...


వరంగల్...


భద్రాద్రి కొత్తగూడెం...

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ రాష్ట్ర సాధనలో సిపిఐ పాత్ర మరువలేనిదని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక శేషగిరి భవన్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాటం, స్వరాష్ట్ర పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమర వీరులకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ నాడు నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రను స్మరించుకోవాలన్నారు. అమరు వీరుల త్యాగాలపై నేటి తెలంగాణ ఆవిర్భావం జరిగిందని, మలిదశ స్వరాష్ట్ర సాధన పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర చిరస్మరణీయమన్నారు. అమరుల ఆశయాల సాధనకు ప్రజా సంఘాలు ఉద్యమంచాలని, ప్రజా సంక్షేమం, హక్కుల రక్షణ కోసమే సిపిఐ నిరంతరం పోరాటాలు సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, ఎస్‌కె.ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు కొమారి హన్మంతరావు, నేరెళ్ల రమేష్, కె.రత్నకుమారి, మునిగడప పద్మ, మునిగడప వెంకటేశ్వర్లు, జక్కుల రాములు, నాయకులు, కార్పొరేటర్లు ఎండి యూసఫ్, షాహీన్, ధనలక్ష్మి ,శాంతిప్రియ, ఎం హరిత, నామా కీర్తి, పడాల ఆకాంక్ష, అన్నపూర్ణ, శ్యామల, బోయిన విజయ్, బండి నర్సింహా, దాసరి శ్రీనివాస్, కూరపాటి సుధాకర్, దుర్గా, సత్యనారాయణ చారి, గడ్డం ప్రభాకర్, కైసర్, రాకేష్, ఖయ్యూమ్, జహీర్, సతీష్, భవాని ప్రసాద్, భూక్యా శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో మానుకోట సిపిఐ పాత్ర మరువలేనిదని, తెలంగాణ ఆవిర్భావానికి ప్రధాన అంశమే మానుకోట ఉద్యమమని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ వద్ద జాతీయ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆవిష్కరించి, అనంతరం తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని అన్ని విధాలా ఆదుకోవాలని, కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు మరియు పెన్షన్ సౌకర్యం కల్పించి తగిన గౌరవం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి, పెరుగు కుమార్, 18వ వార్డు కౌన్సిలర్ రేశపలి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి , కట్లోజు పాండురంగ చారి, తండ సందీప్, 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, బానోతు లింగ్య నాయక్, మాలోతు రవీందర్, కూరాకులపాల్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ షేక్ మియా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ షేక్ మియా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమరుల వీరుల కుటుంబాలను ఆదుకోవాలని, నిరుద్యోగ యువత కోసం వయస్సు సడలింపు ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, ఓర్సు రాజు, యాకాంబ్ర చారి, ఎండి అక్బర్ పాషా, సుంకరి భవాని, ల్యాదల్ల శరత్, దామర కృష్ణ, చిట్యాల సువర్ణ, శ్వేత, ఎండి యాకుబ్, సంద్ర కుమార్, బాశెట్టి ఉమ, వనం సౌందర్య, తస్లీమ్, గజవెల్లి చిరంజీవి, జన్ను రాజు, వెంకటాద్రి, కాజా మైనుద్దీన్, షంషుద్దీన్, సారంగం జన్ను, హరిబాబు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ రూరల్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా సిపిఐ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, పార్టీ నాయకులు కుంటల రాములు, అర్ధంగి రమేష్, అమీనా ఖాన్, కడప సురేష్, బుర్రి సక్కారామ్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో సిపిఐ పాత్ర మరువలేనిదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గణేష్ నగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం వద్ద జాతీయ జెండాను పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వమైనా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, భూమిలేని నిరుపేదలకు భూములు ఇవ్వాలని, అర్హులైన పేదలకు, పెన్షన్లు, ఇండ్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ప్రధానంగా ఉద్యమ సమయంలో జైలు పాలైన ఉద్యమకారులను గుర్తించి వారికి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, బూడిద సదాశివ, నాయకులు బాకం ఆంజనేయులు, గామినేని సత్యం, చెంచల మురళి, నగునూరి రమేష్, కసిబోజుల సంతోష్ చారి, నర్సింహులు, నిఖిల్ సాయి, సాంబయ్య, అశోక్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాల :** ప్రభుత్వాలు తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీ ఖాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, జోగుల మల్లయ్య, లింగం రవి, మిట్టపల్లి పౌలు, సత్యనారాయణ, దెవి పోచన్న, దుర్గరాజ్, రాజేశ్వర్ రావు, సాంబయ్య, మొండి, రామన్న, శంకరయ్య, వీరయ్య, నరేష్, రాజేశం, రమేష్, నర్సయ్య, రాయమల్లు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్(మేడ్చల్) :** తెలంగాణ ఉద్యమ ఆశయాలు ప్రజలకు పూర్తిస్థాయిలో దక్కలేదని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, రాములు, నరసింహారెడ్డి, బాబు, సదానంద్, సహదేవరెడ్డి, ఒక్కరి మల్లేష్, ముసలయ్య, రవి, సామెల్, వెంకటేష్, భీమేష్, ఇమామ్, యాదగిరి, ఆశయ్య, శేఖర్, సత్తిరెడ్డి, ప్రసాద్ నాయక్, ప్రవీణ్, నవీన్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్...


కుత్బుల్లాపూర్...


మంచిర్యాల...



# రాష్ట్ర అవతరణ సంబరాలు
# అంబరాన్నంటాయ్
## రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా వేడుకలు, జాతీయ జెండా ఆవిష్కరణలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకులను మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా సకల జనులు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన త్యాగధనులకు ఎక్కడిక్కడ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలు ఆనాటి ఉద్యమ ఘట్టాలను, నాటి ఉద్యమంలో అశువులు బాసిన అమరులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, యువజన తదితర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేసి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. శాసనమండలి ప్రాంగణం, శాసనసభ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంఎల్‌సిలు, ఎంఎల్‌లు పాల్గొన్నారు. లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అన్నారు. ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నల్లగొండ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, హనుమకొండ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట జిల్లాలో మంత్రి పొన్నం ప్రభాకర్, సంగారెడ్డి జిల్లాలో మంత్రి దామోదర రాజ నర్సింహా, జగిత్యాల జిల్లాలో మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ములుగు జిల్లాలో మంత్రి దనసరి అనసూయ (సీతక్క), భద్రాది కొత్తగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సూర్యాపేట జిల్లాలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌కె. శ్రీనివాస రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా బిసి కమిషన్ కార్యాలయంలో చైర్మన్ నిరంజన్ జాతీయ జెండాను ఎగురవేశారు.




### పార్టీ కార్యాలయాల్లో ఘనంగా వేడుకలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని సిపిఐ రాష్ట్రకార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణది సిపిఐది పేగు బంధమని, దీనిని ఎవరూ విడదీయలేరన్నారు. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగుతోందని తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎంపి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కల సాకారం కోసం కృషి చేసిన కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్‌ను గుర్తు చేసుకున్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలలో బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారక రామారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు.



### గన్‌పార్క్‌వద్ద అమరులకు ఘనంగా నివాళి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల సూప్తం వద్ద ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమర వీరులకు పుష్పాంజలి ఘటించారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపి ఎం.అంజన్ కుమార్ యాదవ్, ఎంపి ఎం.అనిల్ కుమార్ యాదవ్ అమరవీరులకు నివాళులు అర్పించారు. విద్యార్థి యువజన, ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజా సంఘాల నేతలు కూడా గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళులు అర్పించారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక
### మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రజల సుదీర్ఘ పోరాటం, త్యాగాల ఫలితమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన స్ఫూర్తితోనే తెలంగాణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావంతో ప్రజలకు స్వేచ్ఛ, ఆత్మాభిమానం దక్కాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవ వేడుకలు మంగళవారం తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడం, రేషన్ షాప్‌ల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం ప్రభుత్వ ప్రజాహిత దృక్పథానికి నిదర్శనమన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళల ఆధ్వర్యంలో సూపర్ బజార్లు, పెట్రోల్ బంకులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. గోదాముల నిర్మాణం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన వేతనాలు అందేలా చట్టపరమైన చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉద్యోగులు సహా సబ్బండ వర్గాల ప్రజల పాత్ర మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. వేడుకల్లో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# అబద్ధాలతో అధికారంలోకి... : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ ప్రభుత్వం, కెసిఆర్‌పైన చిల్లర ప్రచారాలు చేసి, అబద్ధాలతో కూడిన విష ప్రచారాలతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి .రామారావు ఆరోపించారు. డిక్లరేషన్ల పేరుతో 420 హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, అబద్ధాలు, అభూత కల్పనలు, విష ప్రచారాలతో తెలంగాణ రాజకీయాలను కాంగ్రెస్ కలుషితం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కెటిఆర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎప్పుడైనా ఒంటరిగానే పోటీ చేసిందని, ఒంటరిగానే గెలిచిందన్నారు. 30 నెలల్లో తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభు త్వం అన్ని రంగాల్లో కుప్పకూల్చిందని, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. కష్టపడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే తమ పోరాటమని, అందుకే మరో ప్రజా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



# అమరవీరులను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బీసీ కమిషన్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ జి. నిరంజన్, కమిషన్ సభ్యులు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బిసి కమిషన్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొలి దశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా తెలంగాణ అభివృద్ధి ఆగకూడదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలని అన్నారు.



**బస్ భవన్‌లో..**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12వ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఆర్టీసీ బస్ భవన్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలంగా సిద్ధించిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ, వారికి ఎండీ నాగిరెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, 'తెలంగాణ జెండా అనేది కేవలం ఒక వస్త్రం కాదు, అది కోట్ల మంది ఆత్మగౌరవ నినాదం, లక్షలాది మంది పోరాటాల స్వేచ్ఛా గీతం' అని కొనియాడారు.

## త్యాగాల ఫలితమే తెలంగాణ..
# ప్రజా ఆకాంక్షలే ప్రభుత్వ లక్ష్యం
### గాంధీ భవన్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

ప్రజాపక్షం /హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితమని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గాంధీ భవన్‌లో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మహేష్ కుమార్ గౌడ్ అంతకు ముందు జాతీయ నాయకులకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ చూపిన ధృడ సంకల్పమే ప్రత్యేక రాష్ట్ర సాధనకు కారణమని కొనియాడారు. ఏళ్ల తరబడి సాగిన ఉద్యమం, అమరవీరుల ప్రాణత్యాగాల ఫలితంగానే తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం నుంచి సన్న బియ్యం పంపిణీ వరకు దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రజాపాలన ధ్యేయమని స్పష్టం చేశారు. బిజెపి నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించిన ఆయన.. తెలంగాణలో మత సామరస్యాన్ని కాపాడుతూ లౌకిక విలువలతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందన్నారు. బంగారు తెలంగాణ పేరుతో గత ప్రభుత్వం ఒక కుటుంబానికే ప్రయోజనం చేకూర్చిందని విమర్శించారు.మిగిలిన రెండున్నరేళ్లలో తెలంగాణ నిర్మాణానికి మరింత కృషి చేసి, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పేదల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సేవాదళ్ చైర్మన్ జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్లు అంజన్ కుమార్ యాదవ్, గీతారెడ్డి, ఎంపీ అనిల్ యాదవ్, విప్ బలమురి వెంకట్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆంధ్ర పాలక వర్గాలకు తెలంగాణ వనరులపై కన్ను : కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఆంధ్ర పాలక వర్గాలకు తెలంగాణ వనరులపై కన్ను ఉన్నదని, రాష్ట్రంపైన ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారని టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ ఆశయాల సాధన, సమగ్ర తెలంగాణ నిర్మాణానికి ప్రజలందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకాన్ని కోదండరామ్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ విషయంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ, ఆ సాకుతో తెలంగాణ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా ఆంధ్ర పాలక వర్గాలకు మద్దతుగా నిలుస్తూ, తెలంగాణ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆంధ్ర పాలక వర్గాల సహకారంతో తెలంగాణపై పెత్తనం చెలాయించాలని బిజెపి చూస్తోందన్నారు.

# హైకోర్టులో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం హైకోర్టు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. పోలీసు వందనాన్ని స్వీకరించిన అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి. శ్యాం కోషి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రగతిని స్మరించుకుంటూ వేడుకలను నిర్వహించారు.

# 5, 6, 7 తేదీల్లో హైటెక్స్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్ : అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో మూడు రోజుల పాటు హైదరాబాద్ హైటెక్స్ లో 'త్రెడ్ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా స్టాల్స్‌తోపాటు మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.



# ఉద్యమకారులకు స్థలం కోసం భూ పోరాటం : కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలం కోసం మిలియన్ మార్చ్ ను తలపించే 'భూ పోరాటాన్ని' నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అవుతున్నప్పటికీ తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకోకపోవడం అన్యాయమన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవ సందర్భంగా బంజారాహిల్స్ లోని టిఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం జాతీయ జెండా ఎగురవేశారు. ఉనంతరం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి సంస్థ తరపున తాము 2014 నుంచే ప్రయత్నించామని, 2017లో అప్పటి మున్సిపల్ శాఖకు కూడా అధికారికంగా లేఖ రాసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటంతో సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో వారికే అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# తెలంగాణ క్రికెట్ అభివృద్ధికి ప్రజా ఉద్యమం అవసరం
### టిసిఎ గుర్తింపుకోసం పోరాటం మరింత ఉధృతం చేయాలి: ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ఉద్యమాన్ని కేవలం న్యాయపోరాటానికే పరిమితం చేయకుండా, ప్రజా ఉద్యమంగా విస్తరించాలని చేవెళ్ల ఎంపి, టిసిఎ పాట్రన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హరిత ప్లాజాలో టిసిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబ్ల్ కాన్ఫరెన్స్ విత్ స్టేక్‌హోల్డర్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన ప్రజా ఉద్యమాల మాదిరిగానే, క్రికెట్ పరిపాలనలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా కూడా బలమైన ప్రజా ఆందోళనలు అవసరమని ఆయన పేర్కొన్నారు. బిసిసిఐ టిసిఎకు అసోసియేట్ సభ్యత్వం కల్పిస్తే తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు చెందిన వేలాది మంది యువ క్రికెటర్లకు జాతీయ స్థాయిలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) హైదరాబాద్‌కే పరిమితమై, తెలంగాణ జిల్లాల క్రికెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం




చేసిందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల తెలంగాణ యువ ప్రతిభ దశాబ్దాలుగా అవకాశాలు కోల్పోయిందన్నారు. టీసీఏ గుర్తింపు కోసం ఇతర పార్లమెంట్ సభ్యులతో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమ ప్రారంభంలో టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టీసీఏ ఆవిర్భావం, న్యాయపరమైన పోరాటాలు, సభ్యత్వ విస్తరణ, గ్రామీణ క్రికెట్ అభివృద్ధి, తెలంగాణ క్రీడాకారుల పురోగతిపై వివరించారు. తెలంగాణ ఉద్యమకారుడు విఠల్ మాట్లాడుతూ.. టిసిఎకు బిసిసిఐ గుర్తింపు వచ్చే వరకు సామాజిక మాధ్యమాలు, అవగాహన కార్యక్రమాలు, ప్రజాస్వామ్యబద్ధ ఆందోళనలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఖమ్మం, వరంగల్‌కు చెందిన మహిళా క్రికెటర్లు ఝాన్సీ, వినోద తమ ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్‌పై నమ్మకంతో ఆస్తులు అమ్ముకొని శిక్షణ తీసుకుని జాతీయ స్థాయిలో ఆడినా, డబ్బులు ఇవ్వలేదనే కారణంతో హెచ్‌సీఏ తమను గుర్తించలేదని ఆరోపించారు. హెచ్‌సిఎపై వెలుగుచూస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ కార్యక్రమంలో టిసిఎ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండల లక్ష్మీ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. పెసరు విజయచందర్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ప్రేమేందర్ రెడ్డి, కపిలవాయి రవీందర్, డా. ప్రదీప్, తాళ్లపల్లి జయపాల్, మహేందర్ రెడ్డి, మహిళా క్రికెటర్లు ఝాన్సీ లక్ష్మి , వినోద, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై
# క్రమం తప్పకుండా రాజకీయ పార్టీలతో సమావేశాలు
### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిల్లా ఎన్నికల అధికారులు క్రమం తప్పకుండా రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, బూత్ లెవల్ ఏజెంట్లను ఈ ప్రక్రియలో చురుగ్గా భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమం మూడో దశ సన్నాహాలపై కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సవరణ ప్రక్రియలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 68.30 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా సిబ్బంది నియామకం, హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుపై అధికారులకు ఆయన వివరించారు. ఓటర్లు తమ దరఖాస్తులను అధికారిక పోర్టల్ (voters.eci.gov.in) ద్వారా సమర్పించేలా విస్తృత ప్రచారం కల్పించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటర్ల సందేహాల నివృత్తి కోసం అందుబాటులో ఉన్న 'బుక్ ఏ కాల్' సౌకర్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాజ్యాంగ నిబంధనలు, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం సవరణ ప్రక్రియ ఎలా సాగాలనే అంశంపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా గణన, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, తుది జాబితా రూపకల్పన వంటి అంశాలపై క్షేత్రస్థాయి అధికారులైన ఈఆర్ఓ, ఏఈఆర్ఓలకు అవగాహన కల్పించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు సిఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు, జాయింట్ సిఈఓ ఎం. సత్యవాణి, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మేడ్చల్‌మల్కాజిగిరి కలెక్టర్ ఎం. మను చౌదరి, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.



# గవర్నర్‌కు 'ప్రేమతో..' దివ్యాంగురాలి అపురూప కానుక !

## కాళ్లనే చేతులుగా మార్చుకుని గవర్నర్ చిత్రాన్ని గీసిన వైష్ణవి అభినందించి, సన్మానించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజ్ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఒక అపురూపమైన, హృద్యమైన ఘటన చోటుచేసుకుంది. శారీరక వైకల్యం ఆమె ఆత్మవిశ్వాసానికి అడ్డుకాలేదు.. ఎదురైన సవాళ్లు ఆమె ప్రతిభను ఆపలేకపోయాయి. తన కాళ్లనే చేతులుగా మార్చుకుని, అసాధారణ చిత్రకళా నైపుణ్యంతో రాష్ట్ర గవర్నర్‌కు కదిలించిందో దివ్యాంగురాలు. ఆ ఆత్మీయ కలయిక అక్కడున్న వారందరినీ భావోద్వేగానికి గురిచేసింది.

**సంకల్పం ముందు తలవంచిన అవరోధాలు**

జిహెచ్‌ఎంసిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వైష్ణవి చిన్ననాటి నుంచే అనేక జీవిత సవాళ్లతో పోరాడుతోంది. అయితే, తన శారీరక పరిమితులను ఆమె ఎన్నడూ ఒక లోపంగా భావించలేదు. పట్టుదలతో తన కాలి వేళ్లతోనే అద్భుతమైన చిత్రాలను గీయడం నేర్చుకుని ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాపై తనకున్న అభిమానాన్ని చాటుకోవాలని ఆమె నిర్ణయించుకుంది. ఈ క్రమంలో గవర్నర్ చిత్రపటాన్ని తన కాలి వేళ్లతో అత్యంత ప్రతిభావంతంగా తీర్చిదిద్దింది.

**కదిలించిన అభిమానం.. లోక్ భవన్లో ప్రత్యేక కానుక :** లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్లో రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా జరుగుతున్న సమయంలో, వైష్ణవి తాను గీసిన గవర్నర్ చిత్రపటాన్ని ఆయనకు స్వయంగా అందజేసింది. కాలి వేళ్లతో గీసిన ఆ అద్భుత చిత్రాన్ని చూసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. ఆమె చూపిన అభిమానానికి, అసాధారణ ప్రతిభకు గవర్నర్ దంపతులు ముగ్ధులయ్యారు. 'జీవితంలో ఎదురైన ప్రతికూల పరిస్థితులను అధిగమించి, కళారంగంలో తనదైన ముద్ర వేస్తున్న వైష్ణవి సంకల్పం అందరికీ ఆదర్శం. ప్రతిభకు శారీరక పరిమితులు అడ్డుకావని ఆమె నిరూపించింది.' అని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.

**ఘన సన్మానం.. నగదు ప్రోత్సాహం :** ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు వైష్ణవిని ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి, మెమెంటోతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆశీస్సులు అందజేశారు. వైష్ణవి అందించిన ఆ చిత్రం కేవలం ఒక కానుక మాత్రమే కాదు, ఒక దివ్యాంగురాలి హృదయంలోని గౌరవం, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. సంకల్పం ముందు ఎలాంటి అవరోధాలైనా తలవంచక తప్పదని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలను అంకితభావంతో అమలు చేయాలి

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంకా పటిష్టంగా అమలు చేయటానికి అంకితభావంతో,నీతి నిజాయితీతో,నిస్వార్థంగా,పారదర్శకంగా పని చేస్తూ జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా ప్రతిఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ,జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పోలీసులు గౌరవ వందనం సమర్పించగా,జిల్లా యంత్రాంగం తరపున ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని అన్నారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు అవుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు,సాధించిన ప్రగతిని వివరించారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబ సభ్యులను మంత్రి ఆప్యాయంగా పలకరించి ఘనంగా సన్మానించారు. ఉద్యమ అమరవీరుల వారి త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. జిల్లాలోని 672 స్వయం సహాయక సంఘాలకు రూ.57 కోట్ల 38 లక్షల విలువైన చెక్కును మంత్రి అందజేశారు.అదే విధంగా ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల అభివృద్ధి పథకం (పిఎంఎఫ్ఎంఇ)కింద యాచారం మండలంలోని రెండు యూనిట్లకు రూ.4.27 లక్షల ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు.

**అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులు**

అంతకుముందు జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్లు కె చంద్రారెడ్డి,డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి,ఎంఎల్‌ఎలు మల్‌రెడ్డి రంగారెడ్డి,కాలే యాదయ్య,డిఆర్ఒ శారద తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ప్రభుత్వ శాఖల స్టాల్స్ సందర్శన**

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను మంత్రి సందర్శించి,శాఖల పనితీరు ,ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థల ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి,కిరణ్మయి, డిఆర్ఓ శారద, ఇబ్రహీం పట్నం ఆర్‌ఆర్ఓ అనంత్ రెడ్డి,జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మేరు ఆత్మగౌరవ భవనానికి నిధులు

## టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మేరు సంఘం నేతల వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో మేరు సామాజిక వర్గ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేయాలని మేరు ఆత్మగౌరవ భవన ట్రస్ట్ ప్రతినిధుల బృందం కోరింది. గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్‌ను ట్రస్ట్ చైర్మన్లు కొవ్వూరు భాస్కర్ రావు, పాడిశెట్టి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో మంగళవారం మేరు సంఘం రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భవన నిర్మాణ నిధుల సాధనకై ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. గతంలో ప్రభుత్వం ఉప్పల్ భగాయత్‌లో మేరు సంఘం కోసం కేటాయించిన ఒక ఎకరం స్థలంలో భవన నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉందని ప్రతినిధుల బృందం ఈ సందర్భంగా వివరించింది. ఈ భవనాన్ని కేవలం కమ్యూనిటీ హాల్‌గా కాకుండా, మేరు సామాజిక, ఆర్థిక, విద్యా, సాంస్కృతిక వికాసానికి వేదికగా మార్చాలని భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మేరు యువత, మహిళల ఉపాధి శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి ఒక ప్రతిష్ఠాత్మక కేంద్రంగా దీనిని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా కేటాయించేలా చొరవ చూపాలని వారు టిపిసిసి అధ్యక్షుడిని కోరారు. మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారని, బిసి సామాజిక వర్గాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాల అంశం, వాటికి బడ్జెట్ కేటాయింపుల విషయం ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉందని ఆయన స్పష్టం చేశారు. మేరు సంఘం వినతిని ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మేరు సంఘం రాష్ట్ర నేతలు కె. వెంకటేశ్, దీకొండ నర్సింగ్ రావు, తాళ్ళ వెంకశ్వరరావు, ఎస్.బి. సంగే వార్, దీకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**డిజిపి కార్యాలయంలో..**

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను డిజిపి కార్యాలయంలో మంగళవారం నాడు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐజిపి (పి అండ ఎల్) గజరావు భూపాల్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు.



**అరణ్య భవన్‌లో...**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అటవీ దళాల అధిపతి వినయ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.



**స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ..**

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన కార్యాలయం ఎల్బీ స్టేడియంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. చైర్మన్ శివసేనా రెడ్డి ఏం డి డాక్టర్ సోనీ బాలాదేవి తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు.



**హైదరాబాద్ పోలీసు ఆధ్వర్యంలో..**

హైదరాబాద్ పేట్ల బురుజులోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ హాజరై.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులకు నివాళులర్పించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

# క్యూబా ప్రజలకు ఎఐవైఎఫ్ సంఘీభావం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్థిక దిగ్బంధనం, ఇంధన ఆంక్షలు, బెదిరింపులు, తప్పుడు ఆరోపణలతో అమెరికా ప్రభుత్వం క్యూబా ప్రజల సంకల్పాన్ని దెబ్బతీయలేవని ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి, అంతర్జాతీయ వ్యవహారాల కమిటీ సభ్యులు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి అన్నారు. రౌల్ కాస్ట్రో రుజ్ 95వ జన్మదినాన్ని పురస్కరించుకుని యంగ్ కమ్యూనిస్టు లీగ్ ఆఫ్ క్యూబా ఆధ్వర్యంలో నిర్వహించిన రౌల్ ఈజ్ క్యూబా వర్చువల్ యువజన ఫోరంలో ఆన్‌లైన్ జూమ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువజన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యూబా ప్రజలకు తమ సంఘీభావాన్ని ప్రకటించిన యువజన ప్రతినిధులు సామ్రాజ్యవాద దుష్ప్రచారాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వారు ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్) జాతీయ మండలి తరఫున పాల్గొన్న సయ్యద్ వలీ ఉల్లాఖాద్రి మాట్లాడుతూ రౌల్ కాస్ట్రో రుజ్‌పై అమెరికా ప్రభుత్వం చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండించారు. భారత యువత , ఎఐవైఎఫ్ ఎల్లప్పుడూ క్యూబా ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు. రౌల్ కాస్ట్రో రుజ్ నిజాయితీ, దేశభక్తి, నిబద్ధత, క్యూబా విప్లవానికి అంకితభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల యువత క్యూబా స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, శాంతి పరిరక్షణ కోసం తమ మద్దతును కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఎల్‌నినో పరిస్థితులపై ముందుస్తు చర్యలు : సురేంద్ర మోహన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ, సహకార శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని జిల్లాలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా వారీ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి వెంటనే అమలు చేయాలని కార్యదర్శి సూచించారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు, విత్తనాల లభ్యత, ఎరువుల సరఫరా, నీటి సంరక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగిస్తూ, వ్యవసాయ శాఖ–వ్యవసాయ విశ్వవిద్యాలయం–వాతావరణ శాఖల సమన్వయంతో రైతులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేయాలని తెలిపారు.అనంతరం జిల్లా వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ పంటల అమలు, రైతులకు అందించాల్సిన సాంకేతిక మార్గదర్శకాలపై సమీక్ష నిర్వహించారు. ఈనెల 4, 6, 8, 10 తేదీల్లో గ్రామసభలు, రైతు వేదికల సమావేశాల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.

# భారత్– అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారుపై చర్చలు

**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య ప్రతిపాదిత తాత్కాలిక వాణిజ్య ఒప్పంద వివరాలను ఖరారు చేసేందుకు మూడు రోజులపాటు జరిగే సంభాషణలు మంగళవారం ఢిల్లీలో ప్రారంభమయ్యాయి. ప్రతిపాదిత తాత్కాలిక ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఉద్దేశించిన నిబంధనల చట్రాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఖరారు చేశారు. అమెరికా తరపు బృందానికి బ్రెండన్ లించ్ ప్రధాన అనుసంధాన కర్తగా నాయకత్వం వహిస్తుండగా, సంభాషణల్లో పాల్గొనే భారత బృందానికి కేంద్ర వాణిజ్య విభాగం అదనపు కార్యదర్శి దర్పన్ జైన్ ప్రధాన అనుసంధానకర్తగా నాయకత్వం వహిస్తున్నారు. వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వశాఖ కేంద్ర కార్యాలయం విజయ్ భవన్‌లో ఈ సంభాషణలు కొనసాగుతున్నాయి. తాత్కాలిక వాణిజ్య ఒడంబడిక వివరాలను ఖరారు చేసి,విస్తారమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) దిశగా సంప్రదింపులను ముందుకు తీసుకువెళ్ళేందుకు రెండు దేశాల ప్రతినిధులు కృషి చేస్తున్నారు. బిటిఎ మొదటి దశ నిబంధనల చట్రం రూపురేఖలు లేదా తాత్కాలిక వాణిజ్య లావాదేవీలపై భారత్–అమెరికా దేశాల ప్రతినిధులు ఫిబ్రవరి ఏడోతేదీన ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ నిబంధనల చట్రం ప్రకారం, భారతదేశంపై ఇంతకుముందు విధించిన 50 శాతం సుంకాలను 18 శాతానికి అమెరికా తగ్గించుకుంటుంది. అదేవిధంగా రష్యా నుండి చమురు కొనుగోలు చేసినందుకుగాను జరిమానా పేరుతో భారత దేశ సరుకులుపై విధించిన 25 శాతం అదనపు సుంకాలను కూడా పూర్తిగా ఉపసంహరించుకుంటుంది. అదేవిధంగా మిగిలిన 25 శాతం సుంకాలను ఈ ఒప్పందం కింద 18 శాతానికి తగ్గించుకుంటుంది.

## 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు' అంశంపైన 4న అఖిలపక్ష సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు అంశంలో ఈ నెల 4వ తేదీన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని 6వ అంతస్తు,రూం నంబర్ 33 లో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పలు రాజకీయ పార్టీలకు సాధారణ పరిపాలన (జిఎడిపొలిటికల్) ఆహ్వానించింది. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాలను దృష్టిలో పెట్టుకుని పలు సూచనలు, ప్రతిపాదనలు చేయాలని ఆ ఆహ్వాన పత్రంలో పేర్కొంది.

# జలమండలి ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి

## కార్మిక సంఘాలు, మంత్రులు, రాజకీయ పార్టీల నాయకులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలి కార్మిక సంఘాల ఎన్నికల్లో ఏడు కార్మిక సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచిన మొగుళ్ళ రాజిరెడ్డి త్రిశూలం గుర్తుపై ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని పలువురు కార్మిక సంఘాల నాయకులు, మంత్రులు, రాజకీయ పార్టీల నాయకులు కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి మొగుళ్ల రాజిరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనను గెలిపించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జలమండలి కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అండదండలతో పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయ ఆవరణలో మంగళవారం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, కార్మిక సంక్షేమ శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంఎల్‌ఏలు దానం నాగేందర్, కాలె యాదయ్య, నవీన్‌కుమార్ యాదవ్, ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి, ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, జలమండలి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు కె.రమేష్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కె.రాజిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఇ.చంద్రశేఖర్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టియుసి నాయకులు నాగన్న గౌడ్, ఆర్.డి.చంద్రశేఖర్, ఆదిల్ షరీఫ్ తదితరులు పాల్గొని జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. సమావేశాన్ని ఉద్దేశించి జి.సంజీవరెడ్డి మాట్లాడుతూ జలమండలిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని, కార్మికలోకాన్ని వేరుచేసి చూడలేమన్నారు. ముఖ్యంగా కార్మికులకు కావాల్సింది వారికి అండగా నిలిచే నాయకుడని, అలాంటి నాయకుడు మొగుళ్ల రాజిరెడ్డి అన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన బిఆర్‌ఎస్‌కు జలమండలి ఎన్నికల్లో కార్మికుల ఓటు హక్కు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఐఎన్‌టియుసి కార్మికుల పక్షాన పోరాడుతూ, అనేక సమస్యలను పరిష్కరించిందన్నారు. కార్మికులను కాంగ్రెస్, ఐఎన్‌టియుసి గుండెల్లో పెట్టుకుని కాపాడుతుందన్నారు. మొగుళ్ల రాజిరెడ్డి మెనిఫెస్టో చాలా బాగుందని, ఆయన విజయం సాధించిన తర్వాత జలమండలి కార్మికుల పెండింగ్ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ దేశంలో కార్మికుల హక్కులను సాధించడానికి ఎఐటియుసి, ఐఎన్‌టియుసి కృషి చేస్తోందన్నారు. అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నామని, అదే ఉద్యమ స్ఫూర్తితో జలమండలి ఎన్నికల్లో మొగుళ్ల రాజిరెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లుగా జలమండలి కార్మికులతో ఉంటూ, అనేక సమస్యలను పరిష్కరించానని చెప్పారు. కార్మికుల హక్కులను నిర్వీర్యం చేసేందుకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్లను రద్దు చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. కార్మికుల ఆకాంక్ష మేరకు సింగరేణి, ఆర్‌టిసి, గిగ్ వర్కర్ల డిమాండ్లను నేరవేర్చడంతో పాటు చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతన సవరణ చేసి, రాష్ట్రంలో అద్భుత పాలన అందిస్తుందని కొనియాడారు. తాను విజయం సాధించిన తర్వాత ప్రభుత్వంతో మాట్లాడి జలమండలి కార్మికుల కోసం కళ్యాణ మండపం నిర్మిస్తానని హామీ ఇచ్చారు.



**ఆబ్కారీ భవన్‌లో...**

ఆబ్కారీ భవన్‌లో మంగళవారం తెలంగాణ అవిర్భవ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆబ్కారీ భవన్ అవరణలో జాతీయ జెండాను అవిష్కరించారు. తొలుతగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.



**పోలీసు అకాడమీలో..**

తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోతసవానిన పురస్కరించుకుని తెలంగాణ పోలీస్ అకాడమీ లో మంగళవారం పరేడ్ గ్రౌండ్ లో వేడుకలను అత్యంత వైబవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెకటర్ అభిలాష బిస్త్ ముఖ్య అతిథిగా హాజరై జాతీమ జెండాను ఎగరేశారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ పట్ల ఐఎల్ హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అనేక సంవత్సరాలుగా న్యాయవాదులు కోరుతున్న న్యాయవాదులు రక్షణ చట్టం మంగళవారం నుంచి అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై హత్యలు, దాడులు పెరిగి భయభ్రాంతులకు గురి చేస్తున్న నేపథ్యంలో, ఇలాంటి చట్టం రావడం రక్షణగా నిలుస్తోందన్నారు. దేశవ్యాప్తంగా న్యాయవాదులు భద్రత చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# జనసేన సమావేశానికి అనుమతి పిటిషన్ తిరస్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించ తలపెట్టిన జనసేన సాధకుల సమావేశానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌ను హైకోర్టు రిజిస్ట్రీ తిరస్కరించింది. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సమావేశం నిర్వహించేందుకు జనసేన పార్టీ అనుమతి కోరగా, సైబరాబాద్ పోలీసులు శాంతిభద్రతల కారణాలను చూపుతూ అనుమతి నిరాకరించారు. దీంతో పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాంప్రసాద్ హైకోర్టును ఆశ్రయించారు సుమారు రెండు వేల మంది కార్యకర్తలు హాజరయ్యే ఈ సమావేశానికి పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా హాజరుకానున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ నిరాకరించింది.

# పంచాయతీ భవనానికి 'రాజిరెడ్డి భవన్' పేరు పెట్టాలని హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ భవనానికి 'రాజిరెడ్డి భవన్'గా నామకరణం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. గ్రామ పంచాయతీ కార్యాలయంపై 'రాజిరెడ్డి భవన్' అని స్పష్టంగా కనిపించేలా బోర్డు ఏర్పాటు చేసి, నాలుగు వారాల్లో ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, గ్రామ పంచాయతీ అధికారులకు జస్టిస్ నగేశ్ భీమపాక ఉత్తర్వులు జారీ చేశారు. తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి గ్రామాభివృద్ధికి విశేష సేవలు అందించారని, ఆయన పేరును గ్రామ పంచాయతీ భవనానికి పెట్టాలని గ్రామ పంచాయతీ 2017లో ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 24న జీవో నెం.96 జారీ చేసినప్పటికీ అధికారులు అమలు చేయలేదని గ్రామస్థురాలు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రామవరం మాధవిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు పరిశీలించిన న్యాయస్థానం, జీవో 96 ఇప్పటికీ అమల్లోనే ఉందని, ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయడం అధికారుల బాధ్యతేనని స్పష్టం చేసింది. అందువల్ల నాలుగు వారాల్లోగా గ్రామ పంచాయతీ భవనంపై 'రాజిరెడ్డి భవన్' పేరును ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

'లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు.'

# 'సింగ్ గీతం'లో విలన్ క్యారెక్టర్ చేశాను


హీరోయిన్ శాలిని కొండెపూడి

లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' వైజయంతి మూవీస్, స్వప్న సినిమాపై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లలో విడుదల కానుంది.ఈ సందర్భంగా హీరోయిన్ శాలిని కొండెపుడి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు ఇంతకుముందు నేను జయమ్మ పంచాయితీ, శుభం, మై డియర్ దొంగ చిత్రాలు చేశాను. తెలిసిన వారి ద్వారా ఈ సినిమాలో ఒక నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర ఉందని తెలిసింది. సింగీతం సినిమా అంటే ఎలాంటి పాత్ర అయినా చేయాలని నిర్ణయించుకున్నాను. ఆడిషన్‌కి వెళ్లాను. ఆడిషన్ ఇచ్చిన నెల రోజుల తర్వాత ఓకే అయ్యింది. ప్రతి ఆర్టిస్ట్‌కి కొంచెం శ్రుతిలో పాడటం రావాలి. ఇందుకోసం చాలా వర్క్‌షాప్స్ చేశాం. సింగీతం ప్రతి అంశాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఆయన విజన్ ప్రకారమే సినిమా రూపొందింది. ఆయన దర్శకత్వంలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ కథ 'కుబేరపురం' అనే ఒక ఫిక్షనల్ గ్రామంలో జరుగుతుంది. ఆ ఊరిలో ఏమి జరుగుతుంది? ఎందుకు అందరూ పాటల రూపంలో మాట్లాడతారు? అనేది థియేటర్‌లో చూసి ఆస్వాదించాల్సిందే. ఇది భారతీయ సినీ చరిత్రలోనే తొలి మ్యూజికల్ కామెడీ ఫిల్మ్. సింగీతం గత చిత్రాల తరహాలోనే వినూత్నమైన అనుభూతిని ఇస్తుంది. నేను చేసిన విలన్ పాత్ర కూడా బలంగా ఉంటుంది. తాను అనుకున్నది సాధించాలనుకునే మనస్తత్వం ఉన్న మనిషి. తాను నమ్మిందే నిజమని భావించే పాత్ర.ఈ పాత్రలో చాలా షేడ్స్ ఉన్నాయి. ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ఉంటుంది. కథలో చాలా కీలకమైన పాత్ర ఇది. హీరో, హీరోయిన్ పాత్రలతో పాటు నా పాత్ర కూడా చాలా ఎంటర్‌టైన్‌నింగ్ గా వుంటుంది. ఇలాంటి పాత్రలు తరచూ రావు. ఇలాంటి కథలో నటించే అవకాశం అందరికీ రాదు. ఈ సినిమా ద్వారా మాకు అలాంటి అరుదైన అదృష్టం దక్కింది. పాటలు పాడే నటులు చాలామంది ఉంటారు. కానీ ఇందులో మాటలనే పాటలాగా పాడాలి. అదే అసలు ఛాలెంజ్. సాధారణంగా గాయకులు పాట పాడేటప్పుడు ఒక విధంగా వాయిస్ , మాట్లాడేటప్పుడు మరో విధంగా వుంటుంది. కానీ ఇందులో మాట్లాడటమే పాటగా మారిపోతుంది. అది చాలా కష్టమైన ప్రక్రియ. దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. మాటలను పాటలుగా అద్భుతంగా మార్చారు. ఆయన సంగీతం గొప్ప బలాన్ని ఇచ్చింది. మంచి కథలు, మంచి పాత్రల కోసం చూస్తుంటాను. అలాంటి పాత్రలు వస్తే ప్రతి నెలా ఒక సినిమా చేయాలని ఉంటుంది.ఇంతముందుకు మై డియర్ దొంగ సినిమా నేనే రాశాను. నా నెక్స్ట్ సినిమా నా దర్శకత్వంలో ఉంటుంది. కథ కూడా నేనే రాస్తున్నాను. అందుకే నేనే డైరెక్ట్ చేస్తే బాగుంటుందని అనిపించింది. కామెడీ జానర్‌లో రూపొందుతోంది. ప్రేక్షకులను నవ్వించే సినిమాలు చేయడం నాకు ఇష్టం.

# కష్ట పడే వ్యక్తి ఆకాష్

## గాయని సునీత



తగాయని సునీత ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొత్త మలుపు' జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. భైరవి అర్థ్యా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వం వహించగా, తాటి బాలకృష్ణ నిర్మిస్తున్నారు. తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ మూవీని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనుంది. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర ట్రైలర్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ నటుడు భానుచందర్, ప్రముఖ గాయని సునీత, నిర్మాత సి కల్యాణ్, నటుడు రఘుబాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామీణ నేపథ్యంలోని రొమాంటిక్ ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రేమ, సస్పెన్స్, వినోదం సమపాళ్లలో ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. ఆకాష్, భైరవి బావ–మరదళ్ల పాత్రల్లో కనిపించనున్నారు. రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. యశ్వంత్ సంగీతం అందించారు. దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి మాట్లాడుతూ, రొమాంటిక్ లవ్ సస్పెన్స్ జానర్‌లో ఈ సినిమాను రూపొందించాం. ఆకాష్–భైరవి జోడీ చాలా బాగా కుదిరింది. కోనసీమ అందాలను తెరపై ఆవిష్కరిస్తూ, మంచి కామెడీతో కూడిన కథను ప్రేక్షకులకు అందిస్తున్నాం. జూన్ 12న సినిమా విడుదల కానుంది అన్నారు. గాయని సునీత మాట్లాడుతూ ఆకాష్ ఎంతో కష్టపడే వ్యక్తి. మంచి స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాను. ఇది అతనికి రెండో సినిమా. దర్శకుడు శివ ప్రేక్షకులకు వినోదాన్ని పంచే కథను తీసుకొచ్చారు. మైత్రి సంస్థ ఈ చిత్రానికి అండగా నిలవడం గర్వకారణం అన్నారు. సీనియర్ నటుడు భానుచందర్ మాట్లాడుతూ, ట్రైలర్ చాలా బాగుంది. హీరో, హీరోయిన్ ఇద్దరూ ఆకట్టుకున్నారు. ఈ చిన్న సినిమాను ప్రేక్షకులు పెద్ద విజయంగా నిలబెట్టాలి అన్నారు. నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ ఇది నాకు తొలి సినిమా. మా దర్శకుడికి తొలి చిత్రం. హీరోయిన్‌కు తొలి సినిమా హీరో ఆకాష్‌కు రెండో సినిమా. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి అని తెలిపారు. హీరో ఆకాష్ మాట్లాడుతూ ఈ చిత్రానికి మంచి కథ అందించిన దర్శకుడికి కృతజ్ఞతలు. మైత్రి మూవీస్ వంటి సంస్థ మద్దతు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. మా అమ్మ సునీతతో పాటు చిత్ర యూనిట్ అందరికీ ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ భైరవి ఆర్థ్యా, నిర్మాత సి.కల్యాణ్, రఘుబాబు మాట్లాడారు.

# 'పెళ్లైంది కాని నో కహాని' పోస్టర్ లాంఛ్



శ్రీహరి హీరోగా నటిస్తున్న సినిమా 'పెళ్లైంది కాని నో కహాని'. ఈ చిత్రంలో స్మిత హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీని మై3 సినిమాస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఏడుకొండలు తాడిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటటైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్ర పోస్టర్ ను హీరో రాజ్ తరుణ్ చేతుల మీదుగా లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'పెళ్లైంది కాని నో కహాని' మూవీ పోస్టర్ లాంచ్ చేయడం హ్యాపీగా ఉంది. ఈ పోస్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తోంది. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను దర్శకుడు ఏడుకొండలు తెరకెక్కించారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ ట్రెండ్ నడుస్తోంది. ఈ సినిమా కూడా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు.ఐఎఫ్ఎక్స్ అధినేత పద్మనాభరెడ్డి, డైరెక్టర్ ఏడుకొండలు తాడిశెట్టి, నటుడు జగన్మోహన్ రావు నటిస్తున్నారు.

# అన్నదమ్ముల కథతో వేణు కొత్త చిత్రం



చిన్న చిత్రంగా రిలీజై పెద్ద విజయాన్ని సాధించింది 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ మూవీ సక్సెస్ చిన్న చిత్రాల్లో ఎంతో స్ఫూర్తి నింపింది. ఇలాంటి బాక్సాఫీస్ సక్సెస్ అందుకున్న 'రాజు వెడ్స్ రాంబాయి' మేకర్స్ మరో కొత్త ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టారు. తెలంగాణలో పుట్టిన మరో మట్టి కథ పరిమళాన్ని ప్రేక్షకులకు అందించబోతున్నారు. ఈ చిత్రాన్ని దోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, ఆరాధ్య సినీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, సంధ్య భాను చల్లా నిర్మిస్తున్నారు. మధుకర్ రెడ్డి కోమిరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు.ఈ ఇంట్రెస్టింగ్ మూవీలో నటించేందుకు ఔత్సాహిక నటీనటులకు మేకర్స్ ఆహ్వానం పలుకుతున్నారు. 'తెలంగాణ యాస బాస అచ్చిన తెలుగోళ్ళంతా ఈడియోలు పెట్టుర్రి' అని ప్రకటించారు. నటన పట్ల ప్యాషన్, ప్రతిభ ఉన్న వారికి ఇదొక మంచి అవకాశంగా చెప్పుకోవచ్చు. ఇన్ స్టాగ్రామ్ రీల్స్ పంపవద్దని ఈ ప్రకటనలో మేకర్స్ కోరారు. ఆసక్తి గల నటీనటులు వారి వీడియోలను, ఇతర వివరాలను dsf.production02@gmail.com అనే మెయిల్ కు పంపవచ్చు లేదా 8096411437 అనే నెంబర్ కు వాట్సాప్ చేయవచ్చు అని నిర్మాత వేణు అడుగుల తెలిపారు. ఇద్దరు అన్నదమ్ముల పంచాయితీ తెలంగాణలోని జమ్మికుంట అనే ఊరు రాతనే ఎలా మార్చింది?, వారిలో ఎవరు గెల్చినా ఊరు మాత్రం ఎందుకు ఓడిపోయింది?, రామాయణంలో రామలక్ష్మ ణుల్లా కలిసి ఉండాల్సిన అన్నదమ్ములు మహాభారతంలో సోదరుల్లా గొడ్డళ్లు ఎందుకు పట్టుకున్నారు?. ఏఇంట్లోనూ జరగకూడని ఈ కథలో అసలు ఏం జరిగింది?. ఈ అన్నదమ్ముల పంచాయితీ ఏందో అంతా కలిసి చూద్దామంటూ కాస్టింగ్ కాల్‌లో మేకర్స్ ఇచ్చిన ఆహ్వానం ఆసక్తిని కలిగిస్తోంది. ఈ చిత్రానికి ప్రొడ్యూసర్స్ వేణు ఊదుగుల, సంధ్య భాను చల్లా, స్క్రిప్ట్, డైరెక్షన్ మధుకర్ రెడ్డి కోమిరెడ్డి.

# 'వేదవ్యాస్' షూటింగ్ పూర్తి



సకుటుంబ సకథా చిత్రాల దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి ప్రస్తుతం తన 43వ సినిమా 'వేదవ్యాస్' రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని అచ్చిరెడ్డి సమర్పణలో నూతన నిర్మాత కొమ్మూరి ప్రతాపరెడ్డి తన సాయి ప్రగతి ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో పిడుగు విశ్వనాథ్ హీరో గా అరంగేట్రం చేస్తుండగా...కొరియన్ నటి జూన్ హ్యూంజీ, మంగోలియన్ నటుడు షరన్ బోల్డ్ సెగ్మెంట్ తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతున్నారు. 'వేదవ్యాస్' సినిమా ప్రస్తుతం చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి 75వ జన్మదినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో పుట్టినరోజు వేడుకలతో పాటు 'వేదవ్యాస్' సినిమా మేకింగ్ వీడియో లాంఛ్ చేశారు. 38 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన దర్శకుడిగా ఎస్వీ కృష్ణారెడ్డికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్‌నేషనల్ నుంచి వరల్డ్ రికార్డ్ గుర్తింపు పత్రాన్ని అందజేశారుఈ కార్యక్రమంలో నిర్మాత కొమ్మూరి ప్రతాపరెడ్డి మ నటులు మురళీమోహన్, దర్శకుడు రేలంగి నరసింహారావు, నటుడు శ్రీకాంత్ , నటుడు జెడి చక్రవర్తి, దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి నిర్మాత అచ్చిరెడ్డి మాట్లాడారు.

# సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

**న్యూఢిల్లీ:** ఉత్తర ఢిల్లీలోని ముకుంద్‌పూర్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఒక ఘోర ప్రమాదం సంభవించింది. ఇషు విహార్ గల్లీ నంబర్ 1 లో ఉన్న ఒకే అంతస్తు భవనంలో గృహోపకరణాలకు రంగులు వేసే ఫ్యాక్టరీ నడుస్తోంది. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో ఈ భవనంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ఎల్పిజి గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ పేలుడు ధాటికి ఆ కాంక్రీట్ కట్టడం క్షణాల వ్యవధిలో కుప్పకూలిపోయింది. లోపల పనిచేస్తున్న కార్మికులంతా శిథిలాల కింద చిక్కుకుపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. అప్పటికే అక్కడ భారీగా దుమ్ము ధూళి అలుముకుంది. కొందరు స్థానికులు తమ ఫోన్లలో వీడియోలు తీయడం ప్రారంభించగా, మరికొందరు వీడియోలు ఆపి రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనాలని కోరారు. స్థానికులు చూపిన ఈ సమయస్ఫూర్తి వల్ల అగ్నిమాపక సిబ్బంది వచ్చే లోపే ముగ్గురు బాధితులను శిథిలాల నుండి ప్రాణాలతో బయటకు తీయగలిగారు. సమాచారం అందుకున్న ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ స్థానిక పోలీసులు 9:37 గంటలకల్లా ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను, శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారేమో కనిపెట్టడానికి ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి మొత్తం 11 మందిని వెలికితీశారు. గాయపడిన వారంతా ఆ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులేనని ఔటర్ నార్త్ డిసిపి హరీశ్వర్ స్పష్టం చేశారు. బాధితుల్లో 10 మందిని చికిత్స నిమిత్తం బాబు జగ్జీవన్ రామ్ మెమోరియల్ హాస్పిటల్, డాక్టర్ బాబా సాహెబ్ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ నివాస ప్రాంతంలోని భవనంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఫ్యాక్టరీ నడుపుతున్నారు.

# ప్రజాకాంక్షలు నెరవేరాలి

(మూడవ పేజీ తరువాయి)

కూనంనేని సాంబశివరావు నివాళులు అర్పించి, అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించా రు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకు లు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి.నరసింహా, కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, కలవేన శంకర్, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎన్.జ్యోతి, ఎస్.ఛాయాదేవి, విజయలక్ష్మి పండిత్, సదాలక్ష్మి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహా య కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, సబ్బు రాజమౌళి, జె. లక్ష్మి , ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, నాయకులు లక్ష్మి నారాయణ, ఉప్పలయ్య, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఎస్‌టియు నాయకులు కరుణాకర్ రెడ్డి, పర్వతరెడ్డి, తెలంగాణ గీతపనివారల సంఘం నాయకులు బొమ్మగాని నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



**తెలంగాణ చరిత్రను కమ్యూనిస్టు పార్టీ త్యాగాలను వేరు చేసి చూడలేం**

తెలంగాణ చరిత్రను, కమ్యూనిస్టు పార్టీ త్యాగాలను వేరు చేసి చూడలేమని కూనంనేని సాంబశివరావు అన్నారు. సాయుధ పోరాటం నుండి రాష్ట్ర సాధన వరకు సిపిఐ అనేక పోరాటాలు, త్యా గాలను చేసిందని తెలిపారు. 1945 నుండి సా గిన సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశపా లనకు వ్యతిరేకంగా మఖ్దూం మోహియుద్దీన్, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి మ హామహుల పిలుపుతో కొనసాగిన పోరాటంలో దాదాపు 5 వేల మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని స్మరించుకున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో సోనియా గాంధీ అన్ని పార్టీల మద్దతు కోరినప్పుడు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కాంక్షిస్తూ మొట్టమొదటి సంతకం పెట్టింది సిపిఐయేనని, ఆనాడు సిపిఐ జాతీయ, ప్రాంతీయ నాయకత్వం తీసుకున్న నిర్ణయం చా రిత్రాత్మకమైనదని కొనియాడారు.

రాష్ట్రం సిద్ధి ంచి ఇన్నేళ్లు అవుతున్నప్పటికీ ప్రజలు ఆశించిన 'ప్రజా తెలంగాణ' ఇంకా సిద్ధించలేదని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. సంపన్నులు మ రింత దోపిడీకి తెగబడుతుంటే, నిరుపేదలు, కార్మికుల జీవితాలు ఇంకా 'ఎక్కడ వేసిన గొం గళి అక్కడే' అన్న చందంగా మారాయని, ఆర్థిక సమానత్వం ఇంకా రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను నిజమైన 'ప్రజల తెలంగాణ' గా మార్చే వరకు, ప్రజల హక్కుల కోసం సిపిఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు, భవిష్యత్తు కార్యాచరణలు రూపొందించుకుని ముందుకు సాగుతామని ఆయన చెప్పారు.

# పెయిడ్ ఆర్టిస్ట్

(మూడవ పేజీ తరువాయి)

గెలికే ప్రయత్నం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని గతంలో అవహేళన చేసిన పవన్ కళ్యాణ్ వ్యక్తి ఇప్పుడు తెలంగాణ ప్రేమ గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినలేదని చెప్పిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణపై ప్రేమ ఉందని చెబుతున్నాడు అంటూ విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అమర వీరులు ప్రాణత్యాగాలు చేస్తుంటే ఎప్పుడైనా సంఘీభావం తెలిపారా అని ప్రశ్నించారు. ప్రజా గాయకుడు గద్దర్‌పై మాట్లాడిన తీరు కూడా అభ్యంతరకరమని పొన్నం ప్రభాకర్ అన్నారు. గద్దర్‌కు కారు కొనిచ్చానని చెప్పడం ఆయన అహంకారానికి నిదర్శనం అని విమర్శించారు. గద్దర్ ఆత్మకు పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ ఓ పెయిడ్ ఆర్టిస్ట్ అని ఆయనను బిజెపి, బిఆర్‌ఎస్‌లు ఎగేంజ్ చేసుకుని వాడుకుంటున్నాయని ఆరోపించారు.

అయితే పవన్ కళ్యాణ్‌కు బిజెపియో, బిఆర్‌ఎస్‌యో స్క్రిప్ట్ సరిగ్గా రాసి ఇవ్వకపోవడంతోనే అనేదో ఒక మాట, చెప్పేదో ఒక మాట అన్నట్టుగా ఉందని అని ఎద్దేవా చేశారు.ఒక సినిమాలో హీరోను పెట్టుకునే ముందు స్క్రీనింగ్ టెస్టింగ్ చేసినట్లే, బిజెపి వాళ్ళు పవన్ కళ్యాణ్‌తో 'టెస్ట్ డ్రైవ్' చేయిస్తున్నారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ 2009, 2014 ఎన్నికల్లో తిరిగినప్పుడు జనం వచ్చారని, వారు సినిమా నటుడిగా గౌరవించి ఈలలు వేస్తే అదే తన రాజకీయ బలమని భ్రమపడొద్దని హితవు పలికారు. సొంత రాష్ట్రమైన ఆంధ్రాలోనే నువ్వు గెలవలేకపోయావు, ఇక్కడికొచ్చి ఏంది ఇదంతా?' అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ప్రజాస్వామ్యయుతంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇండియాలో భాగమే.. పాస్‌పోర్ట్ తీసుకోవాలా అన్నట్టుగా మాట్లాడటం సరికాదు అని అన్నారు. హైదరాబాద్ అనేది ఒక లింగ్విస్టిక్ హెడ్ క్వార్టర్ అని, ఇక్కడ అన్ని భాషల వారు ఉంటారని, అన్ని వ్యాపారాలు సాగుతాయని తెలిపారు. 'తెలంగాణలో ఆంధ్రా వాళ్లకు ఏమి పని అని తాము ఎన్నడూ అనలేదని, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలంగాణ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుందని, తాము ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణకు రావడానికి, పోవడానికి తమకేమీ అభ్యంతరాలు లేవని, సినిమా నటుడిగా ఆయన ఎక్కడైనా తిరగొచ్చని అన్నారు.

# జనసేన పోటీ

(మూడవ పేజీ తరువాయి)

ఉపసంహరించుకోవాలని తానే సూచించానని తెలిపారు. అయితే ఆ తర్వాత కూడా తనపై ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం పెట్టి విమర్శలు చేయడం బాధ కలిగించిందన్నారు. ఇలాంటి విశ్లేషకుల వల్లే కమ్యూనిజం బలహీనపడిందని పవన్ వ్యాఖ్యానించారు.ప్రాంతీయ వాదమే.. కాంగ్రెస్ వాదమా?: ప్రాంతీయ వాదమే.. కాంగ్రెస్ వాదమా అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పద్ధతి అంటూ లేదన్నారు. జాతీయ పార్టీ ప్రాంతీయ వాదం గురించి మాట్లాడటం సరికాదన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు తీసుకుని వెళ్లాలా అని పవన్ ప్రశ్నించారు. మీరు భయపెట్టే కొద్దీ.. మా గుండె మరింత గట్టిపడుతుందని పవన్ స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రతి సమస్యకూ ఆంధ్ర ప్రజలనే కారణంగా చూపడం సరైంది కాదని పవన్ అన్నారు. పాలకులు వేరు, ప్రజలు వేరని గుర్తించాలన్నారు. తెలంగాణకు అన్యాయం చేసిన పాలకులను విమర్శించాలి గానీ, సాధారణ ప్రజలపై ద్వేషం పెంచడం తగదని హితవు పలికారు. సమాజంలో గొడవలు రేపడం తనకు ఇష్టం లేదని, అందుకే అనేక సందర్భాల్లో తాను సంయమనం పాటించానన్నారు. ప్రజాగాయకుడు గద్దర్‌పై కూడా పవన్ స్పందించారు. గద్దర్ జీవించి ఉన్న సమయంలో ఇప్పుడు మాట్లాడుతున్న నేతలు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. గద్దర్ తన ఆరోగ్య పరిస్థితి కారణంగా కారు కావాలని కోరితే, మూడు రోజుల్లోనే కొనిచ్చానని గుర్తుచేశారు. వైఎస్సార్ హయాంలో తెలంగాణ అంశంపై కాంగ్రెస్ నేతల గొంతులు ఎందుకు వినిపించలేదని ప్రశ్నించారు. సీనియర్ జర్నలిస్టు, విశ్లేషకుడు పాశం యాదగిరి తనపై తీవ్ర విమర్శలు చేయడం బాధ కలిగించిందన్నారు. గతంలో ఆయనతో స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, పలుమార్లు తన ఇంట్లో సమావేశమయ్యామని గుర్తుచేశారు. ఎంత భయపెట్టినా మా గుండె మరింత గట్టిపడుతుంది అంటూ విమర్శకులకు హెచ్చరికలు జారీ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ దక్షిణాదిలో ఎక్కడైనా పోటీ చేయవచ్చని, గతంలో ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీ చేస్తే తప్పులేదని, అయితే జనసేన తెలంగాణలో ప్రజల తరఫున పోరాటం చేస్తే ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై సెటైర్లు వేశారు. తెలంగాణలో పెరుగుతున్న ప్రాంతీయ విద్వేషాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరిన పవన్ కళ్యాణ్.. రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో జనసేన పార్టీ స్వతంత్రంగా పోటీ చేస్తుందని ప్రకటించారు. 2029 ఎన్నికల్లో బిజెపితో పొత్తు ఉంటుందో లేదో ఇప్పుడే చెప్పలేమని, కానీ తెలంగాణలో జనసేన పోటీ మాత్రం ఖాయమని స్పష్టం చేశారు.

# 60 ఏళ్ల కల సాకారం

(మూడవ పేజీ తరువాయి)

పోరాటం నుంచి మలిదశ ఉద్యమం వరకు ఈగడ్డ సింహభాగం పాత్ర పోషించిందని కొనియాడారు.నాడు ప్రజల ఆకాంక్ష కోసం తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా విసిరికొట్టి ఆమరణ నిరాహార దీక్షకు దిగిన చరిత్ర తనదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రగతి పథంలో దూసుకుపోతోందని,జిల్లాను అభివృద్ధి, సంక్షేమంలో అగ్రభాగాన నిలబెట్టే బాధ్యత తనదని స్పష్టం చేశారు.రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు జరుగుతున్న ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సాధించిన వివిధ శాఖల ప్రగతి వివరాలను మంత్రి వెల్లడించారు.మహాలక్ష్మి పథకం ద్వార జిల్లాలో మహిళలు,ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు 10 కోట్ల 83 లక్షల ఉచిత ప్రయాణాల ద్వారా రూ.508.85 కోట్ల లబ్ధి చేకూరింది. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద 2,52,963 మంది లబ్ధిదారులకు రూ.44.12 కోట్ల సబ్సిడీ అందించారు.ధాన్య సేకరణలో ప్రథమ స్థానం ఉందని యాసంగి 202526 సీజన్‌లో క్వింటాకు రూ.2,389 మద్దతు ధర చెల్లించి,459 కేంద్రాల ద్వారా 7,24,033 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి నల్గొండ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపిన జిల్లా కలెక్టర్‌ను మంత్రి అభినందించారు.ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే 78,650 మంది రైతుల ఖాతాల్లో రూ.1,223.88 కోట్లు జమ చేశారు.అలాగే రైతు భరోసా కింద వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి వందల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతు రుణమాఫీ పథకం కింద 2,33,981 మంది రైతులకు రూ.2,004.83 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి.ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో జిల్లాకు 18,837 ఇండ్లు మంజూరు కాగా, పురోగతిలో ఉన్న గృహాలకు ఇప్పటివరకు రూ.275 కోట్లు లబ్ధిదారులకు చెల్లించారు. 2,067 గృహాలు పూర్తి కాగా, రెండవ విడతలో ప్రతి నియోజకవర్గానికి మరో 2,000 ఇండ్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎస్‌పి శరత్ చంద్ర పవార్,అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి,డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,స్థానిక కార్పొరేటర్ కవిత,జిల్లా అధికారులు,ఇతర ప్రజాప్రతినిధులు,సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# ఐదుగురు ప్రమాణం

(మూడవ పేజీ తరువాయి)

బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సచ్‌దేవ, జమ్మూ కశ్మీర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా జస్టిస్ అరుణ్ పల్లి, సీనియర్ అడ్వకేట్ వి.మోహనల నియామకానికి సోమవారం కేంద్రం ఆమోదం తెలిపింది. సిజెఐతో సహా సుప్రీంకోర్టుకు మంజూరైన సభ్యుల సంఖ్యను 34నుంచి 38కి పెంచేందుకు ప్రభుత్వం గత నెలలో ఒక చట్టాన్ని సవరిస్తూ ఒక ఆర్డినెన్స్ జారీచేసింది. సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ జె.కె. మహేశ్వరిలు జూన్ 16, జూన్ 28లలో పదవీవిరమణ చేయనున్నారు. మే 27న సుప్రీంకోర్టు కొలీజియం 5 కొత్త పేర్లను సిఫార్సు చేయగా నాలుగు రోజుల్లోనే నియామకాలు పూర్తి అయ్యాయి. 2018లో జస్టిస్ ఇందు మల్హోత్రా తర్వాత, బార్ నుండి నేరుగా సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందిన దేశంలో రెండవ మహిళగా జస్టిస్ మోహన నిలిచారు. ఆమె సుప్రీంకోర్టులో పనిచేస్తున్న ఇద్దరు మహిళా న్యాయమూర్తులలో ఒకరు కానున్నారు. జస్టిస్ మోహన మరొకరు 2021 ఆగస్టు 31నుంచి అత్యున్నత న్యాయస్థానం జడ్జిగా పనిచేస్తున్న బి.వి.నాగరత్న ఒకరుగా ఉన్నారు.జస్టిస్ బి.వి.నాగరత్న 2027లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కానున్నారు. ఆమె భారత ప్రధాన న్యాయమూర్తిగా ఒక నెలకు పైగా ఆ పదవిలో కొనసాగనున్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com